# శుభోదయం!

ప్రతీ అక్షరం..ప్రజా సమరం......!

WWW.SUBHODAYAMDAILY.COM

అమరావతి,హైదరాబాద్, సంపుటి : 02, సంచిక : 19, పేజిలు : 08, ఎడిటర్ : వి. శ్రీనివాసరావు (6281773157) మంగళవారం - 08 - ఏప్రిల్ - 2025


## ట్రంప్ టారిఫ్ ల దెబ్బకు మార్కెట్లు కుదేల్




అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ విధించిన టారిఫ్ ల ప్రభావం స్టాక్ మార్కెట్లపై తీవ్రంగా పడింది భయాలతో మార్కెట్లు పతనమయ్యాయి

ఢిల్లీ: అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ విధించిన టారిఫ్ ల ప్రభావం స్టాక్ మార్కెట్లపై తీవ్రంగా పడింది. భారత స్టాక్ మార్కెట్లు భారీగా నష్టపోయాయి. కేవలం పది సెకన్ల వ్యవధిలోనే మిగతా..2లో

## 25 ఏళ్ల తర్వాత ఆ దేశాలకు భారత రాష్ట్రపతి



- పోర్చుగల్, స్లోవేకియా దేశాల పర్యటనకు వెళ్లిన భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము
- 25 సంవత్సరాల తర్వాత ఆ దేశాలకు భారత రాష్ట్రపతి ఆ దేశాల్లో పర్యటించడం ఇదే మొదటి సారన్న విదేశీ వ్యవహారాల శాఖ అధికార ప్రతినిధి
- లిస్బన్ - భారత్ దౌత్య సంబంధాలకు 50 ఏళ్లు పూర్తయిన సందర్భంగా ముర్ము పోర్చుగల్ పర్యటన

## ముఖ్యంగా ఈ మూడు తగ్గిస్తే ఆరోగ్య సమస్యలు దరిచేరవు

వైద్యం, ఆరోగ్యంపై సీఎం చంద్రబాబు పవర్ పాయింట్ ప్రజంటేషన్

- చాలా వ్యాధుల నివారణకు డైట్ కంట్రోల్ తప్పనిసరి అని వెల్లడి
- ప్రజలు ప్రతి రోజు అరగంట వ్యాయామం చేయాలని సూచన
- వీలైతే ప్రాణాయామం కూడా చేయాలని పిలుపు




అమరావతి: వైద్యం, ఆరోగ్యం, ఆహారం అంశంపై సీఎం చంద్రబాబు నేడు పవర్ పాయింట్ ప్రజంటేషన్ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, అనేక వ్యాధులు మన ఆహారపు అలవాట్ల కారణంగానే వస్తుంటాయని వెల్లడించారు. చాలా వ్యాధుల నివారణకు డైట్ కంట్రోల్ చేసుకోవడం తప్పనిసరి అని పేర్కొన్నారు. అదేలాగో కూడా చంద్రబాబు వివరించారు. "నలుగురు సభ్యులు ఉన్న కుటుంబంలో ఉప్పు నెలకు 600 గ్రాముల మాత్రమే వాడాలి. వంట నూనె కూడా నెలకు 2 లీటర్లు మాత్రమే వాడాలి. చక్కెర కూడా నెలకు 3 కిలోలు వాడితే సరిపోతుంది. సమతుల్యమైన మిగతా..2లో

రాజధాని అమరావతి లో గ్లోబల్ మెడ్‌సిటీని ఏర్పాటు చేయాలని భావిస్తున్నామని ఏపీ సీఎం చంద్రబాబు తెలిపారు. రాష్ట్రంలోని ప్రతి నియోజకవర్గంలో 100 నుంచి 300 పడకల ఆస్పత్రుల నిర్మాణానికి ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు వెల్లడించారు. వైద్యం, ఆరోగ్యంపై మీడియా ఎదుట సీఎం పవర్ పాయింట్ ప్రజంటేషన్ ఇచ్చారు. రాష్ట్రంలో పెరిగిన వైద్య ఖర్చులు, వివిధ వ్యాధులపై సీఎం వివరాలు తెలిపారు. "కుప్పంలో డిజిటల్ హెల్త్ నర్వ్ సెంటర్ ఏర్పాటు చేశాం. కొన్నిచోట్ల గుండెజబ్బులు, డయాబెటిస్, హైపర్‌టెన్షన్, శ్వాసకోశ వ్యాధులు విస్తృతంగా పెరుగుతున్నాయి. రాష్ట్రంలో పురుషుల కంటే మహిళల్లో హైపర్‌టెన్షన్ అధికంగా కనిపిస్తోంది. ఆహారపు అలవాట్ల వల్ల డయాబెటిస్ కొన్ని జిల్లాల్లో ఎక్కువగా ఉంది" అని సీఎం వివరించారు.

## మంగళగిరిని దేశంలోనే అభివృద్ధికి చిరునామాగా మారుస్తా

### మీరు నా గౌరవం, పరువు నిలబెట్టారు... మీ కోసం అహర్నిశలు శ్రమిస్తా

మంగళగిరిలో మన ఇల్లు-మన లోకేశ్ కార్యక్రమం

పట్టాలు పంపిణీ చేసిన మంత్రి లోకేశ్

మంగళగిరి: మంగళగిరిని దేశంలోనే అభివృద్ధికి చిరునామాగా మారుస్తానని, నెంబర్ వన్ నియోజకవర్గంగా తీర్చిదిద్దడానికి ప్రజల సహకారం అవసరమని రాష్ట్ర విద్య, ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి



నారా లోకేశ్ అన్నారు. 'మన ఇల్లు - మన లోకేశ్' కార్యక్రమంలో భాగంగా తాడేపల్లి మండల పరిధిలోని పెనుమాక, ఉండవల్లి, ఇప్పటం ప్రజలకు యర్రబాలెం డాన్ బాస్కో స్కూలు ఆవరణలో పట్టాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి లోకేశ్ మాట్లాడుతూ, మిగతా..2లో



## 14 దేశాలకు వీసాలు ఆపేసిన సౌదీ అరేబియా..

### జాబితాలో ఇండియా, పాకిస్థాన్

హజ్ యాత్రకు సమయం దగ్గర పడుతున్న తరుణంలో సౌదీ కీలక నిర్ణయం

గత హజ్ సందర్భంగా 1,200కు పైగా మృతి

రిజిస్టర్ కాని యాత్రికుల వల్ల తీవ్ర రద్దీ

ఉమ్రా, బిజినెస్, కుటుంబ సందర్శన తదితర కేటగిరీ వీసాలపై ఈ నిషేధం



## హెచ్‌సీయూ విద్యార్థులపై కేసులను వెంటనే ఉపసంహరించండి

జ్యుడిషియల్ రిమాండ్ లో ఉన్న ఇద్దరు విద్యార్థులకు సంబంధించి కేసుల ఉపసంహరణకు వెంటనే చర్యలు చేపట్టాలి

కేసుల ఉపసంహరణ క్రమంలో ఎటువంటి న్యాయపరమైన సమస్యలు ఉత్పన్నం కాకుండా పోలీస్ అధికారులకు తగు సూచనలు

## గోదావరి-బనకచర్ల ప్రాజెక్టుపై చర్చ




హైదరాబాద్: గోదావరి నదీ యాజమాన్య బోర్డు (జీఆర్ఎంబీ) ఛైర్మన్ ఏకే ప్రధాన్ అధ్యక్షతన హైదరాబాద్‌లోని జలసౌధలో జీఆర్ఎంబీ సమావేశం జరిగింది. ఏపీ ప్రభుత్వం తలపెట్టిన గోదావరి - బనకచర్ల ప్రాజెక్టు గురించి తెలంగాణ ప్రస్తావించింది. ఏపీ ప్రభుత్వం సమాచారం, వివరాలు దాచిపెడుతోందని తెలంగాణ అధికారులు ఆరోపించారు. ప్రాజెక్టు అంశంపై బోర్డుకు కేంద్రం నుంచి లేఖ వచ్చి 5 నెలలు గడిచాయని, కేంద్రం నుంచి లేఖలు వచ్చినా తమకు కనీస సమాచారం ఇవ్వలేదని అన్నారు. బనకచర్ల ప్రాజెక్టు పూర్తి వివరాలు, దానివల్ల తెలంగాణపై ప్రభావం మిగతా..2లో

## రోడ్లకు నిధులు కోరితే 24 గంటల్లో సీఎం మంజూరు చేశారు

అడవి తల్లిని నమ్ముకుంటే మనకు బువ్వ పెడుతుంది.. నీడనిస్తుందని ఏపీ డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ అన్నారు.

అరకు అద్భుతమైన ప్రాంతం... దీన్ని సరిగా ఉపయోగించుకోవాలి

ల్లూరి జిల్లాలో పవన్ కల్యాణ్ పర్యటన

దుంబ్రిగూడలో అడవితల్లి బాట కార్యక్రమం

అడవితల్లిని నమ్ముకుంటే అన్నం పెడుతుందని వెల్లడి



దుంబ్రిగుడ: అడవి తల్లిని నమ్ముకుంటే మనకు బువ్వ పెడుతుంది.. నీడనిస్తుందని ఏపీ డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ అన్నారు. అల్లూరి సీతారామరాజు జిల్లా దుంబ్రిగుడలో 'అడవితల్లి బాట' కార్యక్రమానికి ఆయన శ్రీకారం చుట్టారు. పలు ప్రాంతాల్లో

## యువతకు ఉద్యోగాలు ఇవ్వండి

- బీహార్ యువతకు ఉద్యోగాలు ఎందుకివ్వలేదని రాహుల్ గాంధీ నిలదీత
- తమ భవితవ్యాన్ని తాము రాసుకోవడానికి బీహార్ యువత సిద్ధంగా ఉందన్న రాహుల్ గాంధీ



న్యూఢిల్లీ : బీహార్ ప్రభుత్వ అధికారులు, రాజకీయ నాయకులు పారిపోవద్దని, యువతకు ఉద్యోగాలు కల్పించాలని ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ అన్నారు. బీహార్‌లోని బెగుసరాయ్‌లో ఎన్ఎస్‌యూఐ నేషనల్ ఇన్‌ఛార్జ్ కన్హయ్య కుమార్ ఆధ్వర్యంలో ర్యాలీ జరిగింది. ఈ కార్యక్రమంలో రాహుల్ గాంధీ మాట్లాడుతూ, బీహార్ యువతకు రాష్ట్రంలోనే ఉద్యోగాలు ఎందుకు



## తెలంగాణలో వచ్చే మూడు రోజులు వర్షాలు!

## నీట్‌ను ఎందుకు రద్దు చేయలేదు?.. సుప్రీం కోర్టుకు దీదీ సూటి ప్రశ్న




"మా గుండె బండరాయేం కాదు. ఈ నిర్ణయాన్ని మేం అంగీకరిస్తున్నామని మీరు భావించొద్దు. ఇలా మాట్లాడుతున్నందుకు నేను జైలుకు వెళ్లాల్సి వస్తుందని నాకు తెలుసు. కానీ అదేం పట్టించుకోను. కొందరు చేసిన తప్పులకు మీ జీవితాలను బలికానివ్వం. నాలో ఊపిరి ఉన్నంత వరకు మిమ్మల్ని రోడ్డున పడనివ్వను" అంటూ పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ భావోద్వేగంగా ప్రసంగించారు.




## దేశవ్యాప్తంగా పెరిగిన పెట్రోల్, డీజిల్ ధరలు

- ప్రపంచ చమురు ధరలలో కొనసాగుతున్న హెచ్చుతగ్గులు, ట్రంప్ సుంకాల మధ్య ప్రభుత్వం ఈ నిర్ణయం
- పెట్రోల్, డీజిల్‌పై ఎక్సైజ్ సుంకాన్ని లీటరుకు రూ. 2

## తెలంగాణలో నూతన ఎమ్మెల్సీల ప్రమాణ స్వీకారం



హైదరాబాద్: భారతీయ జనతా పార్టీకి చెందిన అంజిరెడ్డి, మల్క కొమురయ్య శాసనమండలి సభ్యులుగా ప్రమాణ స్వీకారం చేశారు. నూతన ఎమ్మెల్సీలతో మిగతా..2లో

- బీజేపీకి చెందిన అంజిరెడ్డి, మల్క కొమురయ్య ప్రమాణం
- ప్రమాణం చేయించిన చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి
- ముఖ్యమంత్రి సహా పలువురి అండతో తనకు అవకాశం వచ్చిందన్న అద్దంకి దయాకర్




సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ ల కృషి వల్లేనని ఎంపీల వివరణ

ఏపీ రాజధాని అభివృద్ధికి కేంద్రం కట్టుబడి ఉందంటున్న నేతలు

కూటమి పాలనలో రాష్ట్రం వేగంగా అభివృద్ధి చెందుతుందని వెల్లడి

అమరావతి: ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతి అభివృద్ధికి కేంద్రం తాజాగా నిధులు విడుదల చేసింది. ప్రపంచ బ్యాంకు, ఏడీబీ మద్ధతుతో అమరావతికి రూ.4200 కోట్లు రిలీజ్ చేసినట్లు ప్రకటించింది. ఏపీలో కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక రాష్ట్ర అభివృద్ధితో పాటు అమరావతి అభివృద్ధిపై ప్రత్యేక శ్రద్ధ పెట్టింది. నిధుల కోసం మిగతా..2లో

# నీట్‌ను ఎందుకు రద్దు చేయలేదు?.. సుప్రీం కోర్టుకు దీదీ సూటి ప్రశ్న

కోల్‌కతా: సుప్రీం కోర్టు తీర్పుతో ఉద్యోగాలు పోగొట్టుకున్న ఉపాధ్యాయులతో సోమవారం నేతాజీ ఇండోర్ స్టేడియంలో మమతా బెనర్జీ సమావేశమయ్యారు. ఈ సందర్భంగా నీట్ ప్రవేశ పరీక్ష మీద సర్వోన్నత న్యాయస్థానం గతంలో ఇచ్చిన తీర్పుపై ఆమె ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. "విద్యా వ్యవస్థను ఉల్లంఘించే హక్కు ఎవరికీ లేదు. ఒకవేళ అలా ఉంటే ఎవరికి ఉంటుంది? ఎవరికి ఉండదు? అనే విషయంపై సుప్రీం కోర్టు స్పష్టత ఇవ్వాలి. బీజేపీ పాలిత మధ్యప్రదేశ్‌లో వ్యాపం కేసులో పలువురి ప్రాణం పోయింది. వాళ్లకు ఇప్పటిదాకా న్యాయం జరగలేదు. .. నీట్ ప్రవేశ పరీక్షపైనా ఎన్నో ఆరోపణలు వచ్చాయి. కానీ ఆ పరీక్షను సుప్రీం కోర్టు రద్దు చేయలేదు. అలాంటప్పుడు బెంగాల్‌నే లక్ష్యంగా చేసుకోవడం ఎందుకు?. ఇక్కడి మేధస్సును భయపెట్టాలనుకుంటున్నారా? దీనికి సమాధానం కావాలి" అని మమత అన్నారు. ఈ విషయాలపై సుప్రీం కోర్టు ఒక స్పష్టత ఇస్తే.. మేం రుణపడి ఉంటాం. ఒకవేళ ఇవ్వకుంటే.. మీకు అండగా ఎలా నిలబడాలో మేం దారి కనిపెడతాం. రెండు నెలలుగా మీరు ఇబ్బంది పడుతున్నారని తెలుసు. అలాగని మిమ్మల్ని 20 ఏళ్లు బాధపెట్టే ఉద్దేశం మాకు లేదు. ఈ రెండు నెలలకు కూడా మీకు పరిహారం చెల్లిస్తాం. మూడు నెలల్లో నియామక ప్రక్రియ తిరిగి చేపట్టాలని సుప్రీం కోర్టు తీర్పు ఇచ్చింది. కోర్టు ఆదేశాలకు మేం కట్టుబడి ఉన్నాం. కానీ, ఈ వ్యవహారంపై స్పష్టత కోరాం. ఆ స్పష్టత రాగానే తీర్పుపై రివ్యూ పిటిషన్ కూడా వేస్తాం. మీకింకా ఉద్యోగాల నుంచి తొలగించినట్లు లేఖలు రాలేదు. కాబట్టి మీ పని మీరు చేసుకోండి. మీ ఉద్యోగాలకు మాది భరోసా. నా శరీరంలో ఊపిరి ఉన్నంత వరకు రోడ్డున పడే దుస్థితి మీకు రానివ్వను అని అన్నారామె. అంతకు ముందు.. సుప్రీం కోర్టు తీర్పుకు ప్రభుత్వ పరంగా కట్టుబడి ఉంటామన్న ఆమె, వ్యక్తిగతంగా మాత్రం అంగీకరించబోనంటూ వ్యాఖ్యానించిన సంగతి తెలిసిందే. ఇదే సమయంలో.. విపక్ష బీజేపీ, సీపీఎంలపైనా ఆమె విరుచుకుపడ్డారు. ఇది తమ ప్రభుత్వంపై దాడేనని అంటున్నారామె. నన్ను టార్గెట్ చేసి.. ఇబ్బంది పెట్టాలనే ఉద్దేశంతో టీచర్ల ఉద్యోగాలను లాక్కోవాలని చూడకండి. గాయపడిన పులి మరింత ప్రమాదకరమైంది. గుర్తుంచుకోండి అని విపక్షాలకు హెచ్చరిక జారీ చేశారు. అంతకు ముందు కోర్టు తీర్పులతో ఉద్యోగాలు కోల్పోయిన టీచర్లు మాట్లాడుతూ.. తాము రివ్యూ పిటిషన్ వేయబోతున్నామని, ఈ విషయంలో బెంగాల్ ప్రభుత్వం.. స్కూల్ సర్వీస్ కమిషన్ తమతో కలిసి రావాలని కోరారు.

## గోదావరి-బనకచర్ల ప్రాజెక్టుపై చర్చ




మొదటి పేజి తరువాయి

బనకచర్ల ప్రాజెక్టు పూర్తి వివరాలు, దానివల్ల తెలంగాణపై ప్రభావం తదితర వివరాలు ఏపీ ప్రభుత్వం అందించాలని తెలంగాణ అధికారులు బోర్డును కోరారు. అనుమతులు లేకుండా ప్రాజెక్టు చేపడుతున్నారని తెలంగాణ అధికారులు అభ్యంతరం వ్యక్తం చేశారు. దీనిపై స్పందించిన ఏపీ అధికారులు బనకచర్ల ప్రాజెక్టుకు ఇంకా డీపీఆర్ తయారు చేయలేదని వివరణ ఇచ్చారు. మరోవైపు పెదవాగు ప్రాజెక్టు ఆధునీకరణ పనులపై సమావేశంలో చర్చించారు. రూ.15 కోట్లతో తక్షణ మరమ్మతులు చేయాలని నిర్ణయించారు. ఈ సందర్భంగా జీఆర్ఎంబీ కార్యదర్శి అజగేషన్ వ్యవహార శైలిని తెలంగాణ అధికారులు ప్రస్తావించారు. రాష్ట్రాలను సంప్రదించకుండానే బోర్డు సమావేశాలు నిర్వహిస్తున్నారని ఆరోపించారు. అంతేకాకుండా జీఆర్ఎంబీలో డిప్యుటేషన్‌పై పని చేస్తున్న ఏపీ, తెలంగాణకు చెందిన అధికారులను అజగేషన్ వేధిస్తున్నారని, మహిళా ఉద్యోగులను అసభ్యకర మాటలతో దూషిస్తున్నారని ఫిర్యాదు చేశారు. ఈ సమావేశంలో తెలంగాణ నీటి పారుదలశాఖ ముఖ్య కార్యదర్శి రాహుల్ బొజ్జా, ఇంజినీర్ ఇన్ చీఫ్ అనిల్, ఆంధ్రప్రదేశ్ జలవనరుల శాఖ ఇంజినీర్ ఇన్ చీఫ్ వెంకటేశ్వరరావు తదితర ముఖ్య అధికారులు పాల్గొన్నారు.

## ట్రంప్ టారిఫ్ ల దెబ్బకు మార్కెట్లు కుదేల్




ఢిల్లీ: అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ విధించిన టారిఫ్ ల ప్రభావం స్టాక్ మార్కెట్లపై తీవ్రంగా పడింది. భారత స్టాక్ మార్కెట్లు భారీగా నష్టపోయాయి. కేవలం పది సెకన్ల వ్యవధిలోనే మదుపర్ల సంపద రూ.20 లక్షల కోట్లు ఆవిరైపోయింది. ప్రపంచ దేశాల మధ్య టారిఫ్ వార్ ఆందోళనలు, మాంద్యం భయాలతో మార్కెట్లు పతనమయ్యాయి. సోమవారం ట్రేడింగ్ ఆరంభంలో సెన్సెక్స్ 3,939.68 పాయింట్లు (5.22 శాతం) కుంగింది. ఆ సమయంలో బీఎస్ఈ నమోదిత కంపెనీల మార్కెట్ విలువ రూ. 20,16,293.53 కోట్లు తగ్గి.. రూ. 3,83,18,592.93 కోట్లకు చేరింది. బీఎస్ఈ మిడ్‌క్యాప్, స్మాల్‌క్యాప్ సూచీలు 10 శాతం మేర కుంగాయి.

కారణాలు ఇవేనంటున్న నిపుణులు..

ట్రంప్ టారిఫ్‌లతో ద్రవ్యోల్బణం పెరిగి కార్పొరేట్ లాభాలు తగ్గే అవకాశం ఉందని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. ఈ అంచనాలు వినియోగదారుల సెంటిమెంట్ పై ప్రతికూల ప్రభావం పడి ఆర్థిక వృద్ధి నెమ్మదించవచ్చని చెప్పారు. ఈ పరిణామాలతో మాంద్యం తప్పదనే భయాలు నెలకొన్నాయి. ప్రపంచవ్యాప్తంగా ఆర్థిక మాంద్యం నెలకొనే అవకాశాలు 60 శాతం ఉందని జేపీ మోర్గాన్ అంచనా వేసింది. సుంకాలపై వెనక్కి తగ్గేది లేదని ట్రంప్ మరోసారి స్పష్టం చేయడంతో మదుపర్లలో ఆందోళన నెలకొంది. ఈ అనిశ్చితుల నేపథ్యంలో ఏప్రిల్‌లో ఫారిన్ పోర్ట్‌ఫోలియో ఇన్వెస్టర్లు (ఎఫ్‌పీఐ) తమ పెట్టుబడులను ఉపసంహరించుకుంటున్నారు. ఈ నెలలో ఇప్పటివరకు రూ.13,730 కోట్ల విలువైన ఈక్విటీలను ఎఫ్‌పీఐలు విక్రయించారు. ఈ అమ్మకాలు మరింత ఎక్కువగా ఉండొచ్చని నిపుణుల అంచనా. ద్రవ్య పరపతి విధాన సమీక్ష ప్రారంభించిన ఆర్ బీఐ ఈ నెల 9న నిర్ణయాలను వెల్లడించనుంది. ఈ నేపథ్యంలో మదుపర్లు విక్రయాలకు మొగ్గు చూపడంతో మార్కెట్లు బేర్‌మన్నాయి.

## అమరావతికి రూ.4200 కోట్లు
# రిలీజ్ చేసిన కేంద్రం

మొదటి పేజి తరువాయి

అమరావతికి రూ.4200 కోట్లు రిలీజ్ చేసినట్లు ప్రకటించింది. ఏపీలో కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక రాష్ట్ర అభివృద్ధితో పాటు అమరావతి అభివృద్ధిపై ప్రత్యేక శ్రద్ధ పెట్టింది. నిధుల కోసం ముఖ్యమంత్రి చంద్రబాబు పలుమార్లు ఢిల్లీకి వెళ్లి కేంద్ర మంత్రులను కలిసి విజ్ఞప్తి చేశారు. ఈ క్రమంలోనే కేంద్రం తాజాగా అమరావతి అభివృద్ధికి నిధులు విడుదల చేసింది. పోలవరం, విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రాజెక్టులకు సైతం చేయూతనిచ్చింది. వేల కోట్ల నిధులను ఇప్పటికే అందించింది. ఈ విషయంపై కూటమి పార్టీల ఎంపీలు మాట్లాడుతూ .. ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ల కృషి వల్లే రాష్ట్రానికి నిధులు వస్తున్నాయని చెప్పారు. తాజాగా విడుదల చేసిన నిధులతో ఏపీ మరింత అభివృద్ధి చెందుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

## రోడ్లకు నిధులు కోరితే
## 24 గంటల్లో సీఎం మంజూరు చేశారు

మొదటి పేజి తరువాయి

అల్లూరి సీతారామరాజు జిల్లా డుంబ్రిగుడలో 'అడవితల్లి బాట' కార్యక్రమానికి ఆయన శ్రీకారం చుట్టారు. పలు ప్రాంతాల్లో రోడ్ల నిర్మాణానికి పవన్ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా డుంబ్రిగుడలో నిర్వహించిన సభలో ఆయన మాట్లాడారు. "గిరిజన ప్రాంతాల్లో రోడ్ల నిర్మాణానికి నిధులు కావాలని సీఎం చంద్రబాబు ను కోరితే 24 గంటల్లో రూ.49 కోట్లు మంజూరు చేశారు. ఆయనకు మనస్ఫూర్తిగా ధన్యవాదాలు చెబుతున్నాను. అడవి, ప్రకృతిపై నాకు అపారమైన ప్రేమ, గౌరవం ఉన్నాయి. అరకు అద్భుతమైన ప్రాంతం.. దీన్ని సద్వినియోగం చేసుకోవాలి. పర్యాటకంగా మరింత అభివృద్ధి చేయాలి. మన్యం ప్రాంతాల్లో సరైన రహదారి సౌకర్యం లేక ఇబ్బందులు పడుతున్నారు. గిరిజన ప్రజల జీవనశైలి మెరుగుపరచాలి. ఈ ప్రాంతంలో రోడ్లు బాగుండాలి. గత ప్రభుత్వం ఐదేళ్లలో రోడ్లకు రూ.92 కోట్లే ఖర్చు చేసింది. కూటమి ప్రభుత్వం వచ్చాక ఏడాదిలోపే రూ.1,500 కోట్ల విలువైన పనులను మంజూరు చేశాం. టెండర్లు కూడా పిలిచాం. వారంరోజుల్లో పనులు ప్రారంభమవుతాయి. ఈ ప్రాంతంలో కూటమి పార్టీలకు ఓట్లు పడకపోయినా మీ బాగోగులు చూడటానికి మేం ఉన్నాం. ప్రభుత్వాలు, పార్టీలు మారుతుంటాయి. ఏ పార్టీ అధికారంలో ఉన్నా అభివృద్ధి జరగాలి" అని పవన్‌కల్యాణ్ అన్నారు. అంతకుముందు పెదపాడు గ్రామంలో గిరిజనులతో పవన్ సమావేశమయ్యారు. చాపురాయి ప్రాంతాన్ని దాటుకుంటూ గిరిశిఖర గ్రామానికి ఆయన వెళ్లారు. అక్కడి ప్రజలతో సుమారు గంటసేపు మాట్లాడి వారి సమస్యలు తెలుసుకున్నారు. స్థానిక సమస్యలను ఆరు నెలల్లో పరిష్కరిస్తామని వారికి భరోసా ఇచ్చారు.

## ముఖ్యంగా ఈ మూడు తగ్గిస్తే
## ఆరోగ్య సమస్యలు దరిచేరవు: సీఎం చంద్రబాబు

మొదటి పేజి తరువాయి

అనేక వ్యాధులు మన ఆహారపు అలవాట్ల కారణంగానే వస్తుంటాయని వెల్లడించారు. చాలా వ్యాధుల నివారణకు డైట్ కంట్రోల్ చేసుకోవడం తప్పనిసరి అని పేర్కొన్నారు. అదెలాగో కూడా చంద్రబాబు వివరించారు. "నలుగురు సభ్యులు ఉన్న కుటుంబంలో ఉప్పు నెలకు 600 గ్రాముల మాత్రమే వాడాలి. వంట నూనె కూడా నెలకు 2 లీటర్లు మాత్రమే వాడాలి. చక్కెర కూడా నెలకు 3 కిలోలు వాడితే సరిపోతుంది. సమతుల్యమైన డైట్ తీసుకోవడం ద్వారా ఆరోగ్యంగా ఉండొచ్చని అధ్యయనాలు చెబుతున్నాయి. ముఖ్యంగా... ఉప్పు, వంట నూనె, చక్కెర తగ్గిస్తే ఆరోగ్య సమస్యలు దరిచేరవు. ప్రతి రోజు అరగంట పాటు వ్యాయామం చేయాలని రాష్ట్ర ప్రజలను కోరుతున్నా. వీలైతే ప్రాణాయామం చేయాలని పిలుపునిస్తున్నా. ఇటీవల రూపొందించిన న్యూట్రిఫుల్ యాప్ కు స్కోచ్ అవార్డు లభించింది. ఈ యాప్ ను 4 లక్షల మంది డౌన్ లోడ్ చేసుకున్నారు" అని వివరించారు. కాగా, రాష్ట్రంలో పెరిగిన వైద్య ఖర్చులు, పలు రకాల జబ్బులపై ఈ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ లో చంద్రబాబు వివరించారు. అమరావతిలో గ్లోబల్ మెడిసిటీని ఏర్పాటు చేయాలని భావిస్తున్నట్టు తెలిపారు. ప్రతి నియోజకవర్గంలో 100 నుంచి 300 పడకలు ఉండే ఆసుపత్రులు నెలకొల్పేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నట్టు వెల్లడించారు. కుప్పంలో డిజిటల్ హెల్త్ సర్వే సెంటర్ ఏర్పాటు చేశామని చెప్పారు. గుండె జబ్బులు, డయాబెటిస్, హైపర్ టెన్షన్, శ్వాసకోశ వ్యాధుల వంటి సమస్యలు కొన్ని చోట్ల విస్తృతంగా పెరుగుతున్నాయని సీఎం చంద్రబాబు ఆందోళన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో పురుషుల కంటే మహిళల్లో అధికంగా హైపర్ టెన్షన్ కనిపిస్తోందని పేర్కొన్నారు. ఆహారపు అలవాట్ల వల్ల కొన్ని జిల్లాల్లో మధుమేహం ఎక్కువగా ఉందని వెల్లడించారు.

# యువతకు ఉద్యోగాలు ఇవ్వండి



మొదటి పేజి తరువాయి

కల్పించలేకపోతున్నారని ప్రశ్నించారు. ప్రభుత్వం చేస్తున్న తప్పుడు ప్రచారాలను నమ్మి ప్రజలు మోసపోవద్దని కోరారు. తమ భవితవ్యాన్ని తాము తీర్చిదిద్దుకోవడానికి బీహార్ యువత సంసిద్ధంగా ఉందని ఆయన పేర్కొన్నారు. ఈ సంవత్సరం చివరలో బీహార్‌లో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి. ఈ నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీ ఇటీవల రాష్ట్రంలోని 40 సంస్థాగత జిల్లాలకు కొత్త అధ్యక్షులను నియమించింది. బీహార్ అసెంబ్లీ ఎన్నికల్లో విజయం సాధించేందుకు కాంగ్రెస్ పార్టీ వ్యూహాలను రూపొందిస్తోంది. బీహార్‌లో రాజకీయ వేడి పెరుగుతోంది. ముఖ్యంగా ఈ ఏడాది చివరలో జరగనున్న అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో, ప్రధాన పార్టీలన్నీ తమ తమ వ్యూహాలను సిద్ధం చేసుకుంటున్నాయి. ఇటీవలి బీహార్ పర్యటనలో కాంగ్రెస్ సీనియర్ నేత రాహుల్ గాంధీ చేసిన వ్యాఖ్యలు రాష్ట్ర రాజకీయాలను హాట్ టాపిక్‌గా మార్చాయి. బెగుసరాయ్‌లో నిర్వహించిన యువజన ర్యాలీలో పాల్గొన్న రాహుల్, ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు చేశారు.

యువతకు ఉద్యోగాలెక్కడ? ప్రభుత్వం చేతులెత్తేసిందా?

రాహుల్ గాంధీ తన ప్రసంగంలో, 'బీహార్ యువత రాష్ట్రం విడిచి వలస వెళ్ళకుండా, ఇక్కడే ఉద్యోగాలు కల్పించడంలో ప్రభుత్వం ఎందుకు విఫలమవుతోంది?' అంటూ ప్రభుత్వాన్ని నిలదీశారు. బీహార్‌లో విద్యావంతుల సంఖ్య పెరుగుతున్నప్పటికీ, ఉద్యోగ అవకాశాలు మాత్రం దారుణ స్థితిలో ఉన్నాయని ఆయన వ్యాఖ్యానించారు. యువతను వలసల బాట పట్టించడమే ప్రభుత్వం చేసే 'పట్టిన చెయ్యి' అయితే, అటువంటి పాలన ఎందుకు కావాలి? అని నిలదీశారు. ప్రజలు ప్రభుత్వం చేపడుతున్న తప్పుడు ప్రచారాలను నమ్మి మోసపోవద్దని రాహుల్ గాంధీ స్పష్టం చేశారు. 'వాస్తవాలు తెలుసుకోండి, మీ భవిష్యత్తును మీరే నిర్మించుకోండి,' అని యువతను ప్రేరేపించారు. యువతలో మరింత చైతన్యం తీసుకొచ్చే విధంగా ఆయన మాటలు ఉన్నాయి. గత పదేళ్లలో రాష్ట్ర ప్రభుత్వం యువత కోసం ఏమి చేసింది అన్న ప్రశ్నను రాహుల్ ఎత్తిపోశారు. ఈ ర్యాలీకి ఎన్ఎస్‌యూఐ నేషనల్ ఇన్‌ఛార్జ్ కన్హయ్య కుమార్ నాయకత్వం వహించారు. బెగుసరాయ్ వీధుల్లో వేలాదిమంది యువత పాల్గొనడం గమనార్హం. కన్హయ్య మాట్లాడుతూ, 'ఇది కేవలం ర్యాలీ కాదు, ఇది బీహార్‌ను మారుస్తున్న యువశక్తి యొక్క గళం,' అని అన్నారు. యువతకు ఉద్యోగాలు, న్యాయం, విద్య, భద్రత వంటి అంశాలపై ప్రభుత్వం నిశ్చలంగా ఉండటం బాధాకరమని పేర్కొన్నారు.

కాంగ్రెస్ వ్యూహానికి వేగం పెంచిన నియామకాలు

బీహార్ ఎన్నికల్ని దృష్టిలో ఉంచుకుని కాంగ్రెస్ పార్టీ ఇప్పటికే గట్టిగా రంగంలోకి దిగింది. రాష్ట్రంలోని 40 సంస్థాగత జిల్లాలకు కొత్త అధ్యక్షులను నియమించడం ద్వారా పార్టీ తన కార్యకలాపాలకు కొత్త ఊపునిచ్చింది. 'ఇది కేవలం పదవుల మార్పు కాదు బదిలీగా సమర్థవంతమైన నాయకత్వం ద్వారా గెలుపు లక్ష్యాన్ని చేరుకోవడం' అని కాంగ్రెస్ వర్గాలు అంటున్నాయి. రాహుల్ గాంధీ స్పష్టంగా చెప్పారు - 'బీహార్ భవిష్యత్తు రాజకీయ నాయకుల చేతుల్లో కాదు, యువత చేతుల్లో ఉంది.' యువత ఏం కోరుతున్నారో తెలుసుకోవాలంటే ఈ ర్యాలీకి వచ్చిన సంఖ్య చూసినా సరిపోతుంది. అభ్యుదయ శక్తులు రాజకీయంగా ముందుకు రావాల్సిన అవసరం ఉందని ఆయన అభిప్రాయపడ్డారు. ప్రజల సమస్యలపై పట్టుదలతో పోరాడే నాయకత్వం అవసరమని చెప్పారు.

ఎన్నికల ముందు పొలిటికల్ ఫైట్ ముదురుతోంది

ఇక అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తున్న వేళ, రాష్ట్రంలోని ప్రధాన పార్టీల మధ్య పోటీ ముదురుతోంది. జేడీయూ - బీజేపీ సంకీర్ణం ఇప్పటికే ప్రచారానికి రంగం సిద్ధం చేస్తుండగా, కాంగ్రెస్ పార్టీ యువతను ముందుకు నడిపించే వ్యూహంతో ముందుకు సాగుతోంది. రాహుల్ వ్యాఖ్యలు ఈ ఎన్నికల్లో యువత ఓటు ప్రాధాన్యత ఎంత ఉన్నదీ స్పష్టం చేస్తున్నాయి.

## మంగళగిరిని దేశంలోనే అభివృద్ధికి
# చిరునామాగా మారుస్తా

మొదటి పేజి తరువాయి

ఈ సందర్భంగా మంత్రి లోకేశ్ మాట్లాడుతూ, నివసిస్తున్న ప్రాంతంలోనే పట్టాలు ఇవ్వాలన్నది ఎన్నో ఏళ్ల కల అని అన్నారు. గతంలో జిరాక్స్ కాగితాలకే వేలకు వేలు ఖర్చు అయ్యేవని, ఇప్పుడు ఆ కష్టం తీరిందని చెప్పారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు అధికారంలోకి వచ్చిన 10 నెలల్లోనే ఇంటి పట్టాలు ఇస్తున్నామని తెలిపారు. మూడు రకాల భూములు ఉండగా, తొలి విడతలో 3 వేల మందికి పట్టాలు అందిస్తున్నామని, రెండో విడతలో ఎండోమెంట్, రైల్వే భూముల్లో నివసించేవారికి, మూడో విడతలో అటవీ, ఇరిగేషన్ భూముల్లో నివసించేవారికి పట్టాలు అందజేస్తామని హామీ ఇచ్చారు. ఇచ్చిన మాట ప్రకారం 3 వేల మందికి బట్టలు పెట్టి మరీ అయిదు రోజులపాటు నిలబడి పట్టాలు ఇస్తున్నానని, ఇది ప్రజల మీద తనకున్న చిత్తశుద్ధికి నిదర్శనమని లోకేశ్ అన్నారు.

ఆ నిర్ణయమే నా జీవితాన్ని మార్చేసింది

మంగళగిరిలో పోటీ చేయాలనే నిర్ణయమే నా జీవితాన్ని మార్చింది. 2019 ఎన్నికల్లో ఓటమి పాలైనప్పటికీ, మంగళగిరి ప్రజలకు సేవ చేయాలనే లక్ష్యంతో పనిచేశాను. ప్రజల ఆరోగ్యం కోసం ఎన్టీఆర్ సంజీవని పథకం ద్వారా ఉచితంగా మందులు అందిస్తున్నాం, మహిళలు స్వంత కాళ్లపై నిలబడేందుకు కుట్టు శిక్షణ ఇచ్చి మిషన్లు అందజేస్తున్నాం. పిల్లలు ఆడుకునేందుకు క్రీడా ప్రాంగణం ఏర్పాటు చేయడంతో పాటు మంగళగిరి ప్రీమియర్ లీగ్ కూడా ప్రారంభించాం. పేద ఇళ్లలో జరిగే పెళ్లిళ్లకు బట్టలు పెట్టాం, కోవిడ్ సమయంలో ఆక్సిజన్, మందులు అందజేశాం, అమెరికా డాక్టర్లతో టెలిమెడిసిన్ సేవలు అందించాం.

మీరు కొట్టిన దెబ్బకు అక్కడనుంచి సౌండ్ లేదు

నేను ఓడిపోయినపుడు అందరూ ఎగతాళి చేశారు. ఇటీవల ఎన్నికల్లో మీరు కొట్టిన దెబ్బకు అక్కడనుంచి సౌండ్ లేదు. ఎన్నికలపుడు అందరూ సర్వేలు చేస్తారు. టీడీపీ సర్వేలో కూడా కుప్పం కంటే మంగళగిరి వెనకబడి ఉంది. ఎన్నికలయ్యాక చంద్రబాబును కలిశా, మీకన్నా ఒక్క ఓటు అయినా ఎక్కువ వస్తుందని చెప్పా. చెప్పినట్లే అత్యధికంగా 91 వేల మెజారిటీతో గెలిచా. మీరు నా



గౌరవం, పరువు నిలబెట్టారు, మీ కోసం అహర్నిశలు శ్రమిస్తా. ఇంటిపట్టాలతో పాటు భూగర్భ డ్రైనేజి, నీరు, భూగర్భ గ్యాస్, కరెంటు కార్యక్రమాలు కూడా చేపట్టాం, టెండర్లు నడుస్తున్నాయి. జూన్ నుంచి పనులు ప్రారంభమవుతాయి. లక్ష్మీనరసింహస్వామి గుడిని కూడా అభివృద్ధి చేయాలని నిర్ణయించాం. మహా ప్రస్థానం పేరుతో శ్మశానాలు కూడా అభివృద్ధి చేస్తున్నాం. పద్ధతి ప్రకారం చేయాలనే ఉద్దేశంతో ఆచితూచి అడుగులు వేస్తున్నాం.

భారీ మెజారిటీ వల్లే చర్చ లేకుండా ఆమోదం

భారీ మెజారిటీతో గెలిపించినందునే నేను తీసుకెళ్లే ప్రతిపాదనలకు ఎటువంటి చర్చ లేకుండా ఆమోదం తెలుపుతున్నారు. రెండవ కేబినెట్ సమావేశంలోనే వంద పడకల ప్రభుత్వ ఆసుపత్రి నిర్మాణానికి అనుమతి వచ్చింది. ఈ నెల 13న ఆసుపత్రి నిర్మాణానికి శంకుస్థాపన చేయనున్నాం.

## 14 దేశాలకు వీసాలు ఆపేసిన సౌదీ అరేబియా..
## జాబితాలో ఇండియా, పాకిస్థాన్

ఢిల్లీ: హజ్ యాత్రకు సమయం దగ్గర పడుతున్న తరుణంలో సౌదీ అరేబియా కీలక నిర్ణయం తీసుకుంది. 14 దేశాల పౌరులకు వీసాల జారీని తాత్కాలికంగా నిలిపివేసింది. ఉమ్రా, బిజినెస్, కుటుంబ సందర్శన తదితర కేటగిరీ వీసాలపై ఈ నిషేధం ఉంటుంది. సరైన రిజిస్ట్రేషన్ లేకుండా హజ్ యాత్రకు వస్తున్న వారిని నిలువరించేందుకే ఈ నిర్ణయం తీసుకున్నట్టు సౌదీ అధికారులు తెలిపారు. గత ఏడాది హజ్ సమయంలో రిజిస్టర్ కాని యాత్రికుల వల్ల తొక్కిసలాట చోటుచేసుకుంది. గత ఏడాది హజ్ యాత్రలో పాల్గొన్నవారిలో 12 వందలకు పైగా యాత్రికులు వివిధ కారణాలతో మృతి చెందారు. రిజిస్టర్ కాని యాత్రికుల వల్ల హజ్ లో తీవ్రమైన రద్దీ ఏర్పడిందని సౌదీ అధికారులు భావిస్తున్నారు. ఇలాంటి ఘటన మరోసారి పునరావృతం కాకుండా ఉండేందుకు సౌదీ పాలకుడు ప్రిన్స్ మొహమ్మద్ బిన్ సల్మాన్ ఈ నిర్ణయం తీసుకున్నారు. వివిధ వీసాల జారీని తాత్కాలికంగా నిలిపివేశారు. వీసా నిబంధనలను కూడా మెరుగుపరచాలని అధికారులను ఆదేశించారు. అయితే దౌత్య, నివాస ఆవాసితులు, హజ్ యాత్ర కోసం ప్రత్యేకంగా నమోదైన యాత్రికులకు ఈ నిషేధం వర్తించదు. సౌదీ వీసాలు ఆపేసిన దేశాల జాబితాలో భారత్ తో పాటు పాకిస్థాన్ కూడా ఉండటం గమనార్హం.

సౌదీ ప్రభుత్వం వీసాలు నిరాకరించిన దేశాలు:

ఇండియా, పాకిస్థాన్, బంగ్లాదేశ్, ఈజిప్ట్, ఇథియోపియా, ఇండొనేషియా, అల్జీరియా, జోర్డాన్, ఇరాక్, నైజీరియా, మొరాకో, సూడాన్, ట్యునీషియా, యెమెన్.

## 25 ఏళ్ల తర్వాత ఆ దేశాలకు భారత రాష్ట్రపతి

ఢిల్లీ: భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము పోర్చుగల్, స్లోవేకియా దేశాల పర్యటనకు వెళ్లారు. ఈ విషయాన్ని విదేశీ వ్యవహారాల శాఖ అధికార ప్రతినిధి రణదీప్ జైస్వాల్ ఆదివారం 'ఎక్స్' వేదికగా తెలియజేశారు. రాష్ట్రపతి ద్రౌపది ముర్ము పోర్చుగల్, స్లోవేకియా దేశాల అధికారిక పర్యటనకు బయలుదేరారని ఆయన తెలిపారు. 25 సంవత్సరాల తర్వాత భారత రాష్ట్రపతి ఈ దేశాల్లో పర్యటించడం ఇదే మొదటిసారి అని ఆయన పేర్కొన్నారు. ఈ పర్యటనతో రెండు దేశాలతో బహుముఖ సహకారం మరింతగా విస్తరించనుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. భారత్-పోర్చుగల్ దౌత్య సంబంధాలకు 50 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా ద్రౌపది ముర్ము లిస్బన్‌లో పర్యటించనున్నారు.

## ఎమర్జింగ్ టెక్నాలజీస్ హబ్ గా తెలంగాణను
## తీర్చిదిద్దుతాం

హైదరాబాద్: భవిష్యత్తు మొత్తం ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ దే అని తెలంగాణ ఐటీ, పరిశ్రమల మంత్రి శ్రీధర్ బాబు అన్నారు. తెలంగాణ నుంచి రెండు లక్షల మంది ఏఐ ఇంజినీర్లను తయారు చేయడమే తమ లక్ష్యమని చెప్పారు. సింగపూర్ కాన్సులేట్ జనరల్ ఎడ్గర్ పాంగ్ నేతృత్వంలో ఆ దేశ ప్రతినిధులు ఈరోజు శ్రీధర్ బాబును సచివాలయంలో కలిశారు. ఈ సందర్భంగా తెలంగాణ ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను వారికి శ్రీధర్ బాబు వివరించారు. ఎమర్జింగ్ టెక్నాలజీస్ కు తెలంగాణను హబ్ గా మారుస్తున్నామని చెప్పారు. ఏఐ రంగంలో ఉపాధి అవకాశాలను అందిపుచ్చుకునేలా తెలంగాణ యువతను తీర్చిదిద్దుతామని తెలిపారు. అంతర్జాతీయ ప్రమాణాలతో ఫ్యూచర్ సిటీ, యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీలను నెలకొల్పుతున్నామని చెప్పారు. ఏడాది వ్యవధిలోనే ఐటీ, హాస్పిటాలిటీతో పాటు ఇతర రంగాల్లో 70 గ్లోబల్ కేపబిలిటీ సెంటర్లు ప్రారంభమయ్యాయని తెలిపారు. పరిశ్రమల ఏర్పాటును కేవలం హైదరాబాద్ కే పరిమితం చేయకుండా... కరీంనగర్, వరంగల్ లాంటి నగరాలకు కూడా విస్తరిస్తున్నామని చెప్పారు. స్కిల్ డెవలప్ మెంట్, టెక్నాలజీ రంగాల్లో సింగపూర్ ప్రభుత్వంతో కలిసి పనిచేసేందుకు తమ ప్రభుత్వం సిద్ధంగా ఉందని తెలిపారు.

## స్టాక్‌మార్కెట్‌పై
## రాహుల్ గాంధీ కీలక వ్యాఖ్యలు

పాట్నా: అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పరస్పర సుంకాలు ప్రపంచవ్యాప్తంగా పలు దేశాల మార్కెట్లపై(భారత్ సహా) ప్రతికూల ప్రభావం చూపెడుతున్నాయి. కూడా దేశీయ మార్కెట్లు భారీగా పతనం అయ్యాయి. ఈ క్రమంలో స్టాక్ మార్కెట్‌పై కాంగ్రెస్ ఎంపీ, లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ కీలక వ్యాఖ్యలు చేశారు. స్టాక్ మార్కెట్ లో డబ్బు అపరిమితంగా సృష్టించబడుతుందని, అయితే అది అందరికీ లాభం చేకూర్చదని అన్నారాయన. సోమవారం పాట్నా(బీహార్)లో సంవిధాన్ సురక్షా సమ్మేళన్ పేరిట జరిగిన ఓ కార్యక్రమంలో పాల్గొని ప్రసంగించారాయన. అమెరికా అధ్యక్షుడి నిర్ణయం.. మన స్టాక్ మార్కెట్‌ను కుదిపేస్తోంది. మన దేశంలో ఒక శాతం కంటే తక్కువ మందే స్టాక్ మార్కెట్ పెట్టుబడులు పెడుతున్నారు. అంటే.. ఇది అందరి కోసం కాదని అర్థం. స్టాక్ మార్కెట్‌లో డబ్బు సంపాదించడం అనేది ఓ భ్రమ. ప్రత్యేకించి.. యువత స్టాక్ మార్కెట్లకు దూరంగా ఉండండి అని రాహుల్ గాంధీ సందేశం ఇచ్చారు

## హెచ్‌సీయూ విద్యార్థులపై
## కేసులను వెంటనే ఉపసంహరించండి

హైదరాబాద్:హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ విద్యార్థులపై నమోదు చేసిన కేసులను వెంటనే ఉపసంహరించుకోవాలని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు పోలీసు అధికారులను ఆదేశించారు. సోమవారం డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ సచివాలయంలో హెచ్‌సీయూ టీచర్స్ అసోసియేషన్, సివిల్ సొసైటీ గ్రూప్స్ తో సబ్ కమిటీ సభ్యులైన మంత్రులు దుద్దిల్ల శ్రీధర్ బాబు, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డితో కలిసి చర్చల తదుపరి డిప్యూటీ సీఎం ఆదేశాలు జారీ చేశారు. జ్యూడిషియల్ రిమాండ్ లో ఉన్న ఇద్దరు విద్యార్థులకు సంబంధించి కేసుల ఉపసంహరణకు వెంటనే చర్యలు చేపట్టాలని సూచించారు. కేసుల ఉపసంహరణ క్రమంలో ఎటువంటి న్యాయపరమైన సమస్యలు ఉత్పన్నం కాకుండా పోలీస్ అధికారులకు తగు సూచనలు చేయవలసిందిగా న్యాయశాఖ అధికారులను ఆదేశించారు. ఇటీవల హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలోని 400 ఎకరాలను తెలంగాణ ప్రభుత్వం వేలం వేయడాన్ని నిరసిస్తూ విద్యార్థులు ఆందోళనలకు దిగిన విషయం తెలిసిందే. ఈ వ్యవహారంపై సుప్రీంకోర్టు కీలక ఆదేశాలు జారీ చేసింది. హెచ్‌సీయూ కంచె గచ్చిబౌలి స్థలాల్లో ఎలాంటి పనులు చేయొద్దని ప్రభుత్వాన్ని హెచ్చరించింది. హెచ్‌సీయూ కంచె గచ్చిబౌలి సమస్యపై తెలంగాణ ప్రభుత్వం.. డిప్యూటీ ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, శ్రీధర్ బాబు మంత్రులతో కమిటీ వేసింది.

## తెలంగాణలో వచ్చే మూడు రోజులు వర్షాలు!

హైదరాబాద్: దక్షిణ మధ్య బంగాళాఖాతాంలో ఏర్పడిన అల్పపీడనం కారణంగా వచ్చే మూడు రోజుల పాటు తెలంగాణలో ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులతో కూడిన వర్షాలు పడే అవకాశం ఉంది. తూర్పు బీహార్ నుంచి ఈశాన్య జార్ఖండ్, చత్తీస్‌గఢ్ మీదుగా ఉత్తర తెలంగాణ వరకూ ఉపరితల ద్రోణి కొనసాగుతుంది. ఫలితంగా వచ్చే మూడు రోజులు వర్షాలు పడే అవకాశాలు ఎక్కువగా ఉన్నట్లు హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది.

హైదరాబాద్ లో ఒక్కసారిగా మారిన వాతావరణం

హైదరాబాద్ నగరంలో సోమవారం మధ్యాహ్నం రెండు గంటల సమయంలో వాతావరణం ఒక్కసారిగా మారింది. నగరంలోని పలు ప్రాంతాల్లో చిరుజల్లులు పడ్డాయి. హైదరాబాద్ తో పాటు మహబూర్ నగర్, మేడ్చల్, మల్కాజగిరి, నాగర్ కర్నూల్, రంగారెడ్డి, సిద్ధిపేట, వికారాబాద్ జిల్లాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన తేలికపాటి వర్షాల నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉంది. ఇక భద్రాద్రి కొత్తగూడెం, మహబూబాబాద్, ములుగు జిల్లాలో ఈదురు గాలులతో కూడిన వర్షాలు కురిసే అవకాశం ఉండగా, రేపు(మంగళవారం) జయశంకర్ భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం. ఖమ్మం, నల్గొండ, సూర్యపేట, మహబూబాబాద్, వరంగల్, హనుమకొండ జిల్లాలలో వర్షాలు పడే అవకాశం ఉంది.

## దేశవ్యాప్తంగా పెరిగిన పెట్రోల్, డీజిల్ ధరలు

ఢిల్లీ: 2025 ఏప్రిల్ 8 నుంచి అమలులోకి వచ్చేలా పెట్రోల్, డీజిల్‌పై ఎక్సైజ్ సుంకాన్ని లీటరుకు రూ. 2 చొప్పున కేంద్రం సోమవారం పెంచింది. ప్రపంచ చమురు ధరలలో కొనసాగుతున్న హెచ్చుతగ్గులు, ట్రంప్ సుంకాల మధ్య ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. మంత్రిత్వ శాఖ వెల్లడించిన తన నోటిఫికేషన్‌లో.. పెరిగిన ఎక్సైజ్ సుంకం రిటైల్ ధరలను ఎప్పుడు, ఎలా ప్రభావితం చేస్తుందో వెల్లడించనప్పటికీ.. భారత వినియోగదారులపై దీని ప్రభావం ఉండదని ధృవీకరించింది. అంతర్జాతీయ చమురు ధరలు తగ్గడం వల్ల పెట్రోల్, డీజిల్ ధరలలో ఇటీవల తగ్గింపులతో ఎక్సైజ్ సుంకం పెరుగుదల సమతుల్యంగా ఉంటుందని భావిస్తున్నారు. భారతదేశంలో లోక్‌సభ ఎన్నికలకు ముందు మార్చి 14న ఇంధన ధరలలో చివరి తగ్గింపు జరిగింది. ఎక్సైజ్ సుంకాన్ని రెండు సార్లు తగ్గించడంతో పెట్రోల్ -డీజిల్ ఎక్సైజ్‌ను లీటరుకు వరుసగా రూ. 13, రూ. 16 చొప్పున తగ్గించారు. ఇటీవల చమురు మంత్రి హర్దీప్ సింగ్ పూరి పెట్రోల్, డీజిల్ ధరలలో మరింత తగ్గింపు గురించి ఆశావాదం వ్యక్తం చేశారు, ఇది ప్రపంచ ముడి చమురు ధరలు ప్రస్తుత కనిష్ట స్థాయిలో ఉండటంపై ఆధారపడి ఉంటుందని అన్నారు.

## తెలంగాణలో నూతన ఎమ్మెల్సీల
# ప్రమాణ స్వీకారం

మొదటి పేజి తరువాయి



నూతన ఎమ్మెల్సీలతో మండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ కార్యక్రమానికి కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి, ఎంపీలు రఘునందన్ రావు, డాక్టర్ కె. లక్ష్మణ్ తదితరులు హాజరయ్యారు. కాంగ్రెస్ పార్టీకి చెందిన అద్దంకి దయాకర్ కూడా శాసనమండలి సభ్యుడిగా ప్రమాణ స్వీకారం చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, ఉత్తమ్ కుమార్ రెడ్డి, టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ తదితరుల సహకారంతో తనకు ఈ అవకాశం లభించిందని ఆయన అన్నారు.

## నంద్యాల న్యాయవాదులకు మోగినా ఎన్నికల నగరా.




నంద్యాల రిపోర్టర్/ మోహన్ ( శుభోదయం న్యూస్): నంద్యాల న్యాయస్థానంలో న్యాయవాదులకు ఏప్రిల్ 11వ తేదీ శుక్రవారం ఎన్నికలు (ఓటింగ్) నిర్వహిస్తున్నట్లు ఎన్నికల అధికారులు కే. రామకృష్ణయ్య. . సుధామౌళి రెడ్డి. రఘు ప్రకాష్, టీ.వీ ప్రసాద్, శ్రీనివాసులు, తిరుపాలు, షైక్ సెన్ను, తెలిపారు. నంద్యాల న్యాయవాదుల బార్ అసోసియేన్ నందు సోమవారం జరిగిన నామినేషన్లలో ప్రెసిడెంట్ గా సీనియర్ న్యాయవాది హుస్సేన్ భాష, జగన్మోహన్ రెడ్డి, వైస్ ప్రెసిడెంట్ గా కానాల సుబ్బరాయుడు, జనరల్ సెక్రెటరీగా ముక్కర కృష్ణారెడ్డి అన్నమయ్య బాలసుబ్బయ్య, జాయింట్ సెక్రెటరీగా శేష సాయి బాబా, బాలు నాయక్, ట్రెజరర్ గా ఎస్. మద్దిలేటి రెడ్డి లైబ్రరీ సెక్రెటరీగా యాగంటి పల్లె మద్దిలేటి యాదవ్, స్పోర్ట్స్ సెక్రటరీగా గోస్పాడు ప్రసాద్ రెడ్డి, చిన్న లింగమయ్య, లేడీ రిప్రజెంటెడ్ గా సౌజన్య నామినేషన్ వేసినట్లు తెలిపారు. ఈ ఎన్నికలలో ప్రెసిడెంట్ గా సీనియర్ న్యాయవాది హుస్సేన్ భాష, జగన్మోహన్ రెడ్డి,జనరల్ సెక్రెటరీగా ముక్కర కృష్ణారెడ్డి అన్నమయ్య బాలసుబ్బయ్య, జాయింట్ సెక్రెటరీగా శేష సాయి బాబా, బాలు నాయక్, స్పోర్ట్స్ సెక్రటరీగా గోస్పాడు ప్రసాద్ రెడ్డి, చిన్న లింగమయ్య, గట్టిగా పోటీ జరిగే అవకాశం మెండుగా ఉన్నట్లు న్యాయవాదులు అభిప్రాయం వెలిబుచ్చారు.వైస్ ప్రెసిడెంట్ గా కానాల సుబ్బరాయుడుట్రెజరర్ గా ఎస్. మద్దిలేటి రెడ్డి, లైబ్రరీ సెక్రెటరీగా యాగంటి పల్లె మద్దిలేటి యాదవ్,లేడీ రిప్రజెంటెడ్ గా సౌజన్య ఒక్కొక్కరే నామినేషన్ వేసినందున వీరిని స్కూటీలు లో ఏకగ్రీవంగా చేసే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని ఎన్నికల అధికారులు తెలిపారు. పోటీలో ఉండే అభ్యర్థులు ఎన్నికలు సాఫీగా జరిగే విధంగా ప్రయత్నించాలని ఎన్నికల అధికారులు న్యాయవాదులను కోరారు.

## స్కూల్ బస్ డ్రైవర్ల కు రోడ్ సేఫ్టీ పై అవగాహన కార్యక్రమం.



నంద్యాల రిపోర్టర్/ మోహన్ ( శుభోదయం న్యూస్ ): కర్నూలు రేంజ్ డీఐజీ కోయ ప్రవీణ్ మార్గనిర్దేశనలో మరియు నంద్యాల జిల్లా ఎస్పీ శ్రీ అధిరాజ్ సింగ్ రాణా సూచనలతో, సూపర్ఇంటెండెంట్ అఫ్ పోలీసు, నంద్యాల మరియు కుమారి జావలి ఐపీఎస్, అసిస్టెంట్ సూపర్ఇంటెండెంట్ అఫ్ పోలీసు నంద్యాల వారి సహకారంతో రోడ్ సేఫ్టీ పై స్కూల్ బస్ డ్రైవర్లకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు.నంద్యాల రామకృష్ణ డిగ్రీ కళాశాల ఆడిటోరియం నందు నంద్యాల ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ మల్లికార్జున గుప్తా ఆధ్వర్యంలో సుమారు 150 మంది స్కూల్ వ్యాన్ మరియు బస్సుల డ్రైవర్లతో రోడ్ సేఫ్టీ అవగాహనా కార్యక్రమం విజయవంతంగా నిర్వహించారు.ఈ కార్యక్రమం యొక్క ప్రధాన ఉద్దేశ్యం, పిల్లలను రవాణా చేసే సమయంలో డ్రైవర్లు పాటించవలసిన రోడ్డు భద్రతా నిబంధనలపై అవగాహన కల్పించడమే. మద్యం సేవించి వాహనం నడపడం, మొబైల్ ఫోన్ వాడుతూ డ్రైవింగ్ చేయడం వలన కలిగే ప్రమాదాల గురించి స్పష్టంగా వివరించారు.అదేవిధంగా వాహనాలలో డాష్ కామ్‌లు మరియు సీసీటీవీ కెమెరాలు స్థాపించడం వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. చెల్లుబాటు అయ్యే డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండటం అవసరమని, ఎక్కువ వయసున్న వృద్ధులను డ్రైవర్‌లుగా నియమించకూడదని హెచ్చరించారు.

## జాతీయ రెజ్లింగ్ పోటీలకు ఆర్ యస్ ఆర్ విద్యార్థిని



శుభోదయం న్యూస్, బిట్రగుంట: బోగోలు మండలం కడనూతల రామిరెడ్డి సుబ్బరామిరెడ్డి ఇంజనీరింగ్ కళాశాలలో బీటెక్ మొదటిసంవత్సరంచదువుతున్న ఎం.బిందుశ్రీ అండర్20రెజ్లింగ్ జాతీయస్థాయిపోటీలకు ఎంపికైనట్లుసోమవారం కళాశాలప్రిన్సిపల్ డాక్టర్ పివిఎన్ రెడ్డితెలిపారు .ఈసందర్భంగావారు మాట్లాడుతూబిందుశ్రీ ఈనెల 4, 5, 6, తేదీలలోరాజ మండ్రిలోజరిగిన అండర్ 20రాష్ట్రస్థాయిపోటీలలో ప్రథమస్థానంలోనిలిచి బంగారుపథకంతోపాటుప్రశంసా పత్రాన్ని సాధించిందన్నారు. అలాగేఆంధ్రప్రదేశ్ తరపునఈనెల 19, 20, 21 తేదీలలో రాజస్థాన్ రాష్ట్రంలోనికోటలో జరగబోతున్నజాతీయపోటీలకుఎంపికైనట్లు తెలిపారు. ఈసందర్భంగా బిందుశ్రీనిప్రిన్సిపల్ తో పాటు హెచ్ అండ్ ఎస్ హెచ్ ఓ డి డాక్టర్ లక్ష్మీ, ఫిజికల్ డైరెక్టర్ ఏ కిరణ్ కుమార్, అధ్యాపకులుతదితరులు అభినందించిశుభాకాంక్షలు తెలుపుతూజరగబోవుజాతీయ పోటీలలోప్రథమస్థానం సాధించాలనిఆశీర్వదించారు.

## తుగ్గలిలో ఘనంగా వాల్మీకి మహర్షి.... సుంకులమ్మ విగ్రహా ప్రతిష్ఠలు చేసిన గ్రామ పెద్దలు....



తుగ్గలి, మండల రిపోర్టర్ మాధవ్ (శుభోదయం న్యూస్ ): మండల కేంద్రమైన తుగ్గలిలో శ్రీ సుంకలాపరమేశ్వరి,వాల్మీకి మహర్షి విగ్రహ ప్రతిష్టలను సోమవారం గ్రామ పెద్దలు ప్రజలు ఘనంగా నిర్వహించారు. ముందుగా తుగ్గలిలో గల ఎస్సీ కాలనీ యందు సుంకులమ్మ ఆలయాన్ని ఆధునికరించి నూతనంగా సుంకలాపరమేశ్వరి విగ్రహాన్ని వేదపండితుల సమక్షంలో ప్రత్యేక పూజలను నిర్వహించి గ్రామ ప్రజలు, పెద్దల ఆధ్వర్యంలో ప్రతిష్టించారు. అదేవిధంగా తుగ్గలిలోని గ్రామ విఆర్ఓ కార్యాలయం ఎదురుగా గ్రామ వాల్మీకిల ఐక్యతతో గ్రామ పెద్దలు మరియు ప్రజల సహకారంతో వేదపండితుల మంత్రోచ్ఛారణతో వాల్మీకి మహర్షి విగ్రహాన్ని ప్రతిష్టించారు. పెద్దల ఆధ్వర్యంలో సుంకులాపరమేశ్వరి దేవి,వాల్మీకి మహర్షి విగ్రహాలను గ్రామ ప్రధాన రహదారులలో ఊరేగింపును ఘనంగా నిర్వహించాం ు.విగ్రహాల ప్రతిష్ట అనతరం టీడీపి నాయకులు తుగ్గలి నాగేంద్ర కుటుంబ సభ్యులు,తుగ్గలి వైసిపి నాయకులు మోహన్ రెడ్డి,నియోజకవర్గ ఐటీ వింగ్ అధ్యక్షులు చంద్రశేఖర్ రెడ్డి,హగిరి వెంకటేష్,వెల్ఫేర్ అసిస్టెంట్ల సంఘం జిల్లా అధ్యక్షులు పులిశేఖర్, తుగ్గలి మాజీ ఎంపీటీసీ వల్లే వెంకటేష్ లు ప్రత్యేక పూజలను



నిర్వహించారు. అదేవిధంగా భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించి తమ మొక్కులను తీర్చుకున్నారు.ఈ కార్యక్రమంలో గ్రామ ప్రజలు,గ్రామ పెద్దలు,వాల్మీకి సోదరులు,భక్తులు తదితరులు పాల్గొన్నారు.


## చెన్నంపల్లి లో పేకాట 9 మంది అరెస్టు రూ19, 440 లు స్వాధీనం..

తుగ్గలి, మండల రిపోర్టర్ మాధవ్ (శుభోదయం న్యూస్ ): తుగ్గలి మండలం పరిధిలోని చెన్నంపల్లి గ్రామ సమీపంలోనే కోతికట్ట ఆంజనేయ స్వామి గుడి వద్ద పేకాట అడుగుతున్న 9 మంది ని పట్టుకున్నట్లు జొన్నగిరి ఎస్సై ఎన్. సి. మల్లికార్జున తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేకాట ఆడుతున్న వ్యక్తులను పట్టుకొని వారివద్ద నుండి 52 పేక ముక్కలు రూ 19,440 లు డబ్బులు, మూడు బైకులు, 5 సెల్ ఫోన్లు సీజ్ చేసినట్లు తెలిపారు. పేకాట ఆడుతూ పట్టుపడ్డ 9 మందితో పాటు పారిపోయిన ఇద్దరితో కలిపి మొత్తం 11 మంది పై కేసు పెట్టినట్లు ఆయన తెలిపారు. ఈ పేకాట రైడ్ లో పాల్గొన్న ఎస్ఐ, పోలీస్ సిబ్బందిని పత్తికొండ డి.ఎస్.పి వెంకటరామయ్య , పత్తికొండ రూరల్ సీఐ పులిశేఖర్ లు అభినందించినట్లు తెలిపారు. ఎవరైనా జొన్నగిరి పోలీస్ స్టేషన్ గ్రామాల పరిధిలో పేకాట, మట్కా మరియు అసాంఘిక చర్యలకు పాల్పడితే అటువంటి వారి పైన కేసులు నమోదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకొనబడును అని హెచ్చరించారు.

## తుగ్గలిలో ఘనంగా వాల్మీకి ప్రతిష్ట వేడుకలు..




తుగ్గలి, మండల రిపోర్టర్ మాధవ్ (శుభోదయం న్యూస్ ) : మండల కేంద్రమైన తుగ్గలిలో సోమవారము వాల్మీకి విగ్రహాన్ని వాల్మీకిలు విగ్రహాన్ని ప్రశించారు. విగ్రహ ప్రతిష్ట సందర్భంగా ఆదివారం రాత్రి విగ్రహాన్ని ఊరేగింపు వాల్మీకి దేవాలయం వరకు నిర్వహించారు. ప్రతిష్టకు వచ్చిన నాయకులకు వాల్మీకులు సన్మానం చేశారు. వాల్మీకి విగ్రహానికి వాల్మీకి నాయకులు హగిరి వెంకటేశ్వర్లు ప్రత్యేక పూజలు నిర్వహించారు.




సోమవారము ఉదయం రామాయణం రచించిన వాల్మీకి విగ్రహమును ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం ప్రతిష్టించడం జరిగింది. ఈ కార్యక్రమంలో వైసీపీ యువ నాయకులు మాజీ ఎమ్మెల్యే తమ్మారెడ్డి మనుమలు తుగ్గలి మోహన్ రెడ్డి, చంద్రశేఖర్ రెడ్డి, వాల్మీకి నాయకులు హగిరి వెంకటేశ్వర్లు, మాజీ ఎంపీటీసీ వల్లె వెంకటేశ్వర్లు, బెస్త కృష్ణయ్య, తుగ్గలి వాల్మీక నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## వాల్మీకి మహర్షి విగ్రహానికి ప్రత్యేక పూజలు..




తుగ్గలి, మండల రిపోర్టర్ మాధవ్ (శుభోదయం న్యూస్ ): మండల కేంద్రమైన తుగ్గలిలో సోమవారం ప్రతిష్టించిన వాల్మీకి విగ్రహానికి శాలివాహన ఫెడరేషన్ మాజీ చైర్మన్ కే. నాగేంద్ర, మాజీ ఎంపీటీసీ వెంకటేశ్వర్లు ప్రత్యేక పూజలు నిర్వహించారు. వాల్మీకి విగ్రహం ప్రతిష్టకు వచ్చిన నాయకులకు, వాల్మీకి సోదరులకు, బివిఎస్ నాయకులకు స్థానిక వాల్మీకులు వారిని ఘనంగా సన్మానించారు. అనంతరము వచ్చిన వాల్మీక భక్తులకు స్థానిక వాల్మీక సోదరులు అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు.

## గిరిజన బాలుర సంక్షేమ రెసిడెన్షియల్ పాఠశాలకు నిధులు మంజూరు



రెంటచింతల, మండల రిపోర్టర్ -శ్రీనివాసరావు (శుభోదయం న్యూస్): గిరిజన విద్యార్థుల అభ్యున్నతికి కూటమి ప్రభుత్వం కట్టుబడిందన్న హామీ మేరకు అధికారంలోకి రాగానే నియోజకవర్గ ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మారెడ్డి కృషితో స్థానిక గిరిజన బాలుర సంక్షేమ రెసిడెన్స్ పాఠశాల నూతన నిర్మాణానికి ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. స్థానిక గిరిజన విద్యార్థులు పాఠశాలకు సొంత భవనం లేకపోవడంతో వసతి గృహం లోనే ఉంటూ పలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ విషయాన్ని పాఠశాల ప్రిన్సిపల్ మోహన్, విద్యావేత్త నారాయణపురం శ్రీనివాసరావు, స్థానిక టీడీపీ నేతలు ఇటీవల రెంటచింతల పర్యటనకు వచ్చిన ఎమ్మెల్యే బ్రహ్మారెడ్డి దృష్టికి తీసుకువచ్చారు. దీనిపై దృష్టి సారించిన ఎమ్మెల్యే జూలకంటి గత అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కలిసి గిరిజన విద్యార్థుల ఎదుర్కొంటున్న సమస్యలను ఆయన దృష్టికి తీసుకువచ్చారు. దీనిపై స్పందించిన ముఖ్యమంత్రి నిధులు కేటాయించాలని ట్రైబల్ వెల్ఫేర్ సెక్రటరీని ఆదేశించారు. ఈ క్రమంలో సోమవారం ఆయన శ్రీశైలం ఐ టి డీ ఏ ప్రాజెక్టు అధికారిని కలిసి గిరిజన బాలుర రెసిడెన్షియల్ పాఠశాలకు త్వరితగతిన నిధులు విడుదల చేయాలని కోరారు. ఈ నేపథ్యంలో జీవో నెంబర్ 44 ప్రకారం రూ. 4 కోట్ల 10 లక్షల 90 వేలు యుద్ధ ప్రాతిపదికన విడుదల చేయనున్నట్లు ఉన్నతాధికారులు వెల్లడించారు. సమావేశంలో ఐ టీ డీ ఏ ప్రాజెక్టు డీఈ ఇంతియాజ్, టీడీపీ నియోజకవర్గ నాయకులు పాల్గొన్నారు.

## కె. ఆర్. జడ్పీ. హెచ్ స్కూల్ తరగతి గదులను ప్రారంభించిన రిటైర్డ్ ప్రిన్సిపల్



లింగసముద్రం కె సురేష్ (శుభోదయం న్యూస్): లింగసముద్రంప్రభుత్వ పాఠశాలలు అభివృద్ధి చెందాలంటే దాతల సహకారం ఎంతో అవసరమని రిటైర్డ్ ప్రిన్సిపాల్,పాఠశాల పూర్వ విద్యార్థి కొట్టే వెంకటాచార్యులు అన్నారు. సోమవారం స్థానిక కమిసెట్టి రామయ్య జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో కీ.శే. పిడుగు కోనయ్య - కోనమ్మ 1966 సంవత్సరంలో పాఠశాలలో ఏర్పాటుచేసిన తరగతి గదులు శిథిలావస్థకు చేరడంతో వారి ముని మనవళ్లు పిడుగు రాజా,రంగారావు,నాగరాజునాయుడు,అనిల్ కుమార్ లు ప్రధానోపాధ్యాయులు మాధవరావు,ఉపాధ్యాయులు తరగతు గదులు గురించి వివరించడంతో వెంటనే స్పందించిన వారు తరగతి గదులను మరమ్మత్తులు చేయించి విద్యార్థులకు ఉపయోగపడే విధంగా నిర్మాణం చేపట్టడం జరిగింది.తరగతుల ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు.ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఉమ్మడిశెట్టి మాధవరావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో వెంకటాచార్యులు మాట్లాడుతూ జంగారెడ్డి పాలెం గ్రామానికి చెందిన తాను ఇదే పాఠశాలలో 6 నుంచి 10వ తరగతి వరకు చదువుకొని ప్రిన్సిపల్ గా రిటైర్డ్ అయ్యానని చెప్పారు. విద్యార్థులు నిర్దిష్టమైన లక్ష్యాన్ని పెట్టుకొని చదివినప్పుడే వారు అనుకున్న స్థాయికి ఎదుగుతారని సూచించారు. పాఠశాలలో చదువుకొని ఉన్నత స్థానాల్లో ఉన్న పూర్వ విద్యార్థులందరూ పాఠశాల అభివృద్ధికి సహకరించాల్సిన అవసరం ఎంతైనా ఉందని అన్నారు. పిడుగు కోనయ్య కోనమ్మ 1966లో నిర్మించిన రూములు తిరిగి మరమ్మతులు చేయించి విద్యార్థులకు ఉపయోగపడే విధంగా వారి ముని మనవళ్లు చేయడం అభినందనీయమని ఆయన అన్నారు. పూర్వికులు నిర్మించిన తరగతి గదులు తిరిగి మరమ్మత్తులు చేయించి పాఠశాలకు అందించడం గర్వించదగ్గ విషయం అంతకముందు పూజా కార్యక్రమంతో ప్రారంభించారు.ఈ కార్యక్రమంలో ఎంఈఓ-2 శివకుమార్,మొగిలిచర్ల ప్రధానోపాధ్యాయులు కె. సూర్య ప్రకాశరావు,పిడుగు కోనయ్య మనవడు పిడుగు ఓబులు,కొట్టే నారాయణ, కొట్టే బాలాజీ రావు,కొట్టే ఓజ్జలయ్య,మాజీ సర్పంచ్ ఉమ్మడిశెట్టి నాగేశ్వరరావు, పాఠశాల కమిటీ చైర్మన్ దగ్గ రవి,ఉపాధ్యాయులు,పిడుగు కోనయ్య కుటుంబ సభ్యులు,గ్రామస్తులు విద్యార్థులు, పాల్గొన్నారు.

## తాళ్లపల్లి ఎల్లమ్మ తల్లి కొలుకుల మహోత్సవం....






మార్కాపురం, శుభోదయం న్యూస్: ఈరోజు మార్కాపురం మండలం చింతకుంట్ల గ్రామంలో తాళ్లపల్లి ఎల్లమ్మ తల్లి కొలుపుల మహోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. కార్యక్రమానికి ఏ 1 గ్లోబల్ కళాశాల ప్రిన్సిపాల్ శ్రీ చందలూరి శ్రీధర్, ఉపాధ్యాయులు శ్రీ చందలూరి శ్రీనివాసులు, ఉపాధ్యాయులు తుంపాటి రమణ ల ఆహ్వాన%శీ% మేరకు ముఖ్య అతిథులుగా ఆంధ్రప్రదేశ్ ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్స్ జేఏసీ చైర్మన్ : మాదాసు రంగనాయకులు, డిప్యూటీ జనరల్ సెక్రెటరీస్ : దేవలూటి శంకర్, టీ. పి. వెంకటేశ్వర్లు, టీచర్ నరసింహారావు తదితరులు హాజరయ్యారు.ఈ కార్యక్రమానికి వచ్చిన అతిథులందరికీ అన్న అంతర్పణ చేయడం జరిగింది.

## జాతీయ రహదారుల్లో సమస్యల పరిష్కారానికి చర్యలు



నూజివీడు ప్రతినిధి ఏప్రిల్ 7 శుభోదయం న్యూస్: ఏలూరు ఎంపీ పుట్టా మహేష్ కుమార్ విజ్ఞప్తులకు సమాధానం ఇచ్చిన కేంద్ర రోడ్డు రవాణా, జాతీయ రహదారుల మంత్రిత్వ శాఖ మంత్రి నితిన్ గడ్కరీ.ఏలూరు పార్లమెంటు నియోజకవర్గం పరిధిలోని 216-ఏ, 16 జాతీయ రహదారుల్లో నెలకున్న సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నట్లు కేంద్ర రోడ్డు రవాణా, జాతీయ రహదారుల మంత్రిత్వ శాఖ మంత్రి నితిన్ గడ్కరీ లిఖిత పూర్వకంగా సమాధానం ఇచ్చారు. ఏలూరు జిల్లా భీమడోలు, కురెళ్లగూడెం, పూళ్ళ, కైకరం, చేబ్రోలు, నారాయణపురం గ్రామాల సమీపంలో గుర్తించిన ఏడు బ్లైండ్ స్పాట్‌ల వద్ద ప్రమాదాల నివారణకు ఫ్లైఓవర్‌లు లేదా సబ్‌వేలు నిర్మించాలని, సీతంపేట వద్ద ఫ్లై ఓవర్, బాక్స్ కల్వర్టు, ఉంగుటూరు గ్రామంలో ఫ్లైఓవర్ నిర్మాణానికి విధులు మంజూరు చేయాలని ఎంపీ పుట్టా మహేష్ కుమార్ మార్చి 11న కేంద్రమంత్రి నితిన్ గడ్కరీని కలిసి విజ్ఞప్తి చేశారు. ఆయా సమస్యలతో కూడిన వినతి పత్రాలను కేంద్రమంత్రికి అందజేశారు. ఎంపీ మహేష్ కుమార్ విజ్ఞప్తులకు సానుకూలంగా స్పందించిన కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ బదులిచ్చారు. వినతి పత్రంలో పేర్కొన్న సమస్యల పరిష్కారానికి అవసరమైన నిధులు మంజూరు అంశం ప్రభుత్వం పరిశీలనలో ఉందని కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ ఈ మేరకు లిఖిత పూర్వకంగా సమాధానం ఇచ్చారు.

## పార్టీ సభ్యత్వం ప్రమాద బీమా కార్డులను అందజేసిన ఎమ్మెల్యే



నూజివీడు ప్రతినిధి ఏప్రిల్ 7 శుభోదయం న్యూస్: చింతలపూడి మండలంలోని పాత చింతలపూడి గ్రామంలో చింతలపూడి నియోజకవర్గ శాసనసభ్యులు సొంగ రోషన్ కుమార్ గారి ఆదేశాల మేరకు పార్టీ సభ్యత్వ ప్రమాద భీమా కార్డులను చింతలపూడి నగర పంచాయతీ ప్రధాన కార్యదర్శి బోడా నాగభూషణం ఆధ్వర్యంలో పంపిణీ చేశారు.2 సంవత్సరాలకు కలిపి 100 రూ.చెల్లిస్తే 5 లక్షల ప్రమాదబీమాను జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ వర్తింప చేయడంతో,టీడీపీ మెంబర్ షిప్ తీసుకోవడం సమాజంలో ఒక గౌరవం, గుర్తింపుగా మారిందని శాసనసభ్యులు సొంగ రోషన్ కుమార్ చొరవతో చింతలపూడి నియోజకవర్గంలోని ప్రతి ఒక్కరూ సభ్యత్వం తీసుకునేందుకు ఆసక్తి చూపించారని,భీమ్ విషయంలో వారి ఆలోచనలకు అనుగుణంగా పని చేస్తామని బోడా నాగభూషణం అన్నారు.ఐటీడీపీ చింతలపూడి నియోజకవర్గ అధ్యక్షులు బోడ అనీష్ కుమార్ మాట్లాడుతూ 100రూ.చెల్లించి సభ్యత్వం తీసుకొన్న వారికి గతంలో రూ.2 లక్షలుగా ఉన్న ప్రమాద బీమా సదుపాయాన్ని రూ.5 లక్షలకు పెంచారనీ,అలాగే టీడీపీ సభ్యత్వ కార్డు ఉన్న వ్యక్తి మరణించిన రోజే అంత్యక్రియలకు రూ.10 వేలు అందించనున్నామని, దీంతో పాటు కార్యకర్తల కుటుంబాలకు విద్య, వైద్యం, ఉపాధి కోసం పార్టీ సాయం అందించడమే దీని ముఖ్య ఉద్దేశమని అన్నారు.ఈ కార్యక్రమంలో ఎస్సీ సెల్ చింతలపూడి టౌన్ అధ్యక్షులు కర్లపూడి రాజారత్నం, కార్యదర్శి బోడ సాగర్, మాజీ వార్డ్ మెంబర్ పోతురెడ్డిపల్లి జయరాజు, పడమటి సుబ్బారావు,పీక నాగేంద్ర, సురేంద్ర, పాత చింతలపూడి గ్రామ ముఖ్య నాయకులు, అధిక సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు.

# అమరావతికి 4285 కోట్లు విడుదల చేసిన కేంద్రం





అమరావతి, శుభోదయం న్యూస్: ఏపీ రాజధాని అమరావతి నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం రూ.4,285 కోట్లు విడుదల చేసింది. రాజధానిలో నిర్మాణ పనుల కోసం ప్రపంచ బ్యాంకు, ఏడీబీ నిధుల నుంచి 25 శాతం ఇచ్చింది. కేంద్రం వాటా రూ.750 కోట్లు కలిపి మొత్తం రూ.4,285 విడుదల చేసింది. అమరావతిలో పనులు ప్రారంభమవుతున్నందున 25 శాతం నిధులు అడ్వాన్స్ ఇవ్వాలని సీఆర్డీయే కోరింది. ఈ నేపథ్యంలో కేంద్రం ఈ నిధులను విడుదల చేసింది.

# మాజీ ఎంపీపీ అళ్ళ ఆంజనేయ రెడ్డిని కలిసిన దోర్నాల వైఎస్ఆర్ సీపీ నాయకులు



దోర్నాల మండల రిపోర్టర్ ఆవులయ్య ( శుభోదయం న్యూస్) ప్రకాశం జిల్లా దోర్నాల మండలం వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ త్రిపురాంతకం మండల మాజీ ఎంపీపీ ఆళ్ల ఆంజనేయ రెడ్డి గారిని మర్యాదపూర్వకంగా కలసి పరామర్శించిన దోర్నాల వైఎస్ఆర్సిపి నాయకులు దోర్నాల మండల వైఎస్ఆర్సిపి కన్వీనర్ గంట వెంకట రమణారెడ్డి దోర్నాల మండల ఎంపీపీ గుమ్మా పద్మజ యల్లేష్ ,వైస్ ఎంపీపీ దర్శనం నాగయ్య ఎడవల్లి మాజీ సర్పంచ్ వెన్న రంగారెడ్డి మండల యూత్ అధ్యక్షుడు గోల్మార్ రాజశేఖర్ రెడ్డి సోషల్ మీడియా కన్వీనర్ వెన్న బ్రహ్మానంద రెడ్డి.

# రావి క్రింది వారి నిశ్చితార్థ వేడుకలో పాల్గొన్న దోర్నాల వైఎస్ఆర్సిపి నాయకులు




దోర్నాల మండల రిపోర్టర్ ఆవులయ్య (శుభోదయం న్యూస్) ప్రకాశం జిల్లా దోర్నాల మండలం 07ఏప్రిల్ 2025 న బొగ్గరపు వారి కళ్యాణ మండపంలో దోర్నాల మండల మాజీ ఎంపీటీసీ రావి క్రింది రామారావు గారి కుమార్తె నిశ్చితార్థ వేడుకలో పాల్గొని ఆశీర్వదించిన దోర్నాల మండల వైఎస్ఆర్సిపి నాయకులు ఈ కార్యక్రమంలో దోర్నాల మండల వైఎస్ఆర్సిపి కన్వీనర్ గంట వెంకట రమణారెడ్డి దోర్నాల మండలం ఎంపీపీ గుమ్మ పద్మజ యల్లేష్ ఒంటేరు నాగేశ్వరరావు షేక్ షేక్షావలి మరియు దోర్నాల మండల వైఎస్ఆర్సిపి నాయకులు కార్యకర్తలు అందరు పాల్గొన్నారు

# ప్రపంచ ఆరోగ్య దినోత్సవ సందర్భంగా భారీ ర్యాలీ




సింగరాయకొండ, మండల రిపోర్టర్ - పసుమర్తి జాలయ్య (శుభోదయం న్యూస్ ): సింగరాయకొండ గవర్నమెంట్ హాస్పిటల్ మరియు సాంత్వన సేవ సమితి ఆధ్వర్యంలో ఆరోగ్యం పై అవగాహన భారీ ర్యాలీని నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ చైతన్య కృష్ణ మాట్లాడుతూ మనిషి ఆరోగ్యంగా ఉండాలంటే సమతుల్య ఆహారం వ్యాయామం తగినంత నిద్ర ఒత్తిడిని తగ్గించుకోవడం మంచి అలవాట్లను ఏర్పరచుకోవాలని క్రమం తప్పకుండా వైద్యుని సంప్రదించాలని ఆయన తెలియజేశారు. సాంత్వనా సేవా సమితి డైరెక్టర్ రావినూతల జయకుమార్ మాట్లాడుతూ,.. పోటీ ప్రపంచంలో పడి మనం ఆరోగ్యం నిర్లక్ష్యం చేస్తున్నాము. కాబట్టి తప్పకుండా మనం ఆరోగ్య సూత్రాలను పాటించాలన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ దేరేంధర్, డాక్టర్ వంశీధర్, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ వీరయ్య గారు, ఆరోగ్య పర్యవేక్షకులు మసూద్ ఆలీ, విజయమ్మ, రాజమ్మ, అంగన్వాడి సూపర్వైజర్ రిజ్వానా, స్వచ్ఛభారత్ కోఆర్డినేటర్ చిమటా సుధాకర్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు. ఈ ర్యాలీ కందుకూరు రోడ్డు నుండి పాకల రోడ్డు వరకు కొనసాగింది.

## టంగుటూరు

# టోల్ ప్లాజా వద్ద గంజాయి తరలింపు, నలుగురు అరెస్ట్




సింగరాయకొండ మండల రిపోర్టర్ పసుమర్తి జాలయ్య (శుభోదయం న్యూస్ ):ప్రకాశం జిల్లా టంగుటూరు టోల్ ప్లాజా సమీపంలోని సర్వీసు రోడ్డులో నలుగురు యువకులు అక్రమంగా గంజాయి తరలిస్తున్నారని సమాచారం ఆధారంగా సింగరాయకొండ పోలీసులు వారిని అరెస్ట్ చేశారు. వారి వద్ద నుండి సుమారు 4.5 కిలోల గంజాయిను స్వాధీనం చేసుకున్నారు.ఈ విషయమై మీడియాతో మాట్లాడిన సింగరాయకొండ సీఐ హాజరత్తయ్య గారు, "నిందితులను రిమాండ్‌కు తరలించాం. మాదకద్రవ్యాల వలన యువత భవిష్యత్తు దెబ్బతింటుంది. యువత ఈ దారులు వద్దనుకుని జీవితంలో మంచి లక్ష్యాలు సాధించేందుకు కృషి చేయాలి" అని సూచించారు.

# పెరుగుతున్న ఉష్ణోగ్రతల వల్ల గర్భిణీ స్త్రీలు ఇబ్బందులు పడకూడదు సూపరిండెంట్ డాక్టర్ సిద్ధార్థ



శుభోదయం న్యూస్, బాపట్ల జిల్లా: బాపట్ల పట్టణంలోని శ్రీ పొట్టి శ్రీరాములు ఏరియా వైద్యశాలలో ఎండాకాలం దృష్ట్యా ఉష్ణోగ్రతలు పెరుగుతున్న కారణాన ప్రసూతి విభాగంలో నాలుగు శీతలీకరణ యంత్రాలను ఏర్పాటు చేశామని ప్రస్తుతం ఉదయం 11 గంటల నుండి సాయంత్రం నాలుగు గంటల వరకు అందుబాటులో ఉంచుతామని ఏరియా వైద్యశాల కు వచ్చే గర్భిణీ స్త్రీలు పెరుగుతున్న ఉష్ణోగ్రతల వల్ల ఏ ఇబ్బంది పడకుండా ఏర్పాటు చేశామని అవసరాన్ని బట్టి 24 గంటలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకుంటామని ఏరియా హాస్పటల్ సూపరిండెంట్ డాక్టర్ సిద్ధార్థ ఒక ప్రకటనలో తెలిపారు,

# ప్రపంచ ఆరోగ్య దినోత్సవ ర్యాలీని ప్రారంభించిన జిల్లా కలెక్టర్ జె వెంకట మురళి



శుభోదయం న్యూస్, బాపట్ల జిల్లా: పట్టణంలోని ప్రభుత్వం మున్సిపల్ హై స్కూల్ ఉన్నత పాఠశాల నుండి ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా ర్యాలీని ప్రారంభించిన జిల్లా కలెక్టర్ జె, వెంకట మురళి. ఈ కార్యక్రమంలో పాల్గొన్న మున్సిపల్ హై స్కూల్ సిబ్బంది విద్యార్థులు,

# అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ గా నియమంతులైన..... గవని శ్రీనివాసరావుకు పలువురు అభినందనలు



శుభోదయం న్యూస్, బాపట్ల జిల్లా: బాపట్ల జిల్లా ఏర్పడిన తర్వాత మొట్టమొదటి సారిగా అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ గా నియమితులైన గవిని శ్రీనివాసరావు. సోమవారం కోర్ట్ ప్రాంగణం నందు ఏర్పాటు చేసిన నూతన చాంబర్ లో బాధ్యతలు చేపట్టారు.అనంతరం తన నియామక పత్రాలను 6 వ అదనపు జిల్లా జడ్జ్ శ్యామ్ బాబుకి అందజేశారు,నూతన ఏ పి పి గా నియమితులైన గవిని శ్రీనివాసరావు ని పలువురు న్యాయవాదులు తన ఛాంబర్ నందు కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలియజేశార

# చందోలు పోలీస్ స్టేషన్ కి నూతన ఎస్సై ఎం వెంకట శివకుమార్




శుభోదయం న్యూస్, బాపట్ల జిల్లా: చందోలు పోలీస్ స్టేషన్ నూతన ఎస్ఐగా ఎం.వెంకట శివ కుమార్ సోమవారం ఉద్యోగ బాధ్యతలు చేపట్టారు.

# భూ సమస్యలు తక్షణమే పరిష్కరిస్తా తాహసిల్దార్ మధుసూదన్ రావు



శ్రీ కాళహస్తి, రిపోర్టర్ బాబు (శుభోదయం న్యూస్) : నియోజకవర్గ శాసన సభ్యులు బొజ్జల సుధీర్ రెడ్డి ఆదేశాల మేరకు తొట్టంబేడు మండల రెవెన్యూ కార్యాలయంలో జరిగిన సమస్యల పరిష్కార వేదికలో మండల రెవెన్యూ అధికారి మధుసూదన్ రావు, మండల అభివృద్ధి అధికారి సురేంద్రనాథ్,టిడిపి మండల పార్టీ అధ్యక్షులు గాలి మురళి నాయుడు పాల్గొన్నారు.ఈ సందర్భంగా తాహసిల్దార్ మాట్లాడుతూ భూ సమస్యలను తక్షణమే పరిష్కరిస్తారని మండల ప్రజలు ఈ రెవెన్యూ పరిష్కార సదస్సులను సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. మండల అధ్యక్షుడు గాలి.మురళి నాయుడు మాట్లాడుతూ మండలంలో భూ సమస్యలు వెంటనే పరిష్కరించాలని, అక్రమంగా తరలిస్తున్న గ్రావెల్ మాఫియా, ఇసుక మాఫియా లను అడ్డుకోవాలని, గ్రామాల్లో మంచినీటి సమస్యల ను తీర్చాలని అధికారులను కోరారు.అధికారులు స్పందిస్తూ సమస్యలపై త్వరగా స్పందిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో అధికారులు, మండల ప్రజలు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# జోనల్ స్పోర్ట్ మీట్ లో విజేతలుగా నిలిచిన శ్రీకాళహస్తి బ్రాంచ్ - 2 విద్యార్థులు



శ్రీకాళహస్తి, రిపోర్టర్ బాబు (శుభోదయం న్యూస్) :తిరుపతిలోని తుమ్మలగుండ క్రీడామైదానంలో డాక్టర్ బి.ఎన్.రావు మెమోరియల్ జోనల్ స్పోర్ట్స్ మీట్ ఏర్పాటు చేశారు,ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధులుగా ఎస్.వి. యూనివర్సిటీ రిజిస్టర్ ప్రొఫెసర్ భూపతినాయుడు, డాక్టర్ సూరా సరోజిని, ఇన్స్పెక్టర్ ఆఫ్ పోలీస్‌సుబ్బిరామిరెడ్డి విచ్చేశారు.ఈ సందర్భంగా రిజిస్టర్ భూపతినాయుడు మాట్లాడుతూ ఒత్తిడితోకూరుకు పోయిన విద్యావిధానంలో శ్రీచైతన్య నిర్వహించినఈ క్రీడా కార్యక్రమం చాలా గొప్ప ఆలోచన అని తెలిపారు.ఈ కార్యక్రమాన్ని నిర్వహించిన చైతన్య యాజమాన్యాన్ని అభినందించారు.ఈ క్రీడా కార్యక్రమానికి వచ్చిన 1500మంది విద్యార్థులలో శ్రీ చైతన్య శ్రీకాళహస్తి బ్రాంచ్-2 విద్యార్థులు అద్భుతమైన ప్రతిభను కనబరిచి, ఓవరాల్ చాంపియన్షిప్ ను గెలుచుకున్నారు.ఈ సందర్భంగా పాఠశాల పిన్సిపాల్ రూపాదేవి మట్లాడుతూ తమ విద్యార్థులు చూపిన ప్రతిభను కొనియాడారు మరియు విద్యార్థులకు చక్కటిశిక్షణ ను అందించిన పి ఈ టి మేఘన ను అభినందించారు.ఏజిఈ సురేష్ మాట్లాడుతూ శ్రీచైతన్య విద్యార్థులు చదువులోనే కాదు క్రీడారంగంలో కూడా వారి అద్భుత ప్రతిభను ప్రదర్శించారని అన్నారు.అలాగే అన్ని రంగాలలో ముందంజ లో ఉండాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఇన్చార్జులు కల్పన, పిఈటి మేఘనఏ.డి సురేష్,విద్యార్థులు పాల్గొన్నారు.

# జూనియర్ ఇంటర్ ప్రవేశాలకు ఆహ్వానం



శ్రీకాళహస్తి, రిపోర్టర్ బాబు (శుభోదయం న్యూస్) :శ్రీకాళహస్తిలోని స్వామి విద్యాప్రకాశానంద ప్రభుత్వ జూనియర్ కళాశాల నందు ఇంటర్మీడియట్ ప్రవేశాల కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ సుధాకర్ రెడ్డి తెలియజేశారు. ఆయన మాట్లాడుతూ..సోమవారం నుంచి ప్రభుత్వం ఆదేశాల మేరకు ,ఇంటర్మీడియట్ ప్రవేశాల కోసం విద్యార్థుల వద్ద నుంచి దరఖాస్తుల స్వీకరిస్తున్నామని, ఉన్నత విలువలతో కూడిన విద్యను తమ కళాశాల విద్యార్థులకు అందజేస్తుందని , విద్యార్థులు తమ ప్రభుత్వ కళాశాలలో చేరి ప్రభుత్వం అందజేస్తున్న సదుపాయాలను సద్వినియోగం చేసుకోవాలని ఈ సందర్భంగా ఆయన విద్యార్థులను



కోరారు. కళాశాలలోని ద్వితీయ సంవత్సరం ఇంటర్ విద్యార్థులకు ప్రభుత్వం అందజేసిన పుస్తకాలను అందజేశామని, అదేవిధంగా మధ్యాహ్న భోజన పథకం నేటి నుంచే విద్యార్థులకు అందజేస్తున్నామని, అన్ని సదుపాయాలు కళాశాలలో ఉన్నాయని, విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలను బలోపేతం చేసే విధంగా ప్రతి ఒక్కరు ప్రభుత్వ కళాశాలలో చేరాలని కోరారు.

# అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ గా నియమంతులైన... గవని శ్రీనివాసరావుకు పలువురు అభినందనలు




శుభోదయం న్యూస్, బాపట్ల జిల్లా: అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ (ఏపీపీ) గా సీనియర్ న్యాయవాది గవిని శ్రీనివాసరావు నియమితులై, సోమవారం బాధ్యతలు స్వీకరించారు.తన నియామక పత్రాలను 6 వ అదనపు జిల్లా జడ్జి శ్యాం బాబు కి అందచేశారు.అనంతరం కోర్టు ప్రాంగణంలో ఉన్న ఏపీపీ చాంబర్ ను సీనియర్ అడ్వకేట్ సత్య ప్రసాద్ ప్రారంభించి శుభాకాంక్షలు తెలిపారు.1993 న్యాయవృత్తిని చేపట్టి 2000 సంవత్సరంలో అతి చిన్న వయసులోనే బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ గా పనిచేసిన గవిని శ్రీనివాసరావు బాపట్ల జిల్లా ఏర్పడిన తర్వాత మొదటి అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ గా బాధ్యతలు చేపట్టారు.ఈ సందర్భంగా ఏ పి పి గవిని శ్రీనివాసరావు మాట్లాడుతూ అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ గా తనను నియమించడంపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఎమ్మెల్యే వేగేశన నరేంద్ర వర్మకు కృతజ్ఞతలు తెలిపారు.ప్రభుత్వం తరపున న్యాయపరమైనటువంటి అంశాలలో ఎలాంటి రాజీ లేకుండా పనిచేస్తామని ఆయన స్పష్టం చేశారు.బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ కంచర్ల అవినాష్, సీనియర్ న్యాయవాదులు నందనవనం ప్రసాద్, ఆర్ వెంకటేశ్వర్లు, పులిపాక రఘురామ్, నల్లమోతు సుబ్బారావు, జమ్రుద్దీన్ భాష, కళ్లం హరినాథ రెడ్డి, అంబటి మురళీ కృష్ణ, చల్లా రాజు, ఇమ్మడిశెట్టి కోటేశ్వరరావు, ప్రముఖ ఛార్టర్డ్ అకౌంటెంట్ చాపల సుబ్రహ్మణ్యం, లయన్స్ క్లబ్ అధ్యక్షులు శీలం శ్రీనివాసరావుమరియు పలువురు న్యాయవాదులు, ఆయన అభిమానులు పాల్గొని శుభాకాంక్షలు తెలిపారు.

# ఐఐటి విద్యార్థులకు బహుమతులు అందజేసిన మండల విద్యాధికారి



వలిగొండ మండల రిపోర్టర్ (శుభోదయం న్యూస్)ఏప్రిల్ 7:యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండల కేంద్రంలోని గాయత్రి పాఠశాలలో ఐఐటీ దినోత్సవం ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మండల విద్యాధికారి సుంకోజు భాస్కర్ హాజరైమాట్లాడుతూ ఒకప్పుడు ఐఐటి అనేది పట్టణాలకు,మాత్రమే పరిమితమై చాలా వ్యయంతో కూడుకున్న చదువుగా ఉండేది. ఇప్పుడు దానిని మండల స్థాయికి తీసుకొచ్చిన ఘనత గాయత్రి పాఠశాల యజమాన్యానికే దక్కింది అని ఈ సందర్భంగా వారిని అభినందించారు.రానున్న రోజుల్లో పోటీ ప్రపంచానికి తట్టుకొని నిలబడేటట్లు విద్యార్థులకు ఐఐటి ఎంతో సహాయపడుతుంది ఆయన అన్నారు. అనంతరం విద్యార్థులకు ప్రశంస పత్రాలు అందజేశారు.ఈ కార్యక్రమంలో గాయత్రి పాఠశాల చైర్మన్ తౌటమ్ నరహరి ,వైస్ చైర్మన్ పనుమట్టి మురళీధర్ రెడ్డి, కరస్పాండెంట్ భీమిడి యాదిరెడ్డి ,వైస్ ప్రిన్సిపల్ కొంతం బిక్షపతి ,ఆర్గనైజింగ్ సెక్రటరీ పాలకూర వెంకటేశం, ప్రిన్సిపల్ అనురాధ ,ఐఐటీ ఉపాధ్యాయులు ముత్యాల స్వామి ,సాయి తేజ ఉపాధ్యాయిని, ఉపాధ్యాయుల బృందం తదితరులు పాల్గొన్నారు.

# తిరుమల శ్రీవారిని దర్శించుకున్న గోవర్ధన్ రెడ్డి దంపతులు వివాహ వార్షికోత్సవం సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహణ



గుమ్మడిదల, (శుభోదయం న్యూస్): బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు, సీజీఆర్ ట్రస్ట్ చైర్మన్ చిమ్ముల గోవర్ధన్ రెడ్డి తన సతీమణి సంధ్యతో కలిసి సోమవారం తిరుమల శ్రీ వెంకటేశ్వర స్వామిని దర్శించుకున్నారు. వివాహ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని కుటుంబ సభ్యులతో కలిసి స్వామివారి దర్శనానంతరం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా గోవర్ధన్ రెడ్డి మాట్లాడుతూ, "తిరుమల శ్రీవారిని దర్శించుకోవడం మాకు ఎంతో ఆధ్యాత్మిక సంతృప్తిని కలిగించింది. ఈ పవిత్ర పుణ్యక్షేత్రంలో మా వివాహ వార్షికోత్సవాన్ని జరుపుకోవడం ఎంతో ఆనందంగా ఉందని పేర్కొనారు. ఏడుకొండల స్వామి కృపతో రాష్ట్ర ప్రజలు సుభిక్షంగా ఉండాలని అన్నారు.

# పచ్చని అడవిలో చెత్త వ్యర్థాలతో ప్రకృతిని నాశనం చెయ్యొద్దు




గుమ్మడిదల, (శుభోదయం న్యూస్): గుమ్మడిదల మున్సిపల్ పరిధిలోని నల్లవల్లి ప్యారానగర్ డంప్ యార్డ్ కు వ్యతిరేకంగా గుమ్మడిదల మండల కేంద్రంలో రిలే నిరాహారదీక్ష 62వ రోజుకు చేరుకున్నదిరిలే నిరాహార దీక్షలో గుమ్మడిదల మున్సిపల్ నాయకులు పాల్గొన్నారు.నిరసన దీక్షలో మండల జేఏసిసభ్యులు ఆలేటి శ్రీనివాస్ రెడ్డి,మద్దుల బాల్ రెడ్డి,ఆకుల సత్యనారాయణ, ఉదయ్ కుమార్, బిక్షపతి రెడ్డి, సూర్యనారాయణ, భీమ్ రెడ్డి,మంద భాస్కర్ రెడ్డి, జె.బాలైడ్డి, వాసుదేవరెడ్డి, ఆంజనేయులు, వేణుగోపాల్ రెడ్డి,నల్తూరుయాదగిరి, కుంటిమల్లేశ, ఆయుబ్,జేఏసీ నాయకులు తదీతరులు పాల్గొన్నారు.

# హనుమాన్ దీక్ష తీసుకున్న స్వాములకు సామూహిక భిక్షను పెట్టిన కోడి రమేష్



ఉమ్మడి అదిలాబాద్ జిల్లా బ్యూరో చీఫ్ దార రాజేశం (శుభోదయం న్యూస్) ఏప్రిల్ 7: ఈరోజు హిందూ ఉత్సవ సమితి ఆధ్వర్యంలో కోడి రమేష్ సౌజన్యంతోబెల్లంపల్లి పట్టణ పంచముఖ హనుమాన్ మందిరం లో పూజ కార్యక్రమాలు చేపించినఅనంతరం హనుమాన్ మాల ధరించినటువంటి స్వాములందరికీ అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు ఇట్టి కార్యక్రమానికి స్వాములు అధిక సంఖ్యలో పాల్గొని భిక్షను చేశారు వారితోపాటు కొంతమంది భక్తులు కూడా భిక్ష చేశారు ఇట్టి కార్యక్రమానికి గుడికి సంబంధించినటువంటి కమిటీ సభ్యులు సహకరించినందుకు వారికి ధన్యవాదాలు తెలియజేశారు.పంచముఖ హనుమాన్ మందిరంలో హనుమాన్ దీక్ష తీసుకున్న స్వాములకు సామూహిక భిక్షను పెట్టినందుకు తాను ఎంతో పుణ్యం చేసుకున్నాను కాబట్టే నాకు ఇలాంటి అవకాశం లభించిందని తాను సంతోషాన్ని వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమము ఇంత విజయవంతం కావడానికి సహకరించినటువంటి ప్రతి ఒక్కరికి పేరుపేరునా అలాగే మీడియాకు ప్రత్యేక ధన్యవాదాలు కోడి రమేష్ మరియు వారి కుటుంబ సభ్యులు తెలియజేశారు.

# మహాత్మా గాంధీని చంపిన గాడ్సే వారసులు బిజెపి నేతలు

### అంబేద్కర్ దిష్టిబొమ్మను దగ్ధం చేసిన దుష్టులు ఆర్ఎస్ఎస్ శ్రేణులు

### డిసిసి అధ్యక్షులు తూంకుంట నర్సారెడ్డి



వర్గల్ మండల రిపోర్టర్ విష్ణువర్ధన్ రెడ్డి (శుభోదయం న్యూస్) ఏప్రిల్ 7: పూజ్య మహాత్మా గాంధీని చంపిన గాడ్సే వారసులు బిజెపి నేతలని జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు తూ%శీ%కుంట నర్సారెడ్డి విమర్శించారు. జై బాపు, జై భీమ్, జై సంవిధాన్ అభియాన్ లో భాగంగా సోమవారం వర్గల్ లో పాదయాత్ర చేపట్టి ప్రజలను చైతన్యం చేసిన సందర్భంగా రాష్ట్ర రాష్ట్ర ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ నగారిగారి ప్రీతంతో కలిసి ఆయన ప్రసంగించారు. భారత రాజ్యాంగాన్ని, ప్రజాస్వామ్యాన్ని అపహస్యం చేస్తున్న మోడీ అధికారం కోసం ఎంతకైనా తెగిస్తారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రధాని నరేంద్ర మోడీ ప్రజా వ్యతిరేక విధానాలకు పాల్పడుతూ ప్రజల సొమ్మును కార్పొరేట్ గద్దెలకు కట్టబెడుతున్నట్లు ఎద్దేవా చేశారు. ముఖ్యంగా ఆరెస్సెస్ పత్రిక ఆర్గనైజర్ లో రాజ్యాంగంపై అవమానకర రీతిలో ప్రచురించడం సిగ్గుచేటని నిలదీశారు. అయితే ఆర్గనైజర్ పత్రికలో రాజ్యాంగం " భారతీయం కాదు" అని ప్రచురించడం దురదృష్టకరం కాగా, దేశం గర్వించదగ్గ మేధావులు పూజ్య మహాత్మా గాంధీ, డాక్టర్ బిఆర్ అంబేద్కర్ వారసత్వంపై ప్రతినిత్యం బీజేపీ దాడి చేస్తోందని తెలిపారు. అలాగే కరెన్సీ నోట్లపై "గాంధీ" చిత్రాన్ని తొలగించేందుకు కూడా బిజెపి వెనుకాడని, డాక్టర్ బిఆర్ అంబేద్కర్ ను అవమానించడం మోడీకి ఆనవాయితీగా మారిందని చెప్పారు. మహిళల హక్కులపై అంబేద్కర్ మాట్లాడగా, ఆయన దిష్టిబొమ్మ దగ్ధం చేసిన ఘన చరిత్ర ఆరెస్సెస్ దని అన్నారు. స్వాతంత్ర్య ఉద్యమంలో బీజేపీ నేతలు ఎక్కడ దాక్కున్నారని విమర్శించారు. కార్పొరేట్ వ్యవస్థకు కొమ్ముకాస్తున్న బిజెపి సర్కార్ నిరుద్యోగ సమస్యను సైతం నిర్మూలించ లేకపోయిందని వివరించారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ కాంగ్రెస్ ప్రచార కమిటీ చైర్మన్ నిమ్మ రంగారెడ్డి, రాష్ట్ర యూత్ కాంగ్రెస్ వైస్ చైర్మన్ ఆంక్షా రెడ్డి, మండల కాంగ్రెస్ అధ్యక్షులు సందీప్ రెడ్డి, మాజీ జెడ్పిటిసి ప్రభుదాస్ గౌడ్, మాజీ ఎంపీపీ మోహన్, యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు రాజశేఖర్ రెడ్డి, మండల శాఖ అధ్యక్షుడు సాయి గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రజాధనం దోచుకున్న బిఆర్ఎస్

## అధికారం లేదని ఈర్షతో కాంగ్రెస్ ప్రభుత్వంపై దుష్ప్రచారం

### రాష్ట్ర ఎస్సీ ఎస్టీ కమిషన్ చైర్మన్ నగారి ప్రీతం



వర్గల్ మండల రిపోర్టర్ విష్ణువర్ధన్ రెడ్డి (శుభోదయం న్యూస్) ఏప్రిల్ 7: రాష్ట్రంలో 10 ఏళ్లు పాలన చేసిన బిఆర్ఎస్ పార్టీ రూ లక్ష కోట్లు ప్రజల సొమ్ము దోచుకోగా, అదే డబ్బుతో కాంగ్రెస్ ప్రభుత్వంపై దుష్ప్రచారం చేస్తూందని రాష్ట్ర ఎస్సీ ఎస్టీ కమిషన్ చైర్మన్ నగారి ప్రీతం ఆగ్రహం వ్యక్తం చేశారు. సోమవారం సిద్దిపేట జిల్లా గౌరారంలో నిర్వహించిన కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే తూ%శీ%కుంట నర్సారెడ్డితో కలిసి ప్రసంగించారు. మాటలతో మభ్యపెడుతూ ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్న కేటీఆర్, హరీష్ రావులు కంచగట్టు భూములపై దుష్ప్రచారం చేస్తూ, సోషల్ మీడియా ద్వారా నెమళ్ళు, జింకలు, పక్షులను చంపుతున్నట్లు ప్రభుత్వంపై అసత్య ప్రచార%శీ%తో కుట్ర చేస్తుండగా, తమకు చట్టాలు, రాజ్యాంగంపై పూర్తి నమ్మకం ఉందని తద్వారా రాష్ట్ర సంక్షేమం భేష్ గా ఉంటుందని స్పష్టం చేశారు. ఏడు దశాబ్దాల అనంతరం కేంద్రంలోని బిజెపి ప్రభుత్వ నేతృత్వంలో రాజ్యాంగాన్ని మార్చే కుట్ర జరుగుతుండగా, ప్రజా చైతన్యంతో ప్రధాని నరేంద్ర మోడీ చర్యలను తిప్పికొడతామని స్పష్టం చేశారు. కాగా అందరికీ సమాన హక్కులు కల్పించాలని ఎస్సీ వర్గీకరణ కోసం అసెంబ్లీలో తీర్మానాన్ని కాంగ్రెస్ ప్రవేశపెట్టి ఆమోదింప చేసిందని, అలాగే బిసిలకు 42 శాతం రిజర్వేషన్ తో స్థానిక సంస్థల ఎన్నికల్లో రిజర్వేషన్, ఉద్యోగ నియామకాల్లో న్యాయం కోసం కృషి చేస్తున్నట్లు పేర్కొన్నారు. అలాగే పేద విద్యార్థులకు రిజర్వేషన్లు కీలకం కానున్న తరుణంలో వాటిని ఎత్తి వేసే కుట్ర జరుగుతోందని అన్నారు. నాడు స్వాతంత్ర్య ఉద్యమంలో పూజ్య మహాత్మగాంధీని మట్టుబెట్టాలని ఆంగ్లేయులు ప్రయత్నించగా, నేడు మన ప్రభుత్వాన్ని కూల్చడానికి ప్రతిపక్ష బిఆర్ఎస్, బిజెపిలు చీకటి ఒప్పందంతో ముందుకెళ్తున్నట్లు ఆగ్రహం వ్యక్తం చేశారు. అయితే వారికి పార్టీ కార్యకర్తలే తగిన బుద్ధి చెప్పాలని సూచించారు. ముఖ్యంగా బిఆర్ఎస్ పెద్దలు కేసీఆర్, కేటీఆర్, హరీష్ రావులు సోషల్ మీడియాను నమ్ముకోగా, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రజలను నమ్ముకుందని తెలిపారు. అయితే ప్రభుత్వం చేయని తప్పులను చేసినట్లుగా సోషల్ మీడియాలో అసత్య ప్రచారం చేస్తున్నారని, వారు చేసిన తప్పులకు ఎన్నడైనా జైలుకెళ్ళక తప్పదని ఎద్దేవా చేశారు. కంచగట్టు భూములు యూనివర్శిటీవి కాదని ఆధారాలు చూపుతూ ప్రజలను చైతన్యం చేయాలని కోరారు. ముఖ్యంగా రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం, సీఎం రేవంత్ రెడ్డి చేపడుతున్న ప్రజా సంక్షేమ పథకాలను ప్రతిపక్షాలు జీర్ణించుకోలేక పోతున్నట్లు ఆగ్రహం వ్యక్తం చేశారు. అయితే ఇక్కడి బిజెపి మంత్రులు కేంద్రం నుండి రావాల్సిన నిధులను సాధించలేకపోతుండగా, ప్రజలను తప్పుదోవ పట్టించే విధంగా మాట్లాడుతున్నట్లు ఆరోపించారు. రాష్ట్రంలో సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ పార్టీ బలోపేతం కాగా, మరో 10 ఏళ్ల వరకు కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఎవరు ఏమి చేయలేరని విమర్శించారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఆంక్షా రెడ్డి, నిమ్మ రంగారెడ్డి, సందీప్ రెడ్డి, విద్యాకుమార్, నీల శ్రీనివాస్, ప్రవీణ్ గౌడ్, భూపాల్ రెడ్డి, భానుప్రసాద్ గౌడ్, శ్రీనివాస్ గౌడ్, నర్సింలు, రవీందర్ రెడ్డి, రాజశేఖర్ రెడ్డి, వెంకటేష్, సాయి గౌడ్ తదితరులు పాల్గొన్నారు. కాగా అనంతరం ప్రభుత్వం నూతనంగా పంపిణీ చేసిన సన్న బియ్యంతో వారు దళితవాడలో భోజనం చేశారు.

## రాజ్యాంగాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరి మీద ఉంది

## వరంగల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఎర్రబెల్లి స్వర్ణ



పరకాల నియోజకవర్గం, (శుభోదయం న్యూస్ ): రాజ్యాంగ పరిరక్షణలో భాగంగా జై బాపు,జై భీమ్,జై సంవిధాన్ నినాదాన్ని ప్రజల్లోకి తీసుకెళ్ళాలనే ఉద్దేశంతో జాతీయ కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షులు లోకసభ సభ్యులు శ్రీ.రాహూల్ గాంధీ జాతీయ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మల్లిఖార్జున ఖర్గే మరియు రాష్ట్ర అధ్యక్షులు శ్రీ మహేష్ కుమార్ గౌడ్ ఆదేశాల మేరకు పరకాల నియోజకవర్గం గీసుగొండ మండలం సంగం మండలం ఆరెపల్లి, ఏలుకుర్తి గ్రామాల్లో జై బాపు,జై భీమ్,జై సంవిధాన్ పాదయాత్ర లో ముఖ్య అతిధులుగా పాల్గొన్న వరంగల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు శ్రీమతి ఎర్రబెల్లి స్వర్ణ మరియు టీపీసీసీ జనరల్ సెక్రటరీ కుచన రవళిఈ సందర్భంగా ఎర్రబెల్లి స్వర్ణ మాట్లాడుతూ..గత పదేళ్లకు పైగా దేశాన్ని పాలిస్తున్న బీజేపీ రాజ్యంగాన్నీ అవమానపరుస్తూ రాజ్యాంగ స్ఫూర్తిని దెబ్బ తీస్తూ అప్రజాస్వామ్య పాలన సాగిస్తుంది,ప్రజల సమాన హక్కులు,సమ న్యాయం కల్పించాల్సిన పాలకులు రాజ్యాంగం ఇచ్చిన స్వేచ్ఛను



కాలరాస్తూన్న తీరు తీవ్ర ఆక్షేపనియంగా ఉంది ఇలాంటి తరుణంలో రాజ్యాంగాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరి మీద ఉందని అన్నారు..అందుకే రాజ్యాంగాన్ని రచించి ప్రపంచంలో ఎక్కడ లేని విధంగా అందరికీ సమాన హక్కులు కల్పించిన రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్ గారి ఆలోచనలను కాపాడుకుంటూ జై బాపు,జై భీమ్,జై సంవీదాన్ నినాదంతో ఉద్యమిద్దామని తెలియజేశారు.ఈ కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు, మాజీ ప్రజా ప్రతినిధులు కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర, జిల్లా, మండల, గ్రామ, డివిజన్ నాయకులు, కార్యకర్తలు యూత్ కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

## రెండు ఇండ్లలో దొంగతనం చేసిన వ్యక్తులను అరెస్ట్ బెల్లంపల్లి పోలీసులు



ఉమ్మడి అదిలాబాద్ జిల్లా బ్యూరో చీఫ్ దార రాజేశం (శుభోదయం న్యూస్) ఏప్రిల్ 7: మంచిర్యాల జిల్లా బెల్లంపల్లి పట్టణంలో తేదీ 29/03/2025 న అర్ధరాత్రి తెల్లవారుజామున బెల్లంపల్లి కాల్ టెక్స్ ఏరియా లో గల సాన శ్రావణ్ ఇంటిలో దొంగలు తలుపు గోల్లెం పగుల గొట్టి ఇంటిలోకి వెళ్లి 14.5 తులాల బంగారం, కెజిన్నర వెండి వస్తువులు, 20,000/- నగదు,ఇంటి పరిసరాలలో ఉన్న 4 బైకులు దొంగిలించుకు పోయినారు. శ్రావణ్ ,అత్తే సుధాకర్ లు ఇచ్చిన ఫిర్యాదులపై బెల్లంపల్లి రెండవ పట్టణ పోలీస్ స్టేషన్ లో కేసు నమోదు చేసి దర్యాప్తు లో భాగంగా బెల్లంపల్లి రైల్వే స్టేషన్ పరిసర ప్రాంతములలో ఒక వ్యక్తి అనుమానాస్పదముగా కనిపించగా అతన్ని పట్టుకొని విచారించగా అతను తన పేరు గజానంద్ పార్ది కనేరా గ్రామం, గుణా



జిల్లా, మధ్యప్రదేశ్ రాష్ట్రం అని తెలియజేశాడు తేదీ :29-03-2025వ రోజున కాల్ టిక్స్ బెల్లంపల్లి లో గల రెండు ఇండ్లలో దొంగతనం చేసినట్లు తన నేరం ను ఒప్పుకున్నాడు. అతని నేరము ఒప్పుదల ప్రకారం వారు దొంగతనం చేసి దాచిపెట్టిన నాలుగు మోటార్ సైకల్ లను స్వాదీనపర్చుకొని అరెస్ట్ చేసి రిమాండ్ కు తరలించినట్లు ఏసీపి బెల్లంపల్లి వెల్లడించినారు.ఏ1) లాల్ జీ,ఏ2) గాజనంద్ పార్ధి,3) రోషన్.4) ఘోటియఇట్టి దొంగను పట్టుకోవడం లో చాకచక్యం గా వ్యవహరించిన బెల్లంపల్లి రూరల్ సీఐ సయ్యద్ అఫ్జలుద్దిన్, బెల్లంపల్లి రెండవ పట్టణ ఎస్సై మహేందర్, తాళ్ళగూరిజల ఎస్సై రమేష్, నెన్నెల్ ఎస్సై ప్రసాద్ మరియు సిబ్బందిని ఏ సీ పీ బెల్లంపల్లి అభినందించినారు.

## ప్రాణాల మీధికొచ్చిన కల్తీ కల్లు సుమారు 25 మందికి అస్వస్థత



బీర్కూర్, మండలం రిపోర్టర్ (శుభోదయం న్యూస్):కామారెడ్డి జిల్లా నసురుల్లాబాద్ మండలం మరియు బీర్కూరు మండల కేంద్రంలో పలువురు కల్తీ కల్లు త్రాగి అస్వస్థతకు గురైనట్టు గ్రామస్తులు తెలిపారు.వివరాల్లోకి వెళ్తే నస్రుల్లాబాద్ మండలం ధుర్కి గ్రామం లో ఉన్నటువంటి కల్లు డిపో నుండి పలు గ్రామాలకు కల్లు కాంపౌండ్ లోకి సరఫరా చేస్తున్నారు. అంకుల్,దుర్కీ,ధామరంచ గ్రామాల పరిధిలో ఉన్న కల్లు కాంపౌండ్ లో కల్లు సేవించిన పలువురు కి వాంతులు,విరేచనాలు,నాలుక మొద్దుబారడం,సొమ్మశిల్లడం, మెడలు వంగిపోవటం,వంటి సమస్యలు తలెత్యాయి ఇది గమనించిన స్థానికులు బాన్సువాడ ఏరియా ఆసుపత్రి కి తరలించగా వివిధ గ్రామాల్లో నుండి సుమారు 25 మంది తీవ్ర అస్వస్థతకు గురై వచ్చినట్టు స్థానికులు తెలిపారు. ఈ ఘటన తెలుసుకున్న బాన్సువాడ డివిజన్ సబ్ కలెక్టర్ కిరణ్మయి హుటాహుటిన ఆసుపత్రి కి చేరుకున్నారు అలాగే తెలంగాణ రాష్ట్ర ఆగ్రో ఇండస్ట్రీస్ ఛైర్మెన్ కాసుల బాలరాజు కూడా అక్కడికి చేరుకొని పరామర్శించారు వెంటనే అత్యవసర చికిత్స అందించవలసిందిగ డాక్టర్ లను ఆదేశించారు. పరిస్థితి విషమించిన పలువురికి జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్టు తెలిపారు. ఈ విషయానికై ఎక్సైజ్ సీఐ యాదగిరి గౌడ్ కు వివరణ కోరగా కల్తీ అయిన కల్లు శాంపిల్స్ తీసుకున్నట్టు వివరణ ఇచ్చారు. నిబంధనలకు విరుద్ధంగా కృత్రిమంగా తయారు చేస్తున్న కళ్ళు ను అమ్మి ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నారు అని కుటుంబ సభ్యులు స్థానికులు వాపుతున్నారు ఇకనైనా సంబంధిత అధికారులు వెంటనే దాడులు నిర్వహించి చర్యలు తీసుకోవాల్సిందిగా కోరుతున్నారు.

## భూములు కోల్పోతున్న రైతులకు ఎకరాకు 25 లక్షలు, కుటుంబంలో ఒకరికి పర్మినెంట్ ఉద్యోగం ఇవ్వాలి

### కేసరి ఆంజనేయులు గౌడ్ బిజెపి జిల్లా అధికార ప్రతినిధి



ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా బ్యూరో చీఫ్ దార రాజేశం (శుభోదయం న్యూస్) ఏప్రిల్ 7: రెబ్బెన మండలం గోలేటి మరియు సోనాపూర్ శివారులో సింగరేణి ఓపెన్ కాస్ట్ లో ముంపునకు గురవుతున్న భూములకు సింగరేణి యాజమాన్యం ఎకరాకు 25 లక్షల రూపాయల నష్టపరిహారం తో పాటు సింగరేణి ఉద్యోగం ఇవ్వాలని అన్నారు బిజెపి జిల్లా అధికార ప్రతినిధి కేసరి ఆంజనేయులు గౌడ్ మాట్లాడుతూ సింగరేణి యాజమాన్యం ఓపెన్ కాస్ట్ పేరుతో భూమి తీసుకుంటున్న రైతులకు ఎకరాకు కేవలం 7 లక్షల రూపాయలు నష్టపరిహారం ఇవ్వాలని చూస్తుందని ఇది చాలా తక్కువ ధరణి బయటి మార్కెట్లో ఎకరాకు 20 లక్షల రూపాయలకు ఎక్కడ తక్కువ లేదని గోలేటిలో మార్కెట్ విలువ మినిమం 20 లక్షల వరకు ఉందని దానికి సింగరేణి మూడు రేట్లు చెల్లించాల్సి ఉన్నప్పటికీ తక్కువ ఉన్న భూమి విలువ చూపించి రేటు కట్టి మేము రెండు రేట్లు అధికంగా ఇస్తున్నామని రైతులను మోసం చేస్తుందన్నారు సింగరేణి యాజమాన్యం కొంతమంది బ్రోకర్లను నియమించుకొని కాస్తు. పట్టాదారు. అటవీ భూమి పేరుతో. దళిత. గిరిజన. బిసి వర్గాలు భూమి సాగు చేస్తున్నా రైతులను భయభ్రాంతులకు గురి చేస్తుందని రైతుల మధ్య గొడవలు సృష్టిస్తున్నారని. రెవెన్యూ అధికారులకు సంబంధాలు లేకుండానే సింగరేణి తన బ్రోకర్ల ద్వారా నోటీసులను అందజేసి బలవంతంగా సంతకాలు పెట్టిస్తున్నారని ఇది చట్టా ఉల్లంఘన కాదా అని అన్నారు. రైతుల నుండి తక్కువ రేటుకు భూమిని కాజెయడానికి సింగరేణి ప్రయత్నిస్తుందని మార్కెట్ విలువతో పాటు ఎకరానికి 25 లక్షల నష్టపరిహారం ఇచ్చి కుటుంబంలో ఒకరికి సింగరేణి ఉద్యోగం ఇవ్వాలని అన్నారు. జిల్లా కలెక్టర్. ఆర్డీవో చొరవ తీసుకొని రైతు కుటుంబాలకు న్యాయం చేయాలని విజ్ఞప్తి చేస్తున్నాము. లేనిపక్షంలో రైతులకు న్యాయం జరిగే వరకూ రైతుల పక్షాన బిజెపి న్యాయ పోరాటం చేస్తుందని అన్నారు ఈ కార్యక్రమంలో అసెంబ్లీ కన్వీనర్ సొల్లు లక్ష్మి. మండల ప్రధాన కార్యదర్శి చేపూరి నవీన్ గౌడ్ సిడం ధర్మ పటేల్. సీడం జైతూ. నారా నాగమ్మ తదితరులు పాల్గొన్నారు.

## అండర్ డ్రైనేజీ నిర్మాణంలో నాణ్యత లోపం

### తాడూరి శిరీష పరమేష్ 12వ వార్డ్ మాజీ కౌన్సిలర్



చౌటుప్పల్ ఏప్రిల్ 7 (శుభోదయం న్యూస్): చౌటుప్పల్ మున్సిపల్ పరిధిలో అండర్ డ్రైనేజీ నిర్మాణాలు పనుల్లో భాగంగా చేపట్టిన అండర్ డ్రైనేజ్ లోకి వెళ్లిన వాటర్ ట్యాంకర్ చౌటుప్పల్ పట్టణ ప్రజలకు ఈ అండర్ డ్రైనేజీ ఎవరికి కూడా పెద్దగా ఉపయోగం లేని విధంగా,ఇష్టానుసారంగా వేస్తున్నారు అందులో కూడా నాణ్యత లోపం ఉంది దాదాపుగా ఇలాంటి సంఘటనలు రెండు మూడు జరిగాయి చౌటుప్పల్ మున్సిపల్ పరిధిలో ఏ అధికారి గానీ నాయకుడు గానీ పట్టించుకోవడం లేదు పూర్తిగా నాణ్యత లోపంతో ఉంది అని తాడూరి శిరీష పరమేష్ అన్నారు.

## భారత రాష్ట్ర సమితి బెల్లంపల్లి నియోజకవర్గ స్థాయి ముఖ్య కార్యకర్తల సమావేశం



ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా దార రాజేశం (శుభోదయం న్యూస్) ఏప్రిల్ 7: ఈరోజు బెల్లంపల్లి పట్టణం లో టిఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో మాజీ ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య ఆధ్వర్యంలో భారత రాష్ట్ర సమితి పార్టీ నియోజకవర్గ ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించడం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా మంచిర్యాల జిల్లా అధ్యక్షులు బాల్క సుమన్ హాజరవడం జరిగింది. ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అమలు కాని హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చింది అన్నారు ఇచ్చిన హామీలను అమలు పరచకుండా ప్రజలను కాంగ్రెస్ ప్రభుత్వం మోసం చేస్తుందన్నారు, అనంతరం రాబోవు లోకల్ బాడీ ఎన్నికలలో బి ఆర్ఎస్ పార్టీకి సంబంధించినటువంటి వ్యక్తి లను గెలిపించుకోవాలని ప్రజలలో కాంగ్రెస్ ప్రభుత్వం చేసినటువంటి మోసాలను ప్రజలు గమనిస్తున్నారని విఆర్ఎస్ ప్రభుత్వం ఉన్నప్పటి పథకాలు ఇంతవరకు ఈ కాంగ్రెస్ ప్రభుత్వం మార్చుతాను అన్నటువంటి హామీలు నెరవేర్చనందున ఆయన కాంగ్రెస్ ప్రభుత్వం పై మండిపడ్డారు అలాగేప్రజా సమస్యలపై ప్రభుత్వంతో పోరాటానికి పార్టీ శ్రేణులు సిద్ధంగా ఉండాలని కోరారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ స్థాయి నాయకులు కార్యకర్తలు అందరూ పాల్గొన్నారు.

## జై భీమ్, జై సంవిధాన్ జై అభియాన్ కార్యక్రమంలో పాల్గొన్న..... కూడా చైర్మన్ ఈనగాల వెంకట్రాంరెడ్డి




(శుభోదయం న్యూస్ ), స్టేట్ బ్యూరో కే రామారావు: జమ్మికుంట పట్టణంలో జై భీమ్, జై సంవిధాన్ జై అభియాన్ కార్యక్రమంలో పాల్గొన్నారు. హుజూరాబాద్ నియోజకవర్గం జమ్మికుంట పట్టణంలోని 17, 18, 19, 20వ వార్డులల్లో పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు శంకర రమేష్ ఆధ్వర్యంలో జై బాపు జై భీమ్ జై సంవిధాన్ రాజ్యాంగ పరిరక్షణ పాదయాత్ర లో ముఖ్య అతిధిగా పాల్గొని వార్డులలో పాదయాత్ర చేశారు. కార్యక్రమంలో కరీంనగర్ కార్పొరేటర్ అశోక్ రావు గారు, జమ్మికుంట మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ ఎర్రం సతీష్ రెడ్డి, మాజీ దేవస్థాన చైర్మన్ దేశిని కోటి, మాజీ కౌన్సిలర్స్ పొనగంటి మల్లయ్య, మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు పూదరి రేణుక, వార్డు అధ్యక్షులు,సీనియర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితర అనుబంధ సంఘాలు పాల్ జై సంవిధాన్ జై అభియాన్ కార్యక్రమంలో పాల్గొన్నారు. హుజూరాబాద్ మండలం కాట్రపల్లి గ్రామంలో జై బాపు, జై భీమ్, జై సంవిధాన్ అభియాన్ కార్యక్రమంలో పాల్గొని ప్రతి ఒక్క పౌరుడు భారత రాజ్యాంగాన్ని కాపాడి సత్యం అహింస భావాలను పాటిస్తూ మహాత్మా గాంధీ మరియు అంబేద్కర్ గారి ఆలోచన విధానాన్ని అనుసరించి సమ సమాజ నిర్మాణం కోసం పాటుపడాలని

## కేంద్రం షాక్.. పెట్రోల్, డీజిల్‌పై ఎక్సైజ్ డ్యూటీ పెంపు




వాహనదారులకు కేంద్ర ప్రభుత్వం షాకిచ్చింది. చాలా రోజులుగా నిలకడగా ఉన్న పెట్రోల్ ధరలను మళ్లీ పెంచింది. పెట్రోల్, డీజిల్‌పై ఎక్సైజ్ డ్యూటీని 2 రూపాయలు పెంచింది. ఈ పెంపు దేశవ్యాప్తంగా అమలులోకి రానుంది. వాహనదారులకు కేంద్ర ప్రభుత్వం షాకిచ్చింది. చాలా రోజులుగా నిలకడగా ఉన్న పెట్రోల్ ధరలను మళ్లీ పెంచింది. పెట్రోల్, డీజిల్‌పై ఎక్సైజ్ డ్యూటీని 2 రూపాయలు పెంచింది. ఈ పెంపు దేశవ్యాప్తంగా అమలులోకి రానుంది.ప్రస్తుతం హైదరాబాద్‌లో లీటర్ పెట్రోల్ ధర రూ.10.7.66, డీజిల్ ధర రూ.95.82గా ఉంది. ఎక్సైజ్ డ్యూటీ పెరగడంతో లీటర్ పెట్రోల్ ధర రూ.109.66, డీజిల్ ధర రూ.97.82కు చేరనుంది. ఇక విజయవాడలో లీటర్ పెట్రోల్ ధర రూ.109.76, డీజిల్ ధర రూ.97.51గా ఉంది. పెరిగిన ఎక్సైజ్ డ్యూటీతో పెట్రోల్ ధర రూ.111.76, డీజిల్ ధర రూ.99.51 కానుంది.మరోవైపు అమెరికా -చైనా ట్రేడ్ వార్, ఆర్థిక మాంద్యం భయాలు, ఒపెక్ ప్లస్ ఉత్పత్తి పెంపు వంటి అంతర్జాతీయ ఆర్థిక భయాల నేపథ్యంలో కొంతకాలంగా క్రూడాయిల్ ధరలు భారీగా పతనం అవుతున్నాయి. వారం వ్యవధిలోనే సుమారు 10 డాలర్ల వరకు తగ్గి.. ఇప్పుడు మూడేళ్ల కనిష్ట సాయికి చేరింది. అయినప్పటికీ దేశీయంగా పెట్రోల్, డీజిల్ ధరల్లో ఎలాంటి తగ్గింపు జరగలేదు. అంతర్జాతీయంగా ముడి చమురు ధరల తగ్గింపు నేపథ్యంలో ఇప్పటికైనా పెట్రోల్ ధరలు తగ్గుతాయేమోనని ఎదురుచూస్తున్న సామాన్యులపై కేంద్ర ప్రభుత్వం ఎక్సైజ్ డ్యూటీ పెంపు పేరుతో షాకిచ్చింది. పెట్రోల్, డీజిల్‌పై రూ.2ను పెంచింది.

## టీ20ల్లో కోహ్లి సంచలనం.. తొలి భారత క్రికెటర్‌గా రికార్డు

భారత స్టార్ ఆటగాడు విరాట్ కోహ్లీ టీ20ల్లో సంచలనం సృష్టించాడు. వరల్డ్ క్లాస్ బ్యాటర్ అయిన విరాట్ ఈ ఫార్మాట్‌లో అత్యంత వేగంగా 13 వేల పరుగుల క్లబ్‌లో చేరాడు.: భారత స్టార్ ఆటగాడు విరాట్ కోహ్లీ () టీ20ల్లో సంచలనం సృష్టించాడు. వరల్డ్ క్లాస్ బ్యాటర్ అయిన విరాట్ ఈ ఫార్మాట్‌లో అత్యంత వేగంగా 13 వేల పరుగుల క్లబ్‌లో చేరాడు. ఈ విధ్వంసక బ్యాటర్ 386 ఇన్నింగ్స్‌ల్లోనే 13 వేల క్లబ్‌లో చేరాడు. ఈ మైలురాయికి చేరుకున్న తొలి భారత ఆటగాడిగా రికార్డు నెలకొల్పాడీ మాజీ సారథి. ఐపీఎల్ 18వ సీజన్‌లో రెచ్చిపోయి ఆడుతున్న ఈ ఆర్సీబీ ఓపెనర్ ముంబై ఇండియన్స్‌పై అర్ధ శతకం బాది ఈ ఫీట్ సాధించాడు.పొట్టి క్రికెట్‌లో తక్కువ ఇన్నింగ్స్‌ల్లోనే 13 వేల పరుగులు పూర్తి చేసుకున్న ఆటగాళ్లు వెస్టిండీస్ లెజెండ్ క్రిస్ గేల్( ఈ జాబితాలో అగ్రస్థానంలో కొనసాగుతున్నాడు. యూనివర్సల్ బాస్ అయిన గేల్ కేవలం 381 ఇన్నింగ్స్‌ల్లోనే టీ20ల్లో 13, 000 రన్స్ బాదేశాడు.

## ఈ నెల 8 నుంచి నాంపల్లిలో పుస్తక ప్రదర్శన.. ఒక్కో బుక్‌పై 60 శాతం డిస్కౌంట్!

సురవరం ప్రతాపరెడ్డి తెలుగు విశ్వవిద్యాలయం ప్రచురణల విభాగం ప్రచురించిన గ్రంథాలను ప్రత్యేక రాయితీతో విక్రయించడానికి పుస్తక ప్రదర్శనను నిర్వహించనున్నట్లు రిజిస్ట్రార్ ఆచార్య కోట్ల హనుమంతరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. తెలుగు యూనివర్సిటీ, ఏప్రిల్ 7: సురవరం ప్రతాపరెడ్డి తెలుగు విశ్వవిద్యాలయం ప్రచురణల విభాగం ప్రచురించిన గ్రంథాలను ప్రత్యేక రాయితీతో విక్రయించడానికి పుస్తక ప్రదర్శనను నిర్వహించనున్నట్లు రిజిస్ట్రార్ ఆచార్య కోట్ల హనుమంతరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఏప్రిల్ 8వ తేదీ నుంచి 17వ తేదీ వరకు నాంపల్లి ప్రాంగణంలో గల పుస్తక విక్రయ కేంద్రంలో ఈ పుస్తక ప్రదర్శన నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ప్రతిరోజు ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఇది తెరిచి ఉంటుందని వెల్లడించారు.ఈ పుస్తక ప్రదర్శలో ప్రతి పుస్తకంపై 60 శాతం వరకు రాయితీ ఇవ్వనున్నట్లు రిజిస్ట్రార్ ఆచార్య కోట్ల హనుమంతరావు తెలిపారు. ప్రాచీన గ్రంథాలు, సాహిత్యం, నిఘంటువులు, సంగీత, నృత్య గ్రంథాలు, భారత, భాగవతాలు, ప్రబంధాలు, పురాణాలు, పంచకావ్యాలు, ఇతిహాసాలు, చరిత్ర గ్రంథాలు, పోటీ పరీక్షల పుస్తకాలు తగ్గింపు ధరలలో విక్రయానికి సిద్ధంగా ఉంటాయని, సాహితీవేత్తలు, పరిశోధకులు, విద్యార్థులు, భాషా ప్రియులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని ఆయన కోరారు.

శుభోదయం


## సంపాదకీయం

# శాంతి వైపు మావోయిస్టుల చూపు

## (విశ్లేషణ)

ఆపరేషన్ కగార్ పేరుతో దండకారణ్యంలో కొనసాగుతున్న తీవ్ర నిర్బంధం నేపథ్యంలో శాంతి చర్చలకు తాము సిద్ధమేనని భారత కమ్యూనిస్ట్ పార్టీ (మావోయిస్ట్) ప్రకటించింది. గతంలో కూడా దివంగత వైఎస్ రాజశేఖర రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు నక్సల్స్‌ను శాంతి చర్చలకు ఆహ్వానించడం ముఖాముఖి చర్చలు జరగడం తెలిసిందే. కానీ అవి చివరకు ఫలించలేదు. ఇప్పుడు మావోయిస్టుల్లో కూడా ఎన్నడూ లేని విధంగా నిస్పృహ ఆవరించినట్టు చత్తీస్‌గఢ్‌లోని బీజాపూర్‌లో ఇటీవల ఎన్‌కౌంటర్‌లో బయటపడిన ఒక లేఖ బట్టి తెలుస్తోంది. నక్సలైట్లకు సురక్షిత ప్రాంతమంటూ లేకుండా పోయిందని ఆ లేఖ వెల్లడించింది. అయితే ఇప్పుడు శాంతి చర్చలు జరిపేందుకు అనువైన వాతావరణం తీసుకురావాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు) డిమాండ్ చేసింది. ఆ పార్టీ కేంద్ర కమిటీ అధికార ప్రతినిధి అభయ్ పేరుతో తాజాగా విడుదల చేసిన లేఖ బుధవారం వెలుగులోకి వచ్చింది. అయితే మావోలు కొన్ని షరతులు విధించారు. చత్తీస్‌గఢ్, మహారాష్ట్ర (గడ్చిరోలి), ఒడిశా, జార?ండ్, మధ్యప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో ఆపరేషన్ కగార్‌ను ఆపేయాలని డిమాండ్ చేశారు. విప్లవ ప్రభావిత ప్రాంతాల్లో సాయుధ బలగాలతో కొత్త క్యాంపులు ఏర్పాటు చేయొద్దన్నారు. ఈ షరతులకు ఒప్పుకుంటే తక్షణమే కాల్పుల విరమణకు సిద్ధమని ప్రకటించారు. ఆపరేషన్ కగార్ పేరుతో సాధారణ ఆదివాసీ ప్రజానీకంతోపాటు అగ్రనేతల వరకు **400** మందికి పైగా ప్రాణాలు కోల్పోయారని, అనేక మందిని చిత్రహింసలకు గురిచేసి చంపేస్తున్నారని, అందుకే ఈ యుద్ధాన్ని జినోసైడ్ (నరసంహారం)గా పేర్కొంటున్నట్టు వెల్లడించింది. ఈ లేఖకు చత్తీస్‌గఢ్ సిఎం విజయశర్మ స్పందించారు. మొదట ఈ లేఖ సాధికారత ఎంతవరకు ఉందో పరిశీలిస్తామని పేర్కొన్నారు. గతంలో కూడా కొన్ని సందర్భాల్లో శాంతి చర్చలకు మావోయిస్టులు పిలుపునిచ్చారన్నారు. అయితే ఇప్పుడు శాంతి చర్చలకు మావోయిస్టులు విధించిన డిమాండ్లను పరిగణనలోకి తీసుకునేది లేదన్నారు. గతంలో ప్రభుత్వం శాంతిచర్చల కోసం కమిటీలను ఏర్పాటు చేసిందని, ఇప్పుడు మావోయిస్టులే శాంతి చర్చలకు సిద్ధం అవుతుంటే వారు ఒక కమిటీ లేదా ఒక ప్రతినిధిని నియమించాలని ముఖ్యమంత్రి విజయశర్మ సూచించారు. **2026** మార్చి **31** లోగా చత్తీస్‌గఢ్‌లో నక్సలైట్లు అన్నవారెవరూ లేకుండా నిర్మూలిస్తామని కేంద్ర హెూం మంత్రి అమిత్ షా ఇటీవల ప్రకటించిన సంగతి తెలిసిందే. ఈ మేరకు భద్రతా దళాలు నిత్యం దండకారణ్యాన్ని జల్లెడపడుతున్నాయి. ప్రభుత్వం ఒకవైపు నక్సల్ ప్రభావిత ప్రాంతాల్లో అభివృద్ధి కార్యక్రమాలకు ప్రాధాన్యం కల్పిస్తూ మరోవైపు నక్సల్ గాలింపు ముమ్మరం చేసింది. ఈ ద్విముఖ వ్యూహం బాగానే పని చేసిందని చెప్పవచ్చు. ఇదంతా ఒక్క రోజులోనే జరిగిందనడం పొరపాటు. నిఘా వర్గాలను బలోపేతం చేశారు. భద్రతా దళాల సాయంతో మావోల పట్టున్న ప్రాంతాలను నిర్వీర్యం చేయగలిగారు. అత్యాధునిక డ్రోన్లు, నిఘా పరికరాలు, కృత్రిమ మేథ, ఉపగ్రహ ఛాయాచిత్రాల వంటి సాయంతో నక్సల్ కార్యకలాపాలకు అడ్డుకట్ట వేయగలుగుతున్నారు. అలాగే నక్సల్స్ ఆర్థిక మూలాలపై కూడా దాడులు జరుగుతున్నాయి. ఎన్ఐఎ, ఇడి వంటి కేంద్ర సంస్థలు కొన్ని కోట్ల రూపాయల నిధులను స్వాధీనం చేసుకుంటున్నాయి.నక్సల్స్‌కు ఆర్థిక సాయం అందిస్తున్న వారిని కూడా కట్టడి చేయగలిగారు. ఇవన్నీ ఒకవైపు సాగిస్తూనే నక్సల్ ప్రాంతాల్లో మౌలిక సౌకర్యాలు బాగా విస్తరించేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. **2014** నుంచి **2024** మధ్య కాలంలో ఆయా ప్రాంతాల్లో దాదాపు **11,503** కిలోమీటర్ల జాతీయ రహదారులు, **20** వేల కిలోమీటర్ల గ్రామీణ రహదారులు ఏర్పాటయ్యాయి. దీనివల్ల అక్కడి ప్రజల జీవన విధానాల్లో, ఆర్థిక పరిస్థితుల్లో చాలా మార్పులు వచ్చాయి. వెయ్యికి పైగా బ్యాంకు శాఖలు, **937** ఎటిఎంల ఏర్పాటుతో ఆయా ప్రాంతాల్లో ఆర్థిక కార్యకలాపాలు ముమ్మరం అయ్యాయి. **20042014** మధ్యకాలంతో పోలిస్తే ఇప్పుడు హింసాత్మక సంఘటనలు సగానికి సగం తగ్గాయి. ఏడాది కాలంలోనే చత్తీస్‌గఢ్ ప్రాంతంలో **380** మంది నక్సల్స్ ప్రాణాలు కోల్పోయారు. **1194** మంది అరెస్టు కాగా, **1045** మంది లొంగిపోయారు. వాస్తవంగా చెప్పాలంటే నక్సలిజ ప్రభావం చాలా వరకు తగ్గిందనే చెప్పవచ్చు. ఒకప్పుడు మావోయిజానికి ఆదివాసీ యువకులు విపరీతంగా ఆకర్షితులయ్యేవారు. కానీ అప్పటి పరిస్థితులు ఇప్పుడు లేవు. భూస్వాములకు వ్యతిరేకంగా వర్గపోరాటం సాగించడమే లక్షంగా నక్సల్స్ సాగుతున్నప్పటికీ చత్తీస్‌గఢ్‌లో ధనిక రైతులే తప్ప భూస్వాములు ఎవరూ లేరు. ఇప్పుడు అటవీ భూముల్లోని ఖనిజాల కోసం ఆరాటం పడుతున్న కార్పొరేట్ సంస్థల పైనే ఆదివాసీలు వర్గ పోరాటం చేయాలి. లేదా కార్పొరేట్ సంస్థలకు కొమ్ముకాస్తున్న ప్రభుత్వ యంత్రాంగంపై పోరాటం చేయాలి. కానీ ఆర్థిక బలోపేతమే ముఖ్యమనుకుంటున్న ప్రజల ఆలోచనలు ఈ పోరాటాలకు కలిసిరావడం లేదు. ప్రభుత్వ పథకాలపైనే దృష్టి పెడుతున్నారు. ఎన్నికల్లో పాల్గొంటున్నారు. ఇటీవల అసెంబ్లీ ఎన్నికల్లో బిజెపి అభ్యర్థులు గెలవడం దీనికి ఉదాహరణ. అలాగే నక్సల్స్ పేరుతో దొరికినవారందరినీ పిట్టల్లా కాల్చి చంపినంత మాత్రాన విప్లవ ఉద్యమాలు ఆగిపోవు, అన్యాయాలు, అక్రమాలు ఎక్కడ జరిగినా ఎదిరించడానికి పోరాటాలు సాగుతూనే ఉంటాయి. బాధితులు, ధీనులు, అణగారిన ప్రజలు తమ తరపున పోరాడే వారికి ఆశ్రయం కల్పిస్తూనే ఉంటారు. విప్లవ భావజాలంతో మళ్లీ మళ్లీ చైతన్యవంతులవుతూనే ఉంటారు. ఇవన్నీ క్షేత్రస్థాయిలో ప్రభుత్వం పరిశీలిస్తేనే శాంతికి మార్గం ఏర్పడుతుంది.

# వక్ఫ్ చట్టం : బిహార్ ఎన్నికల వేళ బీజేపీ ఎందుకు సాహసించింది, జేడీయూ ఎలా అంగీకరించింది?



ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రపంచ వ్యవహారాలపై ఎక్కువ శ్రద్ధ చూపుతున్నారని సీనియర్ జర్నలిస్ట్ నీర్జా చౌదరి అభిప్రాయపడ్డారు. రాష్ట్రపతి ఆమోదం తర్వాత వక్ఫ్ సవరణ బిల్లు ఇప్పుడు చట్టంగా మారింది. ఈ చట్టం ద్వారా పారదర్శకతను నిర్ధరిస్తామని, వక్ఫ్ ఆస్తుల దోపిడీని నిలిపివేస్తామని, జవాబుదారీతనం వస్తుందని కేంద్ర ప్రభుత్వం పేర్కొంది. అయితే, ప్రభుత్వం ఇలా ఒకే మతంలో సంస్కరణలను తీసుకురావడానికి ఎందుకు నిశ్చయించుకుందని ప్రతిపక్ష పార్టీలు, అనేక ముస్లిం సంస్థలు ప్రశ్నించాయి. దీనిని మైనారిటీ హక్కులలో జోక్యం చేసుకోవడంగా చూశాయి. ఇంతకీ, ఈ సవరణ నిజంగా సంస్కరణ చర్యనా లేదా ముస్లింలను లక్ష్యంగా చేసుకోవడమా?, ఈ బిల్లు అవినీతిని అంతం చేస్తుందా లేదా మతపరమైన చర్చను తీవ్రతరం చేస్తుందా?. 2013లో 123 వీఐపీ ఆస్తులు వక్ఫ్‌కు అప్పగించినట్లు ఆరోపణలున్నాయి. ఇంతకీ ఈ కేసు ఏమిటి? వక్ఫ్ సవరణ బిల్లు ఆమోదం బిహార్ రాజకీయాలపై ఎలాంటి ప్రభావం చూపుతుంది? యూపీఏ ప్రభుత్వంలో మైనారిటీ వ్యవహారాలు, చట్టం, న్యాయశాఖ మంత్రిగా పనిచేసిన సల్మాన్ ఖుర్షీద్‌తో పాటు జనతాదళ్ యునైటెడ్(జేడీయూ) నాయకుడు రాజీవ్ రంజన్, రాజ్యాంగ నిపుణులు సంజయ్ హెగ్డే, సీనియర్ జర్నలిస్ట్ నీర్జా చౌదరి ఈ అంశాలపై చర్చలో పాల్గొన్నారు.

ఇఫ్తార్ విందులో బిహార్ ముఖ్యమంత్రి నితీష్ కుమార్

బిహార్ రాజకీయాలపై ప్రభావం?

ఈ ఏడాది చివర్లో బిహార్‌లో ఎన్నికలు జరగనున్నాయి. ఈ బిల్లు ఆ బిహార్ రాజకీయాలలో కీలకంగా మారనుంది. బిహార్‌లోని అనేక నియోజకవర్గాల్లో ముస్లింలు అధికంగా ఉన్నారు. అందుకే ఏ పార్టీ అయినా, అక్కడ ఇఫ్తార్ విందులు నిర్వహిస్తుంది. “బిహార్ ఎన్నికలు ముగిసే వరకు బీజేపీ ఎందుకు ఆగలేదో నాకర్థం కాలేదు” అని నీర్జా చౌదరి అంటున్నారు. అయితే “నితీష్ కుమార్‌కు కుర్మి, కోయెరి, మహాదళిత్, పస్మాంద ముస్లిం వంటి కొన్ని వర్గాలపై ఇంకా పట్టు ఉంది” అని నీర్జా చౌదరి అన్నారు.

జేడీయూ ఎందుకు మద్దతు ఇచ్చింది?

“ఈ బిల్లు గురించి చాలా అపోహలున్నాయి. ప్రతిపక్ష పార్టీలు తప్పుడు ప్రచారం చేశాయి. ఇది చట్టంగా అమల్లోకి వచ్చినప్పుడు, అనేక రకాల అపోహలు వాటికవే పరిష్కారమవుతాయి. నితీశ్ ఈ బిల్లుకు మద్దతు ఇచ్చారంటే, అది ముస్లింలకు వ్యతిరేకంగా ఉండదని హామీ ఇచ్చినట్లే” అని జేడీయూ నేత రాజీవ్ రంజన్ అన్నారు. మతం కోణంలో బిల్లును చూడరాదని, రాష్ట్రంలోని హిందువుల కోసం బిహార్ మత బోర్డు కూడా ఏర్పడినట్లు ఆయన గుర్తుచేశారు. “తమ భుజాలపై ఎక్కి హక్కులను లాక్కున్నారనే ఆగ్రహం బిహార్‌లోని పేదలు, పస్మాంద ముస్లింలలో చాలా కాలంగా ఉంది” అని రాజీవ్ రంజన్ అన్నారు. ఓట్ల కోణంలో నితీశ్ ఎప్పుడూ నిర్ణయాలు తీసుకోలేదని, ఈ బిల్లు ముస్లింలకు వ్యతిరేకంగా ఉంటే, మా పార్టీ అస్సలు మద్దతు ఇచ్చేది కాదని రాజీవ్ అన్నారు. ఈ ఏడాది చివర్లో బిహార్‌లో అసెంబ్లీ ఎన్నికలు జరిగే అవకాశముంది, ప్రస్తుతం రాష్ట్రంలో ఎన్డీఏ ప్రభుత్వం ఉంది.

మిత్రపక్షాలను బీజేపీ ఎలా ఒప్పించింది?

వక్ఫ్ అంశంపై బీజేపీ ప్రభుత్వానికి మిత్రపక్షాలు అండగా నిలిచాయి. కూటమిలో వ్యతిరేకంగా ఎటువంటి స్వరం వినిపించలేదు. “ఈ బిల్లుపై బీజేపీ తన మిత్ర పక్షాల మద్దతును తీసుకున్న తీరు, దాని రాజకీయ చతురతకు నిదర్శనం” అని నీర్జా చౌదరి అన్నారు. మిత్రపక్షాలు మద్దతు ఇవ్వకపోతే, బిల్లును ఆమోదించడం కష్టమయ్యేదని నీర్జా అభిప్రాయపడ్డారు. జేపీసీలోని మిత్రపక్షాలు కొన్ని మార్పులను సూచించాయని, వాటిని ఆమోదించారని తెలిపారు. “ఆంధ్రప్రదేశ్‌లోని ముస్లింలు చంద్రబాబుకు వ్యతిరేకంగా మారితే, వచ్చే ఎన్నికల్లో ఆయనకు కష్టమవుతుంది. కానీ, చంద్రబాబు ప్రత్యర్థి అయిన వైసీపీ అధ్యక్షుడు జగన్‌మోహన్ రెడ్డి ఆయనకు వ్యతిరేకంగా పెద్దగా గొంతు వినిపించే స్థితిలో లేరు. జగన్‌పై చాలా కేసులున్నాయి, ఇది ఆయన స్థానాన్ని బలహీనపరిచింది” అని ఆమె అన్నారు. ఆర్టికల్ 370, వక్ఫ్ బోర్డు అంశాలపై అమిత్ షా ఎక్కువగా మాట్లాడారని, ప్రధాని మోదీ ప్రపంచ సమస్యలపై ఎక్కువ శ్రద్ధ చూపుతున్నట్లు కనిపిస్తోందని నీర్జా చెప్పారు.

ఎలా అమలుచేస్తారనే దానిపైనే..

గత ఏడాది ఆగస్టులో వక్ఫ్ (సవరణ) బిల్లు, 2024ను లోక్‌సభలో ప్రవేశపెడుతూ కేంద్ర మైనారిటీ వ్యవహారాల మంత్రి కిరెన్ రిజిజు దాని గురించి వివరించారు. “ఈ బిల్లు ఎవరి మత స్వేచ్ఛకు భంగం కలిగించదు. ఎవరి హక్కులను హరించడానికి కాదు. వక్ఫ్‌కు సంబంధించిన విషయాలలో హక్కులు పొందలేని వారికి వాటిని కల్పించడానికి తీసుకొచ్చా” అని రిజిజు అన్నారు. యూపీఏ ప్రభుత్వంలో మైనారిటీ వ్యవహారాలు, చట్టం, న్యాయశాఖ మంత్రిగా పనిచేసిన సల్మాన్ ఖుర్షీద్ ఈ బిల్లులో మూడు ప్రధాన అభ్యంతరాలున్నాయన్నారు.

“ఇది ఎలా అమలు చేస్తారనే దానిపైనే విషయం ఆధారపడి ఉంటుంది. ఈ సవరణ ఎంత స్పష్టంగా ఉందో చెప్పలేను. వక్ఫ్ బై యూజర్ గురించి ఒక ప్రశ్న ఉంది. దీనిని గతంలోనే రద్దు చేశారు కానీ, ఇప్పుడు భవిష్యత్తు కోసం రద్దు చేసినట్లు చెప్పారు. మునుపటి ఆస్తులపై ఎటువంటి ప్రభావం ఉండదు, ఇది ఉపశమనం కలిగించేది” అని అన్నారు.

వక్ఫ్ బిల్లు సవరణకు వ్యతిరేకంగా జరిగిన నిరసన కార్యక్రమంలో మాజీ న్యాయ మంత్రి సల్మాన్ ఖుర్షీద్

“పాత ఆస్తులన్నీ వక్ఫ్ బై యూజర్‌గా ఉన్నాయి కానీ, వాటి డీడ్‌లు లేవు, పూర్తి రికార్డులు లేవు. దానిని వక్ఫ్ బై యూజర్‌గా పరిగణించకపోతే సమస్య ఏర్పడవచ్చు” అని ఖుర్షీద్ అన్నారు. రెండవ సమస్య పరిమితి చట్టమని దీనిని గతంలో తొలగించారని కానీ, ఇప్పుడు మళ్లీ అమలు చేశారని ఆయన అన్నారు. ఇవి రెండు పెద్ద సమస్యలనీ, కానీ దీనితో పాటు వక్ఫ్‌లో అక్రమాలను తొలగిస్తామని చెబుతున్నారు, అందుకోసం రూపొందించిన నిబంధనలేంటో చెప్పాలని ఆయన ప్రశ్నించారు. పార్లమెంటులో జరిగిన చర్చలో అమిత్ షా మాట్లాడుతూ.. బోర్డు మతపరమైన విషయాల్లో జోక్యం చేసుకోదని, ముస్లిమేతరులను అడ్మినిస్ట్రేషన్ విధుల్లో ఉంటారని అన్నారు. “అన్ని మతాల ప్రజలు ఒకరికొకరు సహాయం చేసుకుని, సహకరించుకుంటే మంచిదే. కానీ మిగతా చోట్ల అలా లేదు.” అని సల్మాన్ ఖుర్షీద్ అన్నారు.

123 ఆస్తులను వక్ఫ్‌కు ఎందుకు ఇచ్చారు?

దిల్లీలో రాజధాని నిర్మిస్తున్నప్పుడు, దానికి అవసరమైన భూమిని సేకరించే సమయంలో మతపరమైన అనేక ప్రదేశాలను కూడా స్వాధీనం చేసుకున్నారని ఖుర్షీద్ గుర్తుచేశారు. వీటిని పొరపాటున స్వాధీనం చేసుకున్నారని బెర్నీ కమిటీ గుర్తించింది. “ఈరోజు కూడా లుటియెన్స్ జోన్‌లోని భవనాల మధ్య అనేక సమాధులు, దర్గాలను చూడొచ్చు. వాటిపై ఎటువంటి వివాదాలు ఉండకూడదని చెప్పారు” అని ఆయన అన్నారు.“ఇదికాకుండా 123 ఆస్తుల విషయంలో అసలు యజమానులు అక్కడ లేనందున, వాటిని వక్ఫ్ బోర్డుకు అప్పగించారు” అని ఖుర్షీద్ అన్నారు

రాజ్యాంగ నిపుణులు సంజయ్ హెగ్డే

ఈ బిల్లు ‘అవినీతి’ని ఆపుతుందా?

“నియంత్రణ ఎక్కువగా కలెక్టర్ చేతుల్లోనే ఉంటుంది. భూమి వక్ఫ్‌కు చెందుతుందా లేదా ప్రభుత్వానికి చెందుతుందా అనేది కలెక్టర్ నిర్ణయించవచ్చు. న్యాయమూర్తి, వాది ఇద్దరూ ఒకటే అయితే, న్యాయం ఎలా జరుగుతుంది?” అని రాజ్యాంగ నిపుణులు సంజయ్ హెగ్డే అన్నారు. వక్ఫ్ నిర్వహణను మెరుగుపరచాల్సిన అవసరం ఉంది కానీ, బోర్డులో ఎవరు కూర్చుంటారు అనేది ప్రశ్న అని ఆయన అన్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రపంచ వ్యవహారాలపై ఎక్కువ శ్రద్ధ చూపుతున్నారని సీనియర్ జర్నలిస్ట్ నీర్జా చౌదరి అభిప్రాయపడ్డారు. నరేంద్ర మోదీ

# వరల్డ్ రికార్డ్ సృష్టించిన ఎలుక.. దేశ ప్రజల ప్రాణాలను కాపాడిన హీరో

ఓ మూషికం సరికొత్త రికార్డ్‌లను సృష్టించింది. బాంబుల నుంచి ఓ దేశాన్ని కాపాడడంలో పాత రికార్డ్‌లన్నీ తిరగ రాసింది. దీంతో ప్రపంచంలోనే అత్యధికంగా బాంబులు గుర్తించిన ఎలుకల జాబితాలో తొలి స్థానాన్ని కైవసం చేసుకుంది.

గిన్నీస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్ కెక్కింది.

కాంబోడియా దేశానికి చెందిన భూముల్లో ఉన్న బాంబులను గుర్తించడమే ఎలుక రోనిన్ పని. తాజాగా రోనిన్ బాంబుల వేటలో ప్రపంచంలోనే తొలిసారి వందకు పైగా ల్యాండ్‌మైన్లు, ఇతర యుద్ధ అవశేషాలను గుర్తించిన ఎలుకగా కొత్త ప్రపంచ రికార్డును నెలకొల్పింది. అఫ్రికన్ జెయింట్ పౌచ్‌డ్ రాట్ రోనిన్ 2021 నుండి ఇప్పటివరకు భూమిలో దాచిన 109 బాంబులు, 15 పేలని బాంబులను గుర్తించినట్లు జంతువులకు శిక్షణ ఇచ్చే ఏపోపో అనే స్వచ్ఛంద సంస్థ తెలిపింది. తద్వారా రోనిన్ ఇప్పుడు ఎలుకలలో అత్యధిక మైన్లు గుర్తించిన రికార్డును సొంతం చేసుకుందని గిన్నీస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్ ఒక అధికారిక ప్రకటనలో పేర్కొంది. ఈ సందర్భంగా, కాంబోడియా ప్రజల ప్రాణాల్ని కాపాడడంలో రొనిన్ బాధ్యతలు అత్యద్భుతమని కొనియాడింది. ఎలుక రోనిన్ గురించి పలు ఆసక్తిర విషయాలు వెలుగులోకి వచ్చాయి. ఐదేళ్ల వయస్సున్న రోనిన్ మంచి పనిమంతుడు. అందరితో స్నేహంగా ఉండటమే కాదు..శాంతంగా ఉంటాడట. రోనిన్ విజయానికి కారణం ఏకాగ్రత, ఒత్తిడిలో ఎలాంటి



ఆందోళన చెందకుండా ఎదురవుతున్న సమస్యల్ని పరిష్కరించడంలో సిద్ధహస్తుడు. అంతేకాదు, రోనిన్ తెలివితేటలు, సహజమైన ఆసక్తి నిత్యం చురుగ్గా ఉంచేందుకు దోహదం చేస్తున్నాయి. అందుకే కాబోలు భూమిలో బాంబులు గుర్తించడం రోనిన్‌కు ఒక ఆటలా ఉంటుంది’ అని ఏపోపో ప్రతినిధి లిల్లీ షాలోమ్ అన్నారు. రోనిన్ సంరక్షణ చూసుకునే ఫానీ మాట్లాడుతూ.. ‘రోనిన్ విజయాలు ఎలుకల అసాధారణ సామర్థ్యానికి నిదర్శనం. రోనిన్‌ను కేవలం బాంబుల్ని నిర్వీర్యం చేసే ఎలుక అని అనుకోం. మేం అతన్నిఫ్రెండ్‌గా, సహచరుడిగా భావిస్తాం’ అని అన్నారు. ఏపోపో సంస్థ దాదాపు ముప్పై సంవత్సరాలుగా భూమిలోని బాంబులను గుర్తించేందుకు ఎలుకలకు శిక్షణ ఇస్తోంది. రోనిన్,అతని సహచరులు ప్రతి రోజూ మైన్లు ఉండే ప్రాంతంలో విధులు నిర్వర్తిస్తారు. మైన్లు ఉన్నాయన్న అనుమానం ఉన్న ప్రదేశాల్లో వాటిని విడిచిపెడతారు. ఎలుక తమ అసాధారణమైన ప్రతిభతో మైన్లు ఉన్న ప్రదేశంపై ఉన్న మట్టిని కొరుకుతాయి. అలా ఓ నిర్దిష్ట వయస్సు వచ్చిన తర్వాత విధుల నుంచి పదవీ విరమణ చేస్తాయి. కాంబోడియాలో ఇరవై ఏళ్లపాటు అంతర్యుద్ధాలు జరిగాయి. చివరికి యుద్ధాలు 1998లో ముగిశాయి. అయినప్పటికీ ఇంకా ప్రపంచంలో అత్యధికంగా ల్యాండ్ మైన్‌లు ఎక్కువగా ఉన్న దేశాల్లో ఒకటిగా ఉంది. ఇప్పటికీ 40 లక్షల నుంచి 60 లక్షల మధ్యలో కాంబోడియా భూముల్లో ల్యాండ్ మైన్లతో పాటు ఇంకా పేలని పేలుడు పదార్థాలు ఉన్నట్లు పలు నివేదికలు వెలుగులోకి వచ్చాయి. అలాగే ఈ దేశంలో సగటున 40వేల మందికి పైగా ఈ ల్యాండ్ మైన్ల వల్ల కాళ్లను పోగొట్టుకున్నట్లు పలు నివేదికలు చెబుతున్నాయి. రోనిన్‌కు ముందు మగావా అనే ఎలుకనే అత్యధిక బాంబులు గుర్తించాడు. మగావా 2021లో పదవీ విరమణ చేసినప్పటికీ, అయిదేళ్ల కాలంలో 71 మైన్లు, 38 పేలని బాంబులను గుర్తించాడు. అతడికి సేవల గుర్తింపుగా పీడీఎస్ఏ అనే జంతు సంక్షేమ సంస్థ నుండి సాహస వీరుడి పతాకాన్ని అందుకున్నాడు. 2022 జనవరిలో వృద్ధాప్యంతో మగావా మరణించాడు.

# సౌదీలో అక్రమ వలసదారులపై కొరడా వారంలో 18,000 మందికి పైగా అరెస్ట్

ఇంటర్నెట్‌డెస్క్: సౌదీ అరేబియా ప్రభుత్వం అక్రమ వలసదారులపై కొరడా ఝుళిపించింది. వారం వ్యవధిలో సుమారు 18,407 మంది అక్రమ వలసదారులను అరెస్టు చేసింది. వీరంతా రెసిడెన్సీ, లేబర్, సరిహద్దు భద్రతా నియమాలను ఉల్లంఘించినట్లు అక్కడి ప్రభుత్వం పేర్కొంది. మార్చి 27 నుంచి ఏప్రిల్ 2 వరకు పలు ప్రభుత్వ ఏజెన్సీలు నిర్వహించిన ప్రత్యేక డ్రైవ్‌లో వీరిని అదుపులోకి తీసుకొన్నారు. ముఖ్యంగా అక్రమంగా నివాసం ఉంటున్నవారు.. సరిహద్దులు దాటి దేశంలోకి చొరబడిన వారిని టార్గెట్ చేసి ఈ కార్యక్రమం జరిగింది. వీరిలో 12,995 మంది అక్కడి నివాస చట్టాలను, 3,512 మంది సరిహద్దు భద్రతా చట్టాలను, 1,900 మంది లేబర్ చట్టాలను ఉల్లంఘించినట్లు ఇంటీరియర్ మినిస్ట్రీ వెల్లడించింది. అరెస్టు అయినవారిలో అత్యధికంగా 66శాతం మంది ఇథోపియా నుంచి వచ్చినట్లు గుర్తించారు. ఆ తర్వాత 28శాతం మంది యెమన్ వాసులుగా గుర్తించారు. ఇక నిబంధనలు ఉల్లంఘించిన మొత్తం 27,288 మందిపై ఆయా దౌత్య కార్యాలయాలకు సమాచారం అందించారు. ఇక వీరిలో 7,523 మందిని నేరుగా డిపోర్ట్ చేశారు. ఇక అక్రమ వలసదారులకు సాయం చేసే వారిపైనా చర్యలు తీసుకొంటున్నారు. ఈ కోవలోనే 21 మందిని అరెస్టు చేశారు. వీరు ఆశ్రయం ఇవ్వడం, రవాణాకు సహకరించడం వంటివి చేశారు. అక్రమ వలసదారులకు ఎవరు సాయం చేసినా 15 ఏళ్ల జైలు, మిలియన్ సౌదీ రియాల్స్ జరిమానా, ఆస్తులు, వాహనాల సీజ్‌ను ఎదుర్కోవాల్సి ఉంటుందని పేర్కొంది.




### కొన్ని దేశాలకు వీసాపై సౌదీ బ్యాన్..

సౌదీ అరేబియా మొత్తం 14 దేశాలకు చెందిన పౌరులకు కొన్ని రకాల వీసాలను జారీ చేయడంపై నిషేధం విధించింది. ఈ జాబితాలో భారత్, పాక్, బంగ్లాదేశ్ ఉన్నాయి. జూన్ మధ్య వరకు ఉమ్రా, బిజినెస్, ఫ్యామిలీ విజిట్ వీసాలు ప్రభావితం కానున్నాయి. సరైన రిజిస్ట్రేషన్ లేకుండా హజ్ యాత్ర చేసేవారిని అడ్డుకోవడమే లక్ష్యంగా ఈ నిర్ణయం తీసుకొన్నారు. గతంలో చాలామంది ఉమ్రా లేదా విజిట్ వీసాపై సౌదీలోకి ప్రవేశించిన తర్వాత గడువు తీరినా వెళ్లకుండా ఉండిపోయి.. హజ్ యాత్రలో పాల్గొనటం పరిపాటిగా మారింది. దీంతో తీవ్రమైన ఉక్కపోతతో జరిగే హజ్‌లో తీవ్రమైన రద్దీ పెనుసమస్యగా మారుతోంది. ఇలా 2024లో 1,200మంది యాత్రికులు మృతి చెందారు. ఇప్పటివరకు హజ్ కోసం సౌదీ అరేబియా ప్రతి దేశానికి కొన్ని స్లాట్లను కేటాయిస్తూ వస్తోంది. కానీ, ముందే దేశంలోకి వచ్చి ఉండిపోయిన వారు ఈ వ్యవస్థను బైపాస్ చేస్తున్నట్లు విమర్శలున్నాయి.

## అమరావతిని గ్లోబల్ మెడికల్ కేంద్రంగా మార్చాలి




అమరావతి: ఐదేళ్లలో ఆసుపత్రులకు వచ్చిన డేటా ఆధారంగా..ఏ జిల్లాల్లో ఏ వ్యాధి ఎక్కువ అనే లిస్ట్ సిద్ధం చేశామని ఎపి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తెలిపారు. అమరావతిని గ్లోబల్ మెడికల్ కేంద్రంగా మార్చాలని నిర్ణయం తీసుకున్నామన్నారు. ఎస్సీడి సర్వే 2.0 జరిగిందని, ఇప్పుడు 3.0 జరుగుతోందని చెప్పారు. 8 లక్షల మంది బిపి, షుగర్ బాధితులు చికిత్స తీసుకోవడం లేదని, షుగర్ వ్యాధి స్త్రీలు, పురుషులకు సమానంగా వస్తుందని అన్నారు. ఆహారపు అలవాట్ల వల్లే షుగర్ ఎక్కువగా వస్తుందని, మగవారికి హైపర్ టెన్షన్ తక్కువ.. ఆడవాళ్లకు ఎక్కువని తెలియజేశారు. మహిళలు ఎక్కువ స్ట్రెస్ తీసుకుంటున్నారని అన్నారు. ఎక్కడ రైస్ ఎక్కువ తింటారో అక్కడ డయాబెటిక్ ఉందని, వెనుకబడిన జిల్లాల్లో డయాబెటిక్ తక్కువగా ఉందని వెల్లడించారు. ఆడవాళ్లలో గుండె సంబంధిత వ్యాధులు తక్కువని, లివర్ వ్యాధులు పురుషుల్లో ఎక్కువ.. అందుకు కారణం లిక్కర్ అని తెలిపారు. ఎపిలో మన్యం జిల్లాలో వ్యాధులు తక్కువగా ఉన్నాయని.. మంచి వాతావరణం, సాంప్రదాయ ఆహారం అందుకు కారణమని చెప్పారు. వైద్యారోగ్య శాఖలో పలు ప్రయోగాలు చేస్తున్నామని, 19, 264 కోట్లు వైద్యారోగ్యశాఖలో ఖర్చు చేస్తున్నామని పేర్కొన్నారు. ఆసుపత్రుల్లో రూమ్ ఛార్జీలు ఎక్కువ అవుతున్నాయని, అందుకే ఓ వినూత్నమైన ప్రయోగం చేస్తున్నామని చంద్రబాబు స్పష్టం చేశారు.

## అందులో ఉన్నది ఫేక్ కాదు నిజమే..
## బిఆర్ఎస్ నేత సంచలన వ్యాఖ్యలు



హైదరాబాద్: హెచ్ సియు భూముల విషయంలో ఫేక్ వీడియోలు క్రియేట్ చేసి సామాజిక మాధ్యమాల్లో పోస్టు చేశారని బిఆర్ఎస్ నేత మన్నె క్రిశాంక్ కు గచ్చి బౌలి పోలీసులు నోటీసులు జారీ చేశారు. ఈ సందర్భంగా మన్నె క్రిశాంక్ మీడియాతో మాట్లాడారు. తాము విడుదల చేసి వీడియోలలో ఎక్కడా కూడా ఎఐని వాడలేదని, హెచ్ సియు భూముల విషయంలో విడుదల చేసిన వీడియోలు, ఫొటోలు నిజమేనని క్రిశాంక్ స్పష్టం చేశారు. జింకలు రోడ్ల మీద తిరగడం, స్థానికులు ఇళ్లలోకి వెళ్లే వీడియోలు కూడా సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న నేపథ్యంలో అక్కడ జింకలు లేవు నక్కలు ఉన్నాయని అన్నారని, ఎవరూ వెళ్లకుండా ఆంక్షలు పెట్టడంతో ప్రభుత్వం భయపడుతుందనేది అర్థమవుతుందని ఎద్దేవా చేశారు. ఎఐతో వీడియోలు క్రియేట్ చేశామనడం పచ్చి అబద్ధమని, ఎఐ గురించే మాట్లాడే అర్హత కాంగ్రెస్ కు లేదని క్రిశాంక్ చురకలంటించారు. కాంగ్రెస్ ప్రభుత్వమే రూ.20 వేలు ఇచ్చి సామాజిక మాధ్యమాల్లో రీల్స్ చేయిస్తున్నారని ఆరోపణలు చేశారు. హెచ్ సియు భూముల విషయంలో విద్యార్థులు ఆందోళనకు దిగడంతో వారిపై పోలీసుల లాఠీ ఛార్జ్ చేసి విషయం తెలిసిందే. సుప్రీం కోర్టు హెచ్ సియు భూముల విషయంలో తెలంగాణ ప్రభుత్వం ముందుకు వెళ్లవద్దని హెచ్చరించిన విషయం విధితమే.

## వివిప్యాట్ స్లిప్పుల మ్యాన్యువల్ లెక్కింపు పిటిషన్‌ను
## తోసిపుచ్చిన సుప్రీంకోర్టు





న్యూఢిల్లీ : ఎన్నికల సమయంలో వివిప్యాట్ స్లిప్పులను 100 శాతం మాన్యువల్ లెక్కింపు ఉండేలా చూడాలన్న పిటిషన్‌ను సుప్రీంకోర్టు సోమవారం తోసిపుచ్చింది. గతేడాది ఆగస్టు 12న ఢిల్లీ హైకోర్టు ఇచ్చిన తీర్పులో జోక్యం చేసుకోవడానికి ఎటువంటి కారణం కనిపించడం లేదని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సంజీవ్ ఖన్నా, జస్టిస్ సంజయ్ కుమార్, జస్టిస్ కె.వి.విశ్వనాథన్‌లతో కూడిన ధర్మాసనం పేర్కొంది. స్పెషల్ లీవ్ పిటిషన్‌ను కొట్టివేస్తున్నట్లు సిజెఐ పేర్కొన్నారు. తన నేతృత్వంలోని సుప్రీంకోర్టు ధర్మాసనం గతంలో ఇటువంటి అంశాలపై తీర్పునిచ్చిందని, పదేపదే ప్రస్తావించడం సరికాదని సిజెఐ తెలిపారు. ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలు (ఇవిఎం) డేటాను వివిప్యాట్ రికార్డులతో 100 శాతం సరిపోల్చాలని కోరుతూ దాఖలైన పిటిషన్లను తోసిపుచ్చుతూ.. ఇవిఎంలు సురక్షితమైనవని స్పష్టం చేసింది. వివిప్యాట్ స్లిప్పులను ఎలక్ట్రానిక్ కౌంటింగ్‌కు బదులుగా మాన్యువల్‌గా లెక్కించాలని భారత ఎన్నికల సంఘాన్ని (ఇసిఐ) ఆదేశించాలని కోరుతూ హన్స్ రాజ్ ఈ పిటిషన్ దాఖలు చేసిన సంగతి తెలిసిందే.

## మోడీ 'స్వీయ గాయాలతో'నే నష్టాల్లో స్టాక్ మార్కెట్లు



న్యూఢిల్లీ : ప్రధాని మోడీ 'స్వీయ గాయాలతో'నే స్టాక్ మార్కెట్లు నష్టాల్లో కూరుకుపోయాయని కాంగ్రెస్ సీనియర్ నేత, కమ్యూనికేషన్ ప్రతినిధి జైరాం రమేష్ మండిపడ్డారు. ప్రధాని మోడీ, అమెరికా అధ్యక్షులు ట్రంప్ ఇద్దరూ కూడా తమ ఆర్థిక వ్యవస్థలకు "స్వయంగా గాయాలను కలిగించడం"లో సిద్ధహస్తులని ఎద్దేవా చేశారు. టారిఫ్‌లకు అనుగుణంగానే మార్కెట్లు నష్టాల బాట పట్టడంలో ఆశ్చర్యం లేదని ఎక్స్‌లో పేర్కొన్నారు. " ప్రధాని మోడీ మరియు ట్రంప్ తమను తాము మంచి స్నేహితులుగా అభివర్ణించుకోవడంలో ఆశ్చర్యం లేదు. ఇద్దరూ తమ ఆర్థికవ్యవస్థలకు స్వయంగా గాయాలు చేసుకోవడంలో నిపుణులు. 2016 , నవంబర్ 8 నోట్ల రద్దు, 2025 ఏప్రిల్ 2 ప్రతీకార సుంకాలు వాటికి ఉదాహరణలు. ఆ టారిఫ్‌లకు అనుగుణంగానే మార్కెట్లు నష్టాల్లో కూరుకుపోతున్నాయి" అని పోస్ట్‌లో పేర్కొన్నారు. ట్రంప్ టారిఫోన్మాదంతో ప్రపంచ వాణిజ్యయుద్ధం, అమెరికా మాంద్యం భయాలతో భారత షేర్లు సోమవారం కుప్పకూలాయి. సోమవారం పారంభ ట్రేడింగ్‌లో సెన్సెక్స్, నిఫ్టీలు శాతం క్షీణించాయి. సెన్సెక్స్ 3,939.68 పాయింట్లు క్షీణించి రూ.71,425.01లుగా ముగిసింది. నిఫ్టీ 1,160.8 పాయింట్లు క్షీణించి రూ.21,743.65గా ముగిసింది.

# చెట్లు కుములుతున్న దృశ్యం



నగరం అప్పుడప్పుడే మేలుకుంటున్న వేళ డాబా మీదికి వెళ్ళి చూడండి: ఎప్పుడు మేలుకున్నాయో తెలియదు, ఎలా వచ్చాయో తెలియదు, చుట్టూ ఉన్న పెద్ద పెద్ద చెట్ల మీద, చిన్న చిన్న మొక్కల మీద, ఎక్కడబడితే అక్కడ చిన్నాపెద్దా పక్షులు, రంగురంగుల బుల్లి బుల్లి పిట్టలు! అవి నిర్విరామంగా కిచకిచల ధ్వనులు చేస్తూనే ఉంటాయి. అవి వాటితో అవి మాట్లాడుకోవడంబీ ఒకరి ఉల్లాసాన్ని ఒకరు పంచుకోవడంబీ కొమ్మమీంచి కొమ్మకు, ఆకుమీంచి ఆకుకు గెంతుతాయి,మందారపుష్పాల మెత్తని కేసరకాండాన్ని పట్టుకుని ఊగుతాయి. అది వాటి క్రీడావినోదం. అది కూడా కాసేపే! ఉషఃకాలపు పిల్లగాలులు చల్లచల్లగా వీస్తున్నప్పుడు, సూర్యుడు పూర్తిగా పొడుచుకు రానప్పుడు, పరిసరాలు వేడెక్కనప్పుడు, మరీముఖ్యంగా మానవ సంచారం మొదలవనప్పుడు! ఆ తర్వాత అవి అదృశ్యం! ఎక్కడికెడతాయో తెలియదు, రోజంతా ఎక్కడుంటాయో తెలియదు! వాటి గురించి ఎప్పుడైనా క్షణకాలం ఆలోచించి చూడండి, అప్పుడేమనిపిస్తుంది? బహుశా, ఎప్పుడో వేల సంవత్సరాల క్రితం మానవ ధూర్తరాష్ట్రులతో ఆడిన జూదంలో ఓడిపోయి జనారణ్యంగా మారిన తమదైన అరణ్యంలోనే అజ్ఞాతవాసం చేస్తున్న పాండవుల అనంత సంతతి కాదుకదా అనిపిస్తుంది. అవి రోజూ పొద్దుటే కాసేపు తమ కొమ్మల మీద, తమ ఆకుల మధ్య ఇంద్రధనువుల్ని ఆవిష్కరిస్తూ కోలాహలంగా తిరుగుతూ ఉంటే ఆ చెట్లకెంత సంబరం! ఆ చెట్లూ, పిట్టలూ ప్రకృతి చరిత్ర పుటల్లోని తమ గురించిన అధ్యాయాలను మనిషి నిర్దాక్షిణ్యంగా చెరిపేసి పూర్తిగా సొంత అధ్యాయాలతో నింపేసుకున్న తర్వాత, కేవలం ప్రాచీన స్మృతులుగా మారిన తమ అనుబంధం గురించిన ఊసులు ఆ కాసేపూ నెమరేసుకుంటాయి కాబోలు! పక్షులతో పోల్చితే చెట్ల పరిస్థితి మరీ ఘోరం. అవి ఎగరనూ లేవు, ఆపైన వాటివి భారీకాయాలు కనుక అజ్ఞాతవాసయోగం కూడా వాటికి లేదు. తమ కొమ్మల మీద, తమ వేళ్ళ మీద మనిషి గొడ్డలి వేటు ఏ క్షణంలో పడుతుందో నన్న నిత్యభయగ్రస్త జీవితాన్ని నిలువు కాళ్ళమీద గడపక తప్పదు. చెట్లు కూలుతున్న దృశ్యం గురించి, రాక్షసుని వెన్నెముకపై ప్రతిష్ఠించిన నగరం గురించి, నగరంలో మనిషి కంటక శరీరుడిగా మారడం గురించి, సర్వత్రా వినిపించే కఠోర శబ్దాలు,ధ్వంసక్రీడ, దగ్ధక్రీడల గురించి, పూల చెట్లు విలపించడం గురించి, నిద్రలో నడుస్తున్న మనిషి నెత్తుటి మడుగును దాటలేడని చెప్పి అవి శపించడం గురించి–కవి అజంతా రాస్తాడు. అవును, నిజమే, నిద్రలో నడుస్తున్న మనిషి ప్రకృతిలోని సమస్త జీవజాలం మనుగడనూ నెత్తుటి మడుగు చేశాడు, తను సృష్టించిన ఆ మడుగును తను కూడా దాటలేని పరిస్థితిని తెచ్చుకుంటూనే ఉన్నాడు. ఒకప్పుడంతా అడవేనన్న సంగతి మరచిపోయి, నగరమే నిత్యమూ, సత్యమనే భ్రమలో పడిపోయాడు. చెట్లను కూల్చడం, వాటిని ఆశ్రయించుకున్న జీవజాలానికి నిలువనీడ లేకుండా చేయడమే అభివృద్ధి అని నిర్వచించుకుంటున్నాడు. తను కూడా భాగమైన ప్రకృతికి దూరమై ఒంటరివాడై పోతున్నాడు. అంతా తన ప్రయోజకత్వం, తానే భువికధినాథుడినని విర్రవీగుతున్నాడు. తను నెత్తిన మోసే తన పౌరాణిక, ఇతిహాస వారసత్వం నుంచి కూడా మనిషి పాఠాలు నేర్చుకోవడం లేదు. ఎగిరే పర్వతాల గురించి, మానవరూపం ధరించి మాట్లాడే నదుల గురించి, మాట్లాడే పక్షులు, జంతువుల గురించి అవి చెబుతాయి. అది, నువ్వు కూడా ప్రకృతిలో భాగమే సుమా అని గుర్తుచేయడంబీ ప్రకృతిలో ఏ జీవీ ఎక్కువా కాదు, తక్కువా కాదు, అన్నింటికీ జీవించే హక్కు ఉందని చెప్పడం! అడవులకు, అక్కడి సమస్త పాణులకు రక్షణ కల్పించవలసిన అవసరం గురించి అర్థశాస్త్రం చెబుతుందిబీ అడవులూ, వాటిని ఆశ్రయించుకుని బతికే జీవులూ రాజ్యంలో భాగం కాని, స్వతంత్ర అస్తిత్వాలన్న సంగతిని ఆనాటి రాజుల వివేకం చెబుతుంది. ప్రాకృతికమైన పూర్తి అవగాహనతో పూర్వులు గీసిన ఈ లక్ష్మణ రేఖలన్నీ ఏమైపోయాయి? అడవిపై విచక్షణా రహితమైన రాజ్యపు రాబందు రెక్క పరచిందెవరు?! సమకాలీన శాస్త్రవిజ్ఞాన పాఠాలు కూడా మనిషి తలకెక్కడం లేదుబీ ఈ విశ్వమూ, భూమీ,అందులోని ప్రకృతీ తమవైన ప్రణాళికను, తమవైన కేలండర్‌ను అనుసరిస్తాయనీ, మనిషి ప్రణాళికలనూ, కేలండర్‌నూ అవి ఏ క్షణంలోనైనా కుప్పకూల్చగలవనే ఎరుక లేదు. వందల కోట్ల సంవత్సరాల భూమి చరిత్రలో ఎన్నో మంచుయుగాలు దొర్లాయి. భూకంపాలు, వరదలు, అగ్నిపర్వత విస్ఫోటాలు జీవి మనుగడను ఎన్నో మలుపులు తిప్పాయి. ఎంతో చరిత్రను తిరగరాశాయి. జీవపరిణామం ఎన్నో మార్పులు చెందింది. మానవ పరిణామంలో ఇప్పుడు చూస్తున్నదే తుది అంకం కాదు, మరిన్ని అంకాలకు అవకాశముందని జన్యుశాస్త్రజ్ఞులు హెచ్చరిక. మరి జంతువులు సహా ఇతర జీవజాలం సంగతేమిటి? మనిషిలోలానే వాటిలో కూడా ఏదైనా ఉత్పరివర్తన జరిగి అవి మనిషి స్థానాన్ని ఆక్రమిస్తే?! అది ప్రస్తుతానికి విపరీత ఊహలా అనిపించవచ్చు, కానీ ప్రకృతి గర్భంలో ఏ రహస్యాలు దాగున్నాయో ఎవరికి తెలుసు? కనుక మనిషి నేర్చుకోవలసింది వినమ్రత! ప్రకృతిపట్లా, అందులోని చరాచరాలన్నిటిపట్లా సమభావం, సమరసభావం!! పగబట్టి తిరగబడే ప్రకృతి ముందు తను పిపీలకమన్న ఆత్మజ్ఞానం!!

# ఇకనైనా బుద్ధొస్తుందా




ఇళ్ళ కూల్చివేతపై భారత సర్వోన్నత న్యాయస్థానం ఈనెల 1వ తేదీన ఇచ్చిన తీర్పు ఉత్తరప్రదేశ్‌లోని బుల్డోజింగ్ ప్రభుత్వానికి గట్టి చెంపదెబ్బ. ప్రయాగరాజ్‌లో ఇళ్ళ కూల్చివేత బాధితులకు ఒక్కొక్కరికి రూ.10 లక్షల చొప్పున నష్టపరిహారం ఆరు వారాల్లో చెల్లించాలని సుప్రీంకోర్టు ఆదేశించటం మంచి పరిణామం. "ఈ దేశంలో చట్టాలు, నియమ నిబంధనలు ఉన్నాయి. వాటిని కాలదన్ని కూల్చివేతలకు పాల్పడడం అమానవీయం. నివాస గృహాలను కూల్చివేయడం ఒక ఫ్యాషన్‌గా మారకూడదు." అని జస్టిస్ అభయ్ ఓక్, జస్టిస్ ఉజ్జల్ భూయాన్ ధర్మాసనం చీవాట్లు పెట్టింది. యోగి ప్రభుత్వానికి సుప్రీంకోర్టు ఇలా తలంటడం ఇదే మొదటిసారి కాదుబీ బుల్డోజింగ్ అన్యాయాన్ని తలకెత్తుకున్న ప్రతిసారీ మొట్టికాయలు వేస్తూనే ఉంది. అయినా, బుద్ధి తెచ్చుకోని బిజెపి ప్రభుత్వం అదే అనాగరిక ధోరణిని తమ పార్టీ ఏలుబడిలో ఉన్న ఇతర రాష్ట్రాలకూ పాకించింది. దీనిపై గతంలో సుప్రీంకోర్టు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. ప్రాథమిక హక్కులకు విఘాతం కలిగించే ప్రతీకార ధోరణికి స్వస్తి చెప్పాలని, అధికారులే న్యాయమూర్తుల పాత్ర పోషించటం సరైంది కాదని స్పష్టం చేసింది. అక్రమ నిర్మాణాల పట్ల వ్యవహరించాల్సిన విధివిధానాలను కూడా ప్రకటించి, అవి దేశం మొత్తానికి వర్తిస్తాయని చెప్పింది. బిజెపి పాలకులు వాటిని బేఖాతరు చేసి, ఇష్టారాజ్యంగా వ్యవహరించటం దారుణం. ఉత్తరప్రదేశ్‌లో యోగీ ఆదిత్యనాథ్ నేతృత్వాన ఉన్న కాషాయ ప్రభుత్వం తొలుత ఈ బుల్డోజింగ్ విధ్వంసానికి తెర లేపింది. రాజకీయ భిన్నాభిప్రాయం కలిగి ఉన్నవారిపైనా, తమకు వ్యతిరేకంగా నిరసనలు వ్యక్తం చేసిన వారిపైనా బుల్డోజర్‌ను ఒక అధికారిక ఆయుధంగా మార్చుకుంది. 'మీ ఇళ్లపైకి బుల్డోజర్లు పంపిస్తాం.. జాగ్రత్త!' అని పలువురు బిజెపి నాయకులు నిరసనకారులను బెదిరించటం రివాజుగా మారిపోయింది! ముఖ్యంగా ఒక మతాన్ని లక్ష్యంగా పెట్టుకొని కూల్చివేతల దుర్మార్గం ఉత్తరప్రదేశ్, హర్యానా, ఢిల్లీ, రాజస్థాన్, మధ్యప్రదేశ్, త్రిపుర, అస్సాం, మహారాష్ట్ర తదితర బిజెపి పాలిత రాష్ట్రాల్లో కొనసాగుతోంది. 2021లో ప్రయాగరాజ్‌లో అతీక్ అహ్మద్ అనే గ్యాంగ్‌స్టర్‌ని ఎన్‌కౌంటర్ చేశారు. తరువాత అతడి ఆక్రమిత ఆస్తులంటూ ఒక స్థలంలో ఉన్న ఇళ్లను ఏకపక్షంగా బుల్డోజర్లతో కూల్చేశారు. బాధితులు అలహాబాద్ హైకోర్టును ఆశ్రయిస్తే, కూల్చివేత సరైందేనంటూ బుల్డోజింగ్‌ని సమర్థించింది. దీంతో, వారు సుప్రీంకోర్టు మెట్లెక్కారు. అక్కడి ధర్మాసనం కేసును సాకల్యంగా విచారించి, బాధితులకు బాసటగా నిలిచింది. చట్టవ్యతిరేకమైన, రాజ్యాంగ విరుద్ధమైన బుల్డోజింగ్‌ని ఒక సంస్కృతిగా మార్చే ప్రయత్నం చేస్తోంది బిజెపి.కండ కావరంతో బాధితులకు నిలువ నీడ లేకుండా చేయడమే కాదుబీ తన పరివార శక్తులతో ఆ బాధితులకు వ్యతిరేకంగా ద్వేషాన్ని రెచ్చగొడుతోంది. ఈ నీచ రాజకీయాన్ని విమర్శిస్తూ అనేక ప్రజాస్వామిక సంస్థలూ, పార్టీలూ నిరసన గళం వినిపిస్తున్నాయి. పార్లమెంటులో సిపిఎం సభ్యులూ, ఇతరులూ గట్టిగా మాట్లాడారు. అయినా, బిజెపి తన కక్షపూరిత విధానాన్ని వదులుకోలేదు. ఎన్‌ఆర్‌సి – సిఎఎ నిరసనల్లో పాల్గొన్న వారిని, వివిధ సందర్భాల్లో పాలకపక్షానికి వ్యతిరేకంగా ర్యాలీలు జరిపిన వారిని లక్ష్యంగా పెట్టుకొని వారి నివాసాలను కూల్చివేసింది. ఇటీవల స్టాండింగ్ కమెడియన్ కునాల్ కమ్రాపైనా కాషాయ శక్తులు ఇలాగే విరుచుకుపడ్డాయి. ఆయన కార్యక్రమాలు నిర్వహించే ముంబైలోని స్టూడియోను కూల్చివేశారు. అదే రాష్ట్రంలో ఫిబ్రవరి 23న ఒక బాలుడు తన ఇంట్లో క్రికెట్ మ్యాచ్ చూస్తూ, పాకిస్తాన్ అనుకూల నినాదాలు చేశాడంటూ స్థానికులు ఆరోపిస్తే, ఆగమేఘాల మీద ఆ బాలుడి తల్లిదండ్రులను పోలీసులు అరెస్టు చేశారు. వారు కస్టడీలో ఉండగానే, వారి ఇంటిని, దుకాణాన్ని కూల్చేశారు. నేరారోపణ, నిరూపణ, శిక్ష నిర్ధారణ వంటివి ఒక క్రమపద్ధతిలో జరగాలని, నేరారోపణ చేసినవాళ్లే తీర్పును వెలువరించి, శిక్షలు అమలు చేయడం నేరం అవుతుందని గత నవంబరులోనే సుప్రీంకోర్టు ధర్మాసనం హెచ్చరించింది. దానికి అనుగుణంగానే తాజాగా తీర్పును వెలువరించటం హర్షణీయం. భావోద్వేగాలను రెచ్చగొట్టి రాజకీయ లబ్ధి పొందటమే లక్ష్యంగా బరి తెగిస్తున్న బుల్డోజింగ్ పాలకులకు ఈ తీర్పు కనువిప్పు కావాలి.

# వక్ఫ్ బిల్లు వ్యతిరేకించాలి




ప్రతిపక్షాల తీవ్ర ప్రతిఘటనల నడుమ వక్ఫ్ చట్టానికి సమూల సవరణలు చేసే బిల్లు పార్లమెంట్ ఉభయ సభల్లో ఆమోదం పొందింది. రాజ్యాంగాన్ని, ముస్లిం మైనార్టీల హక్కులను, మత స్వేచ్ఛను ఈ బిల్లు హరిస్తుందని లౌకిక, ప్రజాస్వామ్యవాదులు, ముస్లిం సమాజం వెలిబుచ్చిన అభ్యంతరాలను, ఆందోళనలను కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం బుల్డోజ్ చేసి మరీ బిల్లును ఆమోదింపజేసుకుంది. లోక్‌సభలో, రాజ్యసభలో బుధ, గురువారాల్లో సుదీర్ఘ చర్చకు ప్రభుత్వం అవకాశం కల్పించడం నటన తప్ప సభ్యుల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకోడానికి కాదని కేంద్ర మంత్రుల వాలకం చూస్తే అర్థమవుతుంది. బిల్లును ప్రవేశపెడుతూ మైనార్టీల వ్యవహారాల శాఖ మంత్రి కిరణ్ రిజిజు చేసిన వ్యాఖ్యలు మరీ జుగుప్సాకరంగా ఉన్నాయి. పార్లమెంట్ సైతం వక్ఫ్ ఆస్తి అయ్యే ప్రమాదం నుంచి రక్షించామని రెచ్చగొట్టారు. వివాదాస్పద వక్ఫ్‌బిల్లు ఆమోదానికి బిజెపి పాత్ర ఎంత ఉందో, మెజార్టీ లేని మోడీ ప్రభుత్వానికి భుజం కాసిన ఎన్‌డిఎ భాగస్వామ్య పార్టీలదీ అంతే పాత్ర ఉంది. ప్రధానంగా ఆంధ్రప్రదేశ్‌లో అధికార కూటమికి నాయకత్వం వహిస్తున్న టిడిపి, జనసేన, బీహార్ అధికార పార్టీ జెడియు సహాయంతోనే మోడీ ప్రభుత్వం మనగలుగుతోంది. ఆ పార్టీలు బిల్లుకు సంపూర్ణ మద్దతు తెలిపాయి. చట్టం వచ్చాక ముస్లిం హక్కులకు వాటిల్లే అన్యాయాలు, నష్టాలకు బిజెపి పల్లకి మోస్తున్న ఆయా పార్టీలే బాధ్యత వహించాల్సి ఉంటుంది. వక్ఫ్ చట్ట సవరణల బిల్లు మోడీ సర్కారు కేంద్రంలో మూడవ తడవ వచ్చీ రాగానే గతేడాది ఆగస్టులో లోక్‌సభలో ప్రవేశపెట్టింది. విపక్షాలతోపాటు ఎన్‌డిఎలోని కొన్ని పార్టీలు, ఎన్‌డిఎకు సన్నిహితంగా ఉండే పార్టీలు సైతం వ్యతిరేకించాయి. దాంతో బిల్లుపై విస్తృత స్థాయి చర్చల నిమిత్తం జాయింట్ పార్లమెంటరీ కమిటీ (జెపిసి)కి ప్రభుత్వం అప్పగించింది. జెపిసి నిర్వహించిన సమావేశాలు మొక్కుబడిగానే సాగాయి. బిజెపికే చెందిన జెపిసి ఛైర్మన్ జగదాంబికాపాల్ ప్రతిపక్షాలు, ముస్లిం సంఘాలు, సంస్థల అభిప్రాయాలను సరిగ్గా వినిపించుకోలేదన్న విమర్శలు వచ్చాయి. దాంతో జెపిసి తుది నివేదిక ఏ విధంగా ఉంటుందో తెలిసిపోయింది. కాగా బిల్లులోని పలు అంశాలు ముస్లిం ప్రజల ఆస్తులను కొల్లగొట్టేవిగా ఉన్నాయి. వక్ఫ్ చట్టంలోని సెక్షన్ 40 రద్దు వలన వక్ఫ్ తన ఆస్తులపై అధికారాన్ని, నియంత్రణను కోల్పోతుంది. సునాయాసంగా వక్ఫ్ ఆస్తులను స్వాధీనపర్చుకొనే కుట్రలెన్నో బిల్లులో కనిపిస్తాయి. రాజ్యాంగంలోని 25,29,30 ఆర్టికల్స్‌కు, ఇతర నిబంధనలకు విరుద్ధమైన బిల్లు అయినందునే సర్వత్రా ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. హిందూత్వ ఎజెండాలో భాగమే వక్ఫ్ బిల్లనడంలో ఎలాంటి శషభిషలూ అక్కర్లేదు. బిజెపి, సంఘ్ పరివార్‌ల లవ్‌జిహాద్, ఘర్‌వాపసీ, ఏకరూప పౌరస్మృతి, మసీదుల తివిధ్వంసం, మూక దాడులకు కొనసాగింపుగానే వక్ఫ్ బిల్లును చూడాలి. బిల్లులోని కొన్ని సవరణలు మత విద్వేషాలను రాజేసేవిగా ఉన్నాయి. వక్ఫ్ బోర్డులలో ఇతర మతస్తుల నియామకానికి అవకాశం కల్పించే సవరణ మత విభజనకు ఉద్దేశించినదే. వక్ఫ్ స్థలాలపై యాజమాన్యాన్ని నిరూపించుకునే విషయంలో ఐదేళ్లుగా ముస్లిం మతాన్ని ఆచరిస్తున్నట్లు అధీకృతంగా తెలపాలి. ఈ నిబంధన ముస్లింలను వేధింపులకు గురి చేస్తుంది. అచ్చం సిఎఎ చట్టాన్ని తలపిస్తుంది. వక్ఫ్ విద్యా సంస్థలు, ఆస్పత్రులు,




వృత్తి పరమైన శిక్షణా సంస్థల అక్రమ స్వాధీనానికి, జప్తునకు వక్ఫ్ బిల్లు తప్ప వక్ఫ్ ఆస్తుల పరిరక్షణకు, అభివృద్ధికి ఎంత మాత్రం కాదు. ఒక పథకం ప్రకారం ముస్లింల ధార్మిక, సామాజిక, సాంస్కృతిక సంస్థలపై దాడి చేస్తుంది. ఒకసారి వక్ఫ్ చేసిన ఆస్తులు వక్ఫ్ ఆస్తులుగానే ఉంటాయి, వాటిని మార్చే అధికారం ఎవ్వరికీ లేదు అని గతంలో సుప్రీం కోర్టు తీర్పు చెప్పింది. సుప్రీం తీర్పునకు భిన్నంగా మోడీ సర్కారు బిల్లు తెచ్చింది. రాజ్యాంగ విరుద్ధంగా ఉన్న బిల్లుపై న్యాయస్థానాన్ని ఆశ్రయిస్తామని పలు పార్టీలు, సంఘాలు ప్రకటించాయి. కోర్టు తీర్పు వచ్చే వరకు వేచి చూడకుండా లౌకిక, ప్రజాతంత్ర వాదులు, పార్టీలు బిల్లును ఏకోన్ముఖంగా వ్యతిరేకించాలి. ఉపసంహరించుకునేలా మోడీ ప్రభుత్వ మెడలు వంచాలి.

## ఎన్‌ఎస్‌యుఐ చేపట్టిన పలాయన్ రోకో.. నౌకరి దో' ర్యాలీలో పాల్గొన్న రాహుల్



బెగెసరాయ్ (బీహార్) : కాంగ్రెస్ విద్యార్థి విభాగం (ఎన్‌ఎస్‌యుఐ) బీహార్‌లోని బెగుసరారులో 'పలాయన్ రోకో.. నౌకరి దో (వలసలు ఆపండి.. ఉద్యోగాలు ఇవ్వండి)' అనే ర్యాలీ చేపట్టింది. ఎన్‌ఎస్‌యుఐ జాతీయ ఇన్‌ఛార్జ్ కన్హయ్య కుమార్ నేతృత్వంలో జరుగుతున్న ఈ ర్యాలీలో లోక్‌సభ ప్రతిపక్షనేత, కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ పాల్గొన్నారు. ఈ ర్యాలీ సందర్భంగా పాట్నాలో జరుగుతున్న బహిరంగ సభలో రాహుల్ ప్రసంగించనున్నారు. కాగా, పలాయన్ రోకో.. నౌకరి దో ప్రచారంలో తాను పాల్గొనబోతున్నానని రాహుల్ ఆదివారం సోషల్ మీడియాలో వెల్లడించారు. బీహార్ యువత స్ఫూర్తిని, వారి కష్టాలను ప్రపంచానికి తెలియజేయడానికే ఈ ప్రచారం ముఖ్య లక్ష్యమని రాహుల్ ఎక్స్ పోస్టులో పేర్కొన్నారు. బీహార్ ప్రభుత్వం ఆ రాష్ట్ర యువతకు ఉపాధి కల్పించడం లేదు. ఈ అంశాన్నే హైలెట్ చేస్తూ.. కాంగ్రెస్ స్టూడెంట్స్ విభాగం ఎన్‌ఎస్‌యుఐ ర్యాలీ చేపట్టింది. రాష్ట్రంలో తాండవిస్తున్న నిరుద్యోగాన్ని ఈ ఏడాది చివరలో జరగనున్న ఎన్నికల ప్రచారంలో కాంగ్రెస్ హైలెట్ చేయనుంది.

## జమ్ముకాశ్మీర్ అసెంబ్లీలో గందరగోళం .. వక్ఫ్ బిల్లు కాపీలను చింపేసిన ఎన్‌సి ఎమ్మెల్యేలు



జమ్ము : వక్ఫ్ సవరణ బిల్లుపై జమ్ముకాశ్మీర్ అసెంబ్లీలో సోమవారం గందరగోళం నెలకొంది. ఈ బిల్లు అమలును వ్యతిరేకిస్తూ నేషనల్ కాన్ఫరెన్స్ (ఎన్‌సి)తో పాటు ప్రతిపక్షాల సభ్యులు నిరసన వ్యక్తం చేశారు. ఈ బిల్లుపై తమ వాయిదా తీర్మానాన్ని స్పీకర్ అబ్దుల్ రహీం రాథర్ తిరస్కరించడంపై ఆందోళన వ్యక్తం చేశారు. అసెంబ్లీ ప్రారంభం కాగానే.. వక్ఫ్ చట్టంలో ఇటీవల చేసిన సవరణలు, వాటి పర్యవసానాలపై చర్చ చేపట్టాలని ప్రతిపక్ష ఎమ్మెల్యేలు డిమాండ్ చేశారు. ఎన్‌సి ఎమ్మెల్యే తన్వీర్ సాధిక్ వాయిదా తీర్మానాన్ని ప్రవేశపెట్టారు. అయితే సుప్రీంకోర్టులో ఉన్నందున, సబ్‌జ్యుడీస్ (విచారణ)లో ఉన్నందున, ఆ కాపీ తన వద్ద కూడా ఉన్నందున ఈ అంశాన్ని వాయిదా తీర్మానం కింద చర్చించలేమని స్పీకర్ తిరస్కరించారు. దీంతో వెల్‌లోకి దూసుకువెళ్లేందుకు యత్నించిన సభ్యులను మార్షల్స్ అడ్డుకున్నారు. వక్ఫ్ బిల్లును రద్దు చేయాలని పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. కొందరు ఎన్‌సి ఎమ్మెల్యేలు వక్ఫ్ సవరణ బిల్లు కాపీలను చించివేశారు. ఇది రాజ్యాంగ, ప్రజాస్వామ్య, చట్ట నిబంధనల ఉల్లంఘన అని కాంగ్రెస్ ఎమ్మెల్యే ఇర్ఫాన్ హఫీజ్ లోన్ ఆగ్రహం వ్యక్తం చేశారు. తమ విశ్వాసాలను పరిగణనలోకి తీసుకోలేదని, తమ అభిప్రాయాలను గౌరవించాల్సి వుందని అన్నారు. స్పీకర్ చట్టపాలన, సమాఖ్యవాదం, లౌకిక వాదాన్ని పూర్తిగా ఉల్లంఘిస్తున్నారని ఆయన మండిపడ్డారు. ప్రతిపక్ష పిడిపి సభ్యులు సైతం నిరసనలో పాల్గన్నారు. ఆర్టికల్ 370, సిఎఎ సబ్‌జ్యుడీస్‌లో ఉన్నప్పుడు కూడా తీర్మానం ప్రవేశపెట్టామని పిడిపి నేత వహీద్ పారా పేర్కొన్నారు. పలు రాష్ట్రాలు తీర్మాలను ప్రవేశపెట్టాయని, వక్ఫ్ బిల్లుకి వ్యతిరేకంగా తమ నిరసనలను తెలియజేయాలనుకుంటున్నామని, అయితే స్పీకర్ తిరస్కరించారని మండిపడ్డారు. ఎన్‌సి ఫిక్స్‌డ్ మ్యాచ్ ఆడుతోందని దుయ్యబట్టారు. ఈ బిల్లుని వ్యతిరేకించకపోవడం ద్వారా జమ్ముకాశ్మీర్ ప్రభుత్వం కాశ్మీర్, ముస్లింల సమస్యలపై రాజీపడుతోందని స్పష్టమైందని ఆగ్రహం వ్యక్తం చేశారు.

## ఆరోగ్య వ్యవస్థను ఐసియుకి పంపిన మోడీ



న్యూఢిల్లీ : నేడు ప్రపంచ ఆరోగ్య దినోత్సవం. ఈ సందర్భంగా మోడీ హయాంలో ఆరోగ్య వ్యవస్థ క్షీణించిందని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే తీవ్రంగా ధ్వజమెత్తారు. కేంద్ర ప్రభుత్వం ఆరోగ్య వ్యవస్థను ఐసియుకి పంపిందని, దీంతో పౌరులపై వైద్య ఖర్చుల భారం విపరీతంగా పెరిగిపోతుందని ఆయన విమర్శించారు. ఈ సందర్భంగా ఆయన సామాజిక మాధ్యమం ఎక్స్‌లో వీడియోను పోస్టు చేశారు. 'గత ఐదేళ్లలో వైద్య ద్రవ్యోల్బణం విపరీతంగా పెరిగిపోయింది. ప్రతి సంవత్సరం 14 శాతం దేశ వైద్య ద్రవ్యోల్బణం పెరిగి భయంకరమైన స్థాయికి చేరింది. ఈ ఏప్రిల్ నాటికి 900 నిత్యావసర మందుల ధరల పెరిగాయి. ఖరీదైన వైద్యం వల్ల ప్రతి సంవత్సరం 10 కోట్ల మంది భారతీయులు పేదరికంలో కూరుకుపోతున్నారని నీతి అయోగ్ నివేదిక చెబుతోంది. మెడికల్ గ్రేడ్ ఆక్సిజన్‌పై 12 శాతం జిఎస్‌టి, బ్యాండేజీలు, సర్జికల్ వస్తువులపై 12 శాతం జిఎస్‌టి, హాస్పిటల్ వీల్‌ఛైర్స్‌పై 18 శాతం జిఎస్‌టి, ఆసుపత్రుల్లో శానిటరీ నాప్‌కిన్‌లపై 18 శాతం జిఎస్‌టి, గుండె చికిత్సలకు 18 శాతం కేంద్రం జిఎస్‌టి విధిస్తోంది. దీంతో ఆసుపత్రి ఖర్చులు ఈ సంవత్సరంలో 11.3 శాతం పెరిగాయి. యాంజియోప్లాస్టి ఖర్చు రెట్టింపు యింది. ఇక కిడ్నీ మార్పిడి ఖర్చు మూడురెట్లు పెరిగింది. మోడీ ప్రభుత్వం ఆరోగ్య వస్తువులపై పన్నులు విధించడంతో వైద్య ఖర్చులు విపరీతంగా పెరిగిపోయి సాధారణ ప్రజలపై పెనుభారమవుతుంది.' అని ఖర్గే వీడియో పోస్టులో మోడీ ప్రభుత్వంపై ఫైర్ అయ్యారు. జాతీయ ఆరోగ్య విధానం 2017 ప్రకారం కాంగ్రెస్ ప్రభుత్వం జిడిపిలో 2.5 శాతం మేర ఆరోగ్యంపై ఖర్చు చేసింది. అయితే ఇప్పుడు మోడీ ప్రభుత్వం 1.84 శాతం మాత్రమే ఖర్చు చేసిందని ఖర్గే విమర్శించారు. కేంద్ర బడ్జెట్ మొత్తం వ్యయంతో పోలిస్తే గత 5 సంవత్సరాలలో ఆరోగ్యం కోసం కేటాయించిన బడ్జెట్ 42 శాతం మేర తగ్గింది అని ఖర్గే ఆరోపించారు. మోడీ ప్రభుత్వం ఆరోగ్యం కోసం కేటాయించే బడ్జెట్‌లో కోతలు విధిస్తూ.. సాధారణ ప్రజలకు వైద్య ఖర్చుల్ని పెంచుతున్నారని ఖర్గే కామెంట్ చేశారు. మోడీ హయాంలో ఆరోగ్య వ్యవస్థ ఐసియుకి చేరిందని ఆయన తీవ్రంగా విమర్శించారు.

## గుజరాత్‌కు రెడ్ అలర్ట్ : ఐఎండి




న్యూఢిల్లీ : గుజరాత్‌లో ఎండలు మండిపోతున్నాయి. దీంతో సోమవారం భారత వాతావరణ శాఖ (ఐఎండి) రెడ్ అలర్ట్‌ను జారీ చేసింది. ఆదివారం గుజరాత్‌లో సౌరాష్ట్ర, కచ్ ప్రాంతాల్లో 44 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఈ నేపథ్యంలోనే ఆ రాష్ట్రానికి ఐఎండి రెడ్ అలర్ట్ ప్రకటించింది. ఇక దేశ రాజధాని ఢిల్లీలో రాబోయే రెండు రోజుల్లో అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం ఉందని ఐఎండి అంచనా వేసింది. దీంతో ఢిల్లీకి నేడు ఐఎండి ఎల్లో అలర్ట్ ప్రకటించింది. కాగా, హిమాచల్ ప్రదేశ్, హర్యానా, చండీగఢ్, పంజాబ్, ఢిల్లీ పశ్చిమ ఉత్తరప్రదేశ్, మధ్యప్రపదేశ్, గుజరాత్, గోవా రాష్ట్రాల్లో రాబోయే రెండు రోజులు ఏప్రిల్ 8-9 తేదీల్లో అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం ఉందని ఐఎండి అంచనా వేసింది. అలాగే ఢిల్లీ, రాజస్థాన్, మధ్యప్రదేశ్, మహారాష్ట్ర, గుజరాత్, ఒడిశా రాష్ట్రాల్లోని 21 నగరాల్లో 42 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం ఉందని ఐఎండి తెలిపింది. ఈ రాష్ట్రాల్లోనే కాకుండా.. బీహార్, ఉత్తరప్రదేశ్ రాష్ట్రాల్లో హీట్‌వేవ్ కొనసాగుతుంది. రాజస్థాన్‌లో కూడా ఎండలు మండుతున్నాయి. దీంతో ఏప్రిల్ 9-10 తేదీల్లో ఐఎండి ఎల్లో అలర్జ్ జారీ చేసింది.

# కులాల లెక్కలు.. బిజెపికి చిక్కులు



కులాల వారీగా జనాభా లెక్కలను సేకరించాలని కాంగ్రెస్, ఇతర విపక్షాలు ఎప్పటి నుంచో కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నా చెవిటివాని ముందు శంఖంలా ఉంటోంది. మంగళవారం (ఏప్రిల్ 1) కాంగ్రెస్ అధ్యక్షుడు, రాజ్యసభలో ప్రతిపక్షనాయకుడు మల్లికార్జున ఖర్గే ఈ అంశంపై సవివరంగా ప్రస్తావించారు. కులాల వారీగా జనగణన ఆలస్యం కారణంగా పెద్ద సంఖ్యలో ప్రజలు సంక్షేమ పథకాలకు దూరమవుతున్నారని పేర్కొన్నారు. యుద్ధాలు, అత్యవసర పరిస్థితులు, ఇతర సంక్షోభాల సమయంలో కూడా జనాభా లెక్కల సేకరణ జరిగిందని, కానీ చరిత్రలో మొదటిసారిగా ప్రభుత్వం రికార్డు స్థాయి లో జనగణన నిర్వహించడంలో జాప్యం చేయడం దురదృష్టకరమని వ్యాఖ్యానించారు. దీన్ని నిర్వహించడానికి ప్రభుత్వం ఇష్టపడటం లేదని స్పష్టమవుతోందని విమర్శించారు. ఖర్గే చెప్పిన వివరాల ప్రకారం కేంద్ర ప్రభుత్వానికి కులాల ప్రాతిపదికపై జనాభా గణనపై విముఖత ఉన్నట్టు తెలుస్తోంది. కులాల ప్రాతిపదికగా జనాభా లెక్కలను సేకరించడం సాధ్యం కాదని కేంద్ర ప్రభుత్వం ఎప్పుడో సుప్రీం కోర్టు ముందు చేతులెత్తేసింది. అప్పటినుంచి ఈ సమస్య కొన్నేళ్లపాటు వాయిదా పడుతోంది. 1881 నుంచి దేశంలో ప్రతి పది సంవత్సరాలకు ఓసారి జనాభా లెక్కలను సేకరించడం పరిపాటిగా వస్తోంది. 1931 జనాభా లెక్కలకు ముందు మహాత్మాగాంధీ జనాభా లెక్కలు దేశానికి ఎంత ముఖ్యమో ఆయన గుర్తు చేశారు. మన ఆరోగ్యాన్ని అంచనా వేయడానికి మనకు కాలానుగుణంగా వైద్య పరీక్షలు ఎంత అవసరమో జనాభా లెక్కలు కూడా అంతే అవసరంగా గాంధీజీ ఉదహరించడం ఇక్కడ గమనించాలి. అయితే కులాల వారీ జనాభా లెక్కలు మాత్రం బ్రిటిష్ వారి పాలనలోనే దేశం లో 1933లో చివరిసారి జరిగింది. అప్పటి నుంచి ఆగిపోయిన ఈ ప్రక్రియను తిరిగి చేపట్టాలన్న డిమాండ్ చిరకాలంగా వెనుకబడిన తరగతుల నుంచి వస్తోంది. 1933 నాటి కులాల వారీ సేకరణ ఆధారంగానే ఒబిసిలు దేశ జనాభాలో 36 శాతం మాత్రమే ఉంటారని ఒక వర్గం, 60 నుంచి 70 శాతం వరకు ఉంటారని మరోవర్గం ఎవరికి తోచిన విధంగా వారు వాదన లేవదీయడమే తప్ప కచ్చితమైన వివరాలు ఎవరూ చెప్పలేకపోతున్నారు. అయితే దేశ జనాభాలో వెనుకబడిన తరగతులు అధిక సంఖ్యలోనే ఉంటారని ఎక్కువ శాతం మంది అభిప్రాయపడుతున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో తమకు కేవలం 27 శాతం మాత్రమే రిజర్వేషన్ కల్పించడం న్యాయం కాదని వెనుకబడిన తరగతుల ఆవేదన అరణ్య రోదనగా ఉంటోంది. విపి సింగ్ ప్రధానిగా ఉన్నప్పుడు 1990లో ఒబిసిలకు కేంద్ర ప్రభుత్వ ఉద్యోగాల్లో 27% కోటా కల్పించారు. అప్పటినుంచి తమ జనసంఖ్య ఎంతో తేల్చి ఆ మేరకు రిజర్వేషన్లు కల్పించాలన్న డిమాండ్ ఆ వర్గాలనుంచి బయలుదేరింది. 2001లోను, 2011లోను జనాభా లెక్కలతోపాటు కులాల వారీ లెక్కలు సేకరించాలన్న ఆలోచన అప్పటి ప్రభుత్వాలు పట్టించుకోలేదు. అయితే యుపిఎ ప్రభుత్వం 2011 జనాభా లెక్కల సేకరణలో వేర్వేరుగా సామాజిక, ఆర్థిక కులగణన పేరుతో కొంత సమాచారాన్ని సేకరించింది. ఈ సమాచారం తమకు అందజేస్తే జిల్లా పరిషత్తులు, పంచాయతీ సమితుల చట్టం కింద ఒబిసిలకు 27% రిజర్వేషన్లు అమలు చేయడానికి వీలవుతుందని 2021లో మహారాష్ట్ర ప్రభుత్వం కేంద్రాన్ని అభ్యర్థించింది. ఆ మేరకు సుప్రీం కోర్టులో కూడా వ్యాజ్యాన్ని దాఖలు చేసింది. అయినా కేంద్రం చలించలేదు. ఆ సమాచారం తప్పుల తడకగా ఉందని, దానివల్ల ఎలాంటి ప్రయోజనం కలగదని కేంద్రం సాకులు చెప్పి తప్పించుకుంది. 2021 జనాభా లెక్కల సేకరణలో భాగంగా కులాల వారీ లెక్కలు సేకరించడం సాధ్యం కాదని కేంద్రం సుప్రీం కోర్టుకు స్పష్టం చేసింది. బీహార్ ముఖ్యమంత్రి నితీశ్ కుమార్ కూడా కుల ప్రాతిపదికన జనగణన చేపట్టాలని నాలుగేళ్ల క్రితం ప్రధాని మోడీకి విజ్ఞప్తి చేసినా ఫలించలేదు. ప్రతి పదేళ్లకు ఓసారి చేపట్టే జనాభా లెక్కల సేకరణలో ఎస్‌సి, ఎస్‌టిల జనగణన సాధ్యమవుతున్నప్పుడు ఇతర వెనుకబడిన తరగతుల వివరాలు సేకరించడం ఎందుకు కష్టమవుతుందని కాంగ్రెస్‌తో సహా విపక్షాలు ప్రశ్నిస్తున్నాయి. మండల్ కమిషన్ నివేదిక ఆధారంగా గతంలో విపి సింగ్ ప్రభుత్వం ఒబిసిలకు రిజర్వేషన్ కల్పించినప్పుడు దానికి వ్యతిరేకంగా ఆర్‌ఎస్‌ఎస్ నేతృత్వంలోనే హింసాత్మక ఆందోళనలు చెలరేగడం మరిచిపోలేని వాస్తవం. కులాల గణన పేరు చెబితే కాషాయ నాథులకు కంపరం పుట్టుకొస్తోంది. దీనికి కారణం కులాల శాతాలు బయటపడితే అగ్రవర్ణాలకు దూరం కావలసి వస్తుందని వారి భయం. బిజెపి మొదటి నుంచి హిందుత్వ భావజాలంతో అగ్రవర్ణాలను అక్కునచేర్చుకుని వారిని ఓటు బ్యాంకుగా కొల్లగొడుతోంది. జనాభాలో ఎస్‌సి, ఎస్‌టి, ఒబిసిలు, మైనారిటీలు దాదాపు 80% వరకు ఉన్నారు. వీరంతా పేదరికంలోనే మగ్గుతున్నారు. మిగిలిన 20% అగ్రవర్ణాలు. అగ్రవర్ణాలదే అన్నిటిలో పైచేయిగా ఉంటోంది. దేశ సంపద అంతా అగ్రవర్ణాల అనుభవంలోనే ఉందన్న వాస్తవం గణాంకాలతో బయటపడితే తమ ఉనికికే ముప్పు తప్పదన్న పిరికితనం కమలనాథులను వెంటాడుతోంది. ఈ నేపథ్యంలో బిజెపి నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం కులాల గణనకు ముందుకు రాకుండా ఏవో సాకులతో విపరీత కాలయాపన చేస్తోందన్న విమర్శలు కాంగ్రెస్ తదితర విపక్షాల నుంచి వస్తున్నాయి. అంతేకాదు ఈ సంవత్సరం బడ్జెట్‌లో జనాభా గణన కోసం రూ. 575 కోట్లు మాత్రమే కేటాయించడం బట్టి చూస్తే కేంద్ర ప్రభుత్వానికి కులాల వారీ జనాభా లెక్కల సేకరణ బొత్తిగా ఇష్టం లేదనిపిస్తోందని రాజ్యసభలో విపక్ష నాయకుడు మల్లికార్జున ఖర్గే చేసిన వ్యాఖ్యల్లో యదార్థం లేకపోలేదు.

# సమిష్టి డిమాండ్ తగ్గిపోతోంది



సాధారణంగా సమిష్టి డిమాండ్ (మొత్తం డిమాండ్) అంటే ఒక నిర్దిష్ట ధర వద్ద, ఒక నిర్దిష్ట కాలంలో వస్తువులు, సేవలకు మార్పిడి చేయబడిన మొత్తం ద్రవ్యంగా వ్యక్తీకరించబడుతుంది. మొత్తం డిమాండ్‌ను సాధారణంగా వినియోగం, పెట్టుబడి, ప్రభుత్వ వ్యయం, నికర ఎగుమతులు వంటి నాలుగు వనరుల మొత్తంగా వర్ణిస్తారు. ప్రపంచ సమిష్టి డిమాండ్ తగ్గడానికి దోహదపడే ప్రధాన అంశాలుగా పెరుగుతున్న ద్రవ్యోల్బణం, జీవన వ్యయం వంటి వి ఉన్నాయి. ప్రపంచ ద్రవ్యోల్బణ ఒత్తిళ్లు, జీవన వ్యయ సంక్షోభం, ఇంధన ధరలు, వడ్డీ రేటు పెంపుదల, ప్రపంచ పరపతి కఠినత్వం, కొవిడ్ మహమ్మారి పరిణామాలు, లాజిస్టిక్స్ సవాళ్లు, ముడి పదార్థాల కొరత, భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు, రష్యా- ఉక్రెయిన్ యుద్ధం, వాణిజ్య అనిశ్చితి మొదలైనవి మొత్తం డిమాండ్ తగ్గడానికి కారణమవుతున్నాయి. సమష్టి డిమాండ్ తగ్గడం వల్ల వాస్తవ స్థూల దేశీయోత్పత్తి, ఆర్థిక ఉత్పత్తి తగ్గే అవకాశం ఉంది. అంతర్జాతీయ ద్రవ్యనిధి (ఐఎంఎఫ్) ప్రకారం 2025, 2026 సంవత్సరాల్లో ప్రపంచ వృద్ధి 3.3 శాతంగా అంచనా వేయబడింది, ఇది చారిత్రక (2000-19) సగటు 3.7 శాతం కంటే తక్కువ. అభివృద్ధి చెందిన, అభివృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థలలో మందగమనం ప్రపంచ డిమాండ్ బలహీనపడటానికి దోహదం చేస్తుంది. అమెరికా, యూరోపియన్ దేశాల నుండి చైనా, భారతదేశం, బ్రెజిల్ వరకు ప్రపంచవ్యాప్తంగా ఉన్న దేశాలు ద్రవ్యోల్బణం, వడ్డీరేటు పెంపుదల, ప్రపంచ సరఫరా గొలుసు అంతరాయాలు, భౌగోళిక రాజకీయ అనిశ్చితుల మిశ్రమం కారణంగా తగ్గుతున్న సమష్టి డిమాండ్ సమస్యను ఎదుర్కొంటున్నాయి. అనేక ఇతర ఆర్థిక వ్యవస్థల మాదిరిగానే భారతదేశం కూడా తగ్గుతున్న మొత్తం డిమాండ్ ద్వారా గణనీయంగా ప్రభావితమవుతుంది. భారతదేశంలోమొత్తం డిమాండ్‌లో తగ్గుదల ప్రధానంగా తగ్గిన వినియోగం, తగ్గిన పెట్టుబడి, తగ్గుతున్న ప్రభుత్వ వ్యయం, బలహీనమైన నికర ఎగుమతుల నుండి వస్తుంది. ఏదేశమైనా దేశీయ వినియోగంపై ఎక్కువగా ఆధారపడి ఉంటుంది. ఇది దాని స్థూల దేశీయోత్పత్తిలో గణనీయమైన భాగాన్ని కలిగి ఉంటుంది. అందువల్ల, డిమాండ్‌లో ఏదైనా మందగమనం ఆర్థిక వ్యవస్థలోని అన్ని రంగాలలో భిన్న పరిణామాలను కలిగిస్తుంది. ఆర్థిక మాంద్యం, పేదరికం, అసమానత, రాజకీయ అస్థిరత, ముఖ్యంగా బ్యాంకింగ్ రంగంపై ప్రభావం, నిరర్థక ఆస్తులు (ఎన్‌పిఎలు) వంటి విస్తృత ఆర్థిక పరిణామాల కారణంగా భారతదేశం తగ్గుతున్న మొత్తం డిమాండ్ ద్వారా తీవ్రంగా ప్రభావితమవుతుంది. ఈ ప్రభావాలు ఉపాధి నుండి వ్యాపార పెట్టుబడి, ఎగుమతులు, ఆర్థిక ఆరోగ్యం వరకు వివిధ రంగాలలో అలలు రేపుతాయి. భారతదేశంలో మొత్తం డిమాండ్‌ను ప్రభావితం చేసే కీలక అంశాలు చూసినపుడు ద్రవ్యోల్బణ ఒత్తిడి ఫిబ్రవరి 2025లో 3.6%. ఇది కొనుగోలు శక్తిని తగ్గిస్తుంది, వినియోగాన్ని ప్రభావితం చేస్తుంది. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బిఐ) ద్రవ్యోల్బణ ఒత్తిళ్లకు ప్రతిస్పందనగా వడ్డీ రేట్లను పెంచింది, ఇది ప్రైవేట్ పెట్టుబడి, వినియోగాన్ని తగ్గించవచ్చు, ప్రధాన ఆర్థిక వ్యవస్థలలో అమెరికా, చైనా మందగమనం, భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు, కోవిడ్ మహమ్మారి వంటి ప్రపంచ అంశాలు భారతదేశ ఎగుమతులు, పెట్టుబడి రాకపోకలు ద్రవ్యోల్బణంపై గణనీయమైన ప్రభావాన్ని చూపుతాయి. ప్రభుత్వ సంస్కరణలు వస్తువులు, సేవల పన్ను (జిఎస్‌టి), మేక్ ఇన్ ఇండియా, ఆత్మనిర్భర్ భారత్ వంటి నిర్మాణాత్మక సంస్కరణలు దేశీయ తయారీ, పెట్టుబడి ఎగుమతులను పెంచడం లక్ష్యంగా పెట్టుకున్నాయి. అయితే, వాటి పూర్తి ప్రభావాలు కార్యరూపం దాల్చడానికి సమయం పట్టవచ్చు. డిసెంబర్ 2024లో, భారత దేశంలో ప్రైవేట్ వినియోగం స్థూల దేశీయోత్పత్తిలో 64.8% వాటాను కలిగి ఉంది. కొవిడ్ మహమ్మారి తర్వాత గ్రామీణ భారతదేశం గణనీయమైన కోలుకుంది. అయినప్పటికీ పట్టణ ప్రాంతాలు ఇప్పటికీ మొత్తం వినియోగంలో ఎక్కువ వాటాను కలిగి ఉన్నాయి. అయితే, వ్యవసాయ ఇబ్బందులు, ఆదాయ అసమానత ఇతర నిర్మాణాత్మక సవాళ్ల కారణంగా గ్రామీణ ప్రాంతాల్లో వినియోగ వృద్ధి కొద్దిగా నెమ్మదిగా ఉంది. భారతదేశ రిటైల్ రంగం దేశ స్థూల దేశీయోత్పత్తికి దాదాపు 10% దోహదపడుతుంది. వచ్చే దశాబ్దంలో దాదాపు 9- 10% కాంపౌండ్ వార్షిక వృద్ధి రేటు (సిఎజిఆర్) వద్ద వృద్ధి చెందుతుందని అంచనా వేయబడింది, 2032 నాటికి దాదాపు 2 ట్రిలియన్ల విలువను చేరుకుంటుంది. భారతదేశ వినియోగదారుల విశ్వాసం హెచ్చుతగ్గులకు లోనవుతోంది. ద్రవ్యోల్బణ ఒత్తిళ్లు, అధిక ఇంధన ధరలు ఉపాధి ఆందోళనల కారణంగా 2024లో వినియోగదారుల ఆశావాదం తగ్గినట్లు నీల్సన్ ఐక్యూ వినియోగదారుల విశ్వాస సూచిక చూపించింది.సాంకేతికత, ఇ-కామర్స్, తయారీ వంటి రంగాలలో విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు ప్రవాహాలు బలంగా ఉన్నాయి. 2024లో, ఏప్రిల్- డిసెంబర్ కాలంలో భారతదేశ విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు (ఎఫ్‌డిఐ) 27% పెరిగాయి. అయితే, అధిక నిష్క్రమణల కారణంగా నికర ఎఫ్‌డిఐ తగ్గింది. 2024 -25 ఆర్థిక సంవత్సరంలో, భారతదేశ ప్రభుత్వ వ్యయం 48.21 లక్షల కోట్లుగా అంచనా వేయబడింది, ఇది స్థూల దేశీయోత్పత్తి లో 19.4%.ఈ భాగాలలో ఏదైనా తగ్గుదల సమిష్టి డిమాండ్ తగ్గడానికి దారితీస్తుంది. మెరుగుపరచడానికి చర్యలు ఒక దేశం కేంద్రబ్యాంకు నియంత్రణలో ఉన్న ద్రవ్యవిధానం, రుణ వ్యయాలు, పెట్టుబడి, వినియోగదారుల ఖర్చులను ప్రభావితం చేయడం ద్వారా మొత్తం డిమాండ్‌ను నేరుగా ప్రభావితం చేస్తుంది. ఉదాహరణకు అమెరికాలోని ఫెడరల్ రిజర్వ్, యూరోపియన్ సెంట్రల్ బ్యాంక్ (ఇసిబి) ఆర్థిక వ్యవస్థను ఉత్తేజపరిచేందుకు వారి బెంచ్‌మార్క్ వడ్డీ రేట్లను తగ్గించవచ్చు. యూరోపియన్ సెంట్రల్ బ్యాంక్, బ్యాంక్ ఆఫ్ జపాన్ గతంలో ప్రతికూల వడ్డీ రేట్లతో ప్రయోగాలు చేశాయి. ఆర్థిక వ్యవస్థలో డిమాండ్‌ను ప్రత్యక్షంగా ప్రభావితం చేయడానికి ప్రభుత్వాలు ఆర్థిక విధానాన్ని ఉపయోగించవచ్చు. చైనా బెల్ట్ అండ్ రోడ్ ఇనిషియేటివ్, 2021 అమెరికా ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ బిల్లు వంటి పెద్ద-స్థాయి మౌలిక సదుపాయాల ప్రాజెక్టులు మొత్తం డిమాండ్‌ను పెంచే లక్ష్యంతో ఆర్థిక ఉద్దీపన ప్రకటించాయి. కోవిడ్ మహమ్మారి సమయంలో అమెరికా నిరుద్యోగ బీమా ప్రయోజనాలు, అలాగే స్పెయిన్, ఫిన్లాండ్ వంటి దేశాలలో యూనివర్సల్ బేసిక్ ఇన్‌కమ్ (యుబిఐ) చర్చలు ఇందుకు ఉదాహరణలు. ఇటీవల, చైనా భారీ మౌలిక సదుపాయాల ప్రాజెక్టులు, మొత్తం డిమాండ్‌ను పెంచడానికి మౌలిక సదుపాయాలను ఉపయోగించుకోవడానికి ఒక ఉదాహరణ.

# నీటి విలాపం



'నీటి పేరు వింటేనే నిలువునా తడిసిపోతాం/ నీరంటేనే జలజలలాడిపోతాం/ నీటితనంలో ప్రాణులం/ నిత్యజీవన తేజో విరాజితులమౌతాం' అంటారు ప్రొ.ఎన్.గోపి. కాల్వలై, వాగులై, వంకలై, నదులై, సముద్రాలై భూమిని జలచర్మధారిణిగా మార్చేసింది నీరు. కూర్చుని తింటే కొండలైనా తరిగిపోతాయంటారు పెద్దలు. వాడుకోవడమే తప్ప చుక్క నీటిని కూడా పొదుపు చేయలేని మనం తోడుతూపోతే భూగర్భం మొత్తం ఖాళీ అయిపోతుంది. భూమిపై లభ్యమయ్యే మొత్తం నీటిలో 97 శాతానికి పైగా సముద్ర జలం. ఇది భూప్రాణులకు ప్రత్యక్షంగా ఉపయోగపడేది కాదు. మరో రెండు శాతానికి పైగా మంచురూపంలో వుంది. ఇక మిగిలిన ఒక శాతంగా తక్కువగా వున్న మంచినీరు మాత్రమే ప్రాణులకు పనికొచ్చేది. సకల జీవరాసులకు ప్రాణాధారమైన నీరు గాలితో పాటు భూమిపై అత్యంత విస్తారంగా లభించే సహజ వనరు. ఇప్పుడా మంచినీటికి పెద్ద ముప్పు ఏర్పడింది. పెరుగుతున్న జనాభా, పర్యావరణ కాలుష్యంతో మంచినీటికి గడ్డుకాలం ఏర్పడింది. కార్పొరేట్ సంస్థలు ఈ పరిస్థితిని ఉపయోగించుకొని, నీటిని సరుకుగా మార్చేశాయి. ప్రాణాధారమైన నీటిని ప్రైవేట్‌పరం చేసే ప్రక్రియ 1990లలో మొదలైనా అదిప్పుడు వేగంగా ప్రపంచమంతా పాకుతోంది. తాగునీటికి, సాగునీటికి తీవ్ర ఎద్దడి ఏర్పడుతోంది. గుక్కెడు నీళ్లు దొరక్క గొంతెండిపోయే పల్లెలు, దాహం తీర్చుకోడానికి డబ్బాలు, బిందెలు పట్టుకుని చెలమలు, బావుల వెంట పరుగులెత్తే జనాలు%ౌ% సాగునీటి కోసం అష్టకష్టాలు పడే రైతులు వికసిత్ భారత్‌లో నిత్యం పత్రికల్లో కనిపించే వాస్తవిక దృశ్యాలు. వేసవి ప్రారంభంలోనే రాష్ట్రంలో నీటి సంక్షోభం మొదలైంది. అనేక జిల్లాలు తీవ్రమైన నీటి కొరతను ఎదుర్కొంటున్నాయి. అవసరానికి మించిన నీటి వినియోగంతో భూగర్భజలాలు అడుగంటుతున్నాయి. 'రాష్ట్రంలో 2,617 గ్రామాల్లో భూగర్భ జలాలు తక్కువగా వున్నాయని, వీటిలో దాదాపు 300 గ్రామాల్లో నీటిని ప్రమాదభరితంగా తోడేస్తున్నారని' ఇటీవల కేంద్ర భూగర్భ జలవనరుల శాఖ నిర్వహించిన అధ్యయనం వెల్లడించింది. కాగా, రాష్ట్రంలోని 679 మండలాల్లో 332 మండలాలు నీటికొరతను ఎదుర్కొంటున్నాయి రాష్ట్ర ప్రభుత్వం అంచనా వేసింది. ఈ మండలాల పరిధిలోని 3,549 నివాస ప్రాంతాల్లోని ప్రజలు తీవ్ర నీటి ఎద్దడి ఎదుర్కొంటారనీ ప్రభుత్వం తేల్చింది. అయితే, నీటి ఎద్దడి నుంచి ప్రజలకు ఉపశమనం కలిగించేందుకు అవసరమైన యాక్షన్ ప్లాన్ ఇప్పటివరకూ పూర్తికాలేదు. 'నీటికొరత ప్రపంచవ్యాప్తంగా ఆందోళన కలిగించే అంశం. కానీ, భారత్ వంటి దేశాల్లో లక్షలాది మందిని ప్రభావితం చేసే రోజువారీ సంక్షోభం' అంటారు మాజీ ఐరాస ప్రధాన కార్యదర్శి బాన్ కీ మూన్. నీటికి మీటర్లు పెట్టి కొలిచే పిదపకాలం దాపురించింది. ఒకప్పుడు చెరువులు, వాగులు, వంకల్లో నీళ్లు వాడుకునేవారు. ఇప్పుడివేవీ కనిపించవు. పశువులు తాగడానికి కూడా చెరువుల్లో నీళ్లు లేవు. కొన్నిచోట్ల చెరువులే మాయమైపోయాయి. నీటిని సంరక్షించుకోకపోతే మనిషి మనుగడకే ముప్పు. ఇది ఒక్క భారత్‌కే పరిమితమైన సమస్య కాదు. 2050 నాటికి ప్రపంచంలో చాలా భాగం తీవ్రమైన నీటి సంక్షోభాన్ని ఎదుర్కోనుందని వరల్డ్ రిసోర్సెస్ ఇన్‌స్టిట్యూట్ అధ్యయనం చెబుతోంది. నీతి అయోగ్ నివేదిక ప్రకారం 2030 నాటికి 40 శాతం మంది భారతీయులకు తాగునీరు అందుబాటులో వుండదు. 'జ్ఞానం వికసించిన జలతీరాల్లో/ వాణిజ్యం పడగవిప్పింది/ మితిమీరిన వాణిజ్యదాహం/ నీటి ప్రాణాన్ని బలిగొంటున్నది' అంటారు ఎన్.గోపి 'జలగీతం'లో. నీటివ్యాపారం



మూడువువ్వులు ఆరు కాయలుగా విరాజిల్లుతోంది. బడా కంపెనీలు లాభాలార్జిస్తుండగా, ప్రజలకు, పర్యావరణానికి తీవ్రనష్టం కలుగుతోంది. ప్రజలకు తాగు, సాగు నీటిని అందించాల్సిన ప్రభుత్వాలు.. అందుకవసరమైన చర్యలు తీసుకోకపోగా, భూగర్భ జలాలను తోడేస్తున్న కార్పొరేట్ కంపెనీల కొమ్ముకాస్తున్నాయి. వేసవి వచ్చిన తర్వాత చర్యలు తీసుకోవడం కాక భూగర్భ జలాలను సంరక్షించడం, నీటిని పొదుపు చేయడం వంటి తక్షణావసరాన్ని ప్రభుత్వాలు గుర్తించాలి. చెరువులు, వాగులు, వంకలు, నదులు, సముద్రాల వంటి సహజవనరులను పరిరక్షించుకోవాలి. నీటి విలాపాన్ని నివారించాలి.